7. 31 మార్చి, 2023తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి రూ.2/- (రూపాయలు రెండు మాత్రమే) ముఖ విలువగల ఈక్విటీ వాటాకు 30% (ముప్పై శాతం) (అనగా రూ.0.60 (రూపాయలు అరవై పైసలు మాత్రమే) డివిడెండ్‌ను 25 మే, 2023న నిర్వహించబడిన బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో సిఫారసు చేసింది, ఏజిఎం వద్ద వాటాదారుల ఆమోదానికి లోబడి ఉంటుందని వాటాదారులు గమనించగలరు.
8. 31 మార్చి, 2023తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి డివిడెండ్‌కు సభ్యుల ఎన్‌టైటిల్‌మెంట్ నిర్ణయించుటకు మరియు ఏజిఎం నిమిత్తం **సోమవారం, 11 సెప్టెంబర్, 2023ను 'రికార్డు తేది'** గా కంపెనీ నిర్ణయించింది. సమావేశంలో ఒకవేళ డివిడెండ్ ప్రకటిస్తే, రికార్డు తేది నాటికి కంపెనీ యొక్క సభ్యుల రిజిస్టర్‌లో పేరుగల సభ్యులకు చెల్లించబడును. డిమేటీరియలైజ్డ్ విధానంలో నిర్వహించిన వాటాలకు సంబంధించి, ఆ తేది నాటికి బెనిఫిషియల్ ఓనర్స్‌గా నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ మరియు సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్‌చే సమర్పించిన పేరుగల సభ్యులకు చెల్లించబడును. ఈక్విటీ వాటాలపై డివిడెండ్‌ను సమావేశంలో ప్రకటిస్తే, ఈ సమావేశం తేది నుండి 30 రోజుల్లోపు క్రెడిట్/ డిస్పాచ్ చేయబడును.
9. ఏజిఎం వద్ద వాటాదారులచే ఒకవేళ డివిడెండ్ ఆమోదిస్తే, కంపెనీయొక్క ఆర్‌టిఏ/ డిపిలతో వారి బ్యాంకు ఖాతా వివరాలను అప్‌డేట్‌చేసిన అట్టి వాటాదారులకు వివిధ ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ విధానాల ద్వారా ఎలక్ట్రానికల్లీ చెల్లించబడును. వారి బ్యాంకు ఖాతా వివరాలను అప్‌డేట్‌చేయని అట్టి వాటాదారులకు, డివిడెండ్ వారెంట్లు/ డిమాండ్ డ్రాఫ్టులు/ చెక్‌లను పోస్టల్ సౌకర్యం లభించిన తర్వాత వారి సాధారణ చిరునామాలకు పంపబడుతుంది మరియు సాధారణ స్థితి పునరుద్ధరించబడుతుంది. పేమెంట్ తేదిన వారి బ్యాంకు ఖాతాలోకి నేరుగా డివిడెండ్‌ను స్వీకరించుటకు మరియు స్వీకరించిన డివిడెండ్‌లో జాప్యం నివారించుటకు, ఫిజికల్ విధానంలో నిర్వహించిన వాటాలకు సంబంధించి కెఫిన్‌టెక్‌తో మరియు ఎలక్ట్రానిక్ రూపంలో నిర్వహించినవాటాల విషయంలో వారి డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో వాటాదారులయొక్క పేరుతో క్యాన్సల్డ్ చెక్ యొక్క కాపీతోపాటుగా వారి బ్యాంకు వివరాలు (అనగా బ్యాంకు& బ్రాంచ్ పేరు, బ్యాంకు ఖాతా వివరాలు, 9 డిజిట్స్ ఎంఐసిఆర్ నెంబరు, 11 డిజిట్ ఐఎఫ్ఎస్ కోడ్ మరియు ఖాతా నేచర్)ను వాటాదారులు అప్‌డేట్ చేసుకోవాలి.
10. తదుపరిగా ప్రకటన ఇవ్వడమేమనగా ఏజిఎం నిమిత్తం మరియు ఏజిఎం వద్ద వాటాదారుల ఆమోదానికి లోబడి ఆర్థిక సంవత్సరం 2022-23 కొరకు తుది డివిడెండ్ చెల్లింపు నిమిత్తం సభ్యుల రిజిస్టర్ మరియు వాటా బదిలీ పుస్తకాలు మంగళవారం, 12 సెప్టెంబర్, 2023 నుండి సోమవారం, 18 సెప్టెంబర్, 2023 వరకు (రెండు రోజులతో మూసియుండును).

పోకర్ణ లిమిటెడ్ తరఫున మరియు కొరకు
సం/-
దిశ జిందాల్
కంపెనీ సెక్రటరీ

ప్రదేశం: సికింద్రాబాద్
తేది: 09 ఆగస్టు, 2023

పత్తికి బూజు... మిర్చిపై మోజు



ఇప్పటికీ రైతుల ఇండ్లల్లోనే కాటన్ నిల్వలు

- వర్షాలకు డ్యామేజ్ • గతేడాది ఆశించిన ధర లేక.. ఇప్పుడు తగ్గిన సాగు విస్తీర్ణం • క్వింటాల్ రూ.25వేలు పలికిన మిర్చి • కోల్డ్‌స్టోరేజీల్లో గణనీయంగా తగ్గిన మిరప నిల్వలు • మద్దతు ధరపై నోరు మెదపని కేంద్రం



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

పిండి కొద్దీ రొట్టె..' అనే మాదిరిగానే 'ధర కొద్దీ పంట' అనే రీతిలో పత్తి, మిర్చి సాగు విస్తీర్ణాలు ఉన్నాయి. గతేడాది మిర్చి ధర ఆశాజనకంగా ఉండటం.. పత్తికి ధర లేక ఇప్పటికీ పంట ఇండ్లల్లోనే నిల్వ ఉండటం వల్ల ఈసారి రైతులు ఎక్కువగా మిర్చి సాగుకు మొగ్గుచూపుతున్నారు. క్వింటాల్ మిర్చికి రూ.25వేల వరకూ పలకడంతో వచ్చిన దిగుబడిని వచ్చినట్టే అమ్మేశారు. అదే పత్తి విషయానికొస్తే గతేడాది మొదట్లో క్వింటాల్ రూ.10వేల మార్క్‌ను తాకిన పంట ఆ తర్వాత క్రమేణా తగ్గింది. పంట ఉత్పత్తి ఊపందుకునే దశలో అసలు సీసీఐ కొనుగోళ్లే చేయకపోవడం.. ప్రయివేటు వ్యాపారులు క్వింటాల్ పత్తి రూ.6వేల వరకే కొనుగోలు చేయడంతో ఎక్కువ మంది రైతులు ఇండ్లల్లోనే పత్తిని నిల్వ చేసుకున్నారు. ఎప్పటికైనా ధర పెరగకపోదా అని ఎదురుచూస్తున్నారు. ఇంతలో వరుసగా 19రోజుల పాటు వర్షాలు రావడంతో నిల్వ చేసిన పత్తిలో తేమ శాతం పెరిగి బూజు పట్టిందని రైతులు వాపోతున్నారు. ఎప్పటికప్పుడు పత్తి తిరగేసినా కొంతమేర డ్యామేజ్ అయిందని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. పత్తి గింజలో తేమశాతం పూర్తిగా తగ్గడంతో తూకంలోనూ భారీ వ్యత్యాసం వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

పత్తి దిగుబడి...ధర రెండూ తగ్గుతున్నాయి

ధరతో పాటు కొన్నేండ్లుగా పత్తి దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. ఏడెనిమిదేండ్ల కిందటి వరకు ఎకరానికి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిన పత్తి నాలుగైదేండ్లుగా తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం ఎకరానికి నాలుగైదు క్వింటాళ్లకు మించి రావడం లేదని రైతులు చెబుతున్నారు. దీనికితోడు ధర కూడా ఉండటం లేదు.

ఎకరానికి రూ.20వేల ఖర్చు వస్తే రూ.25వేల ఆదాయం వస్తోంది. అది కూడా ధర మంచిగా ఉన్నప్పుడు మాత్రమే. దీతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల ఎకరాల్లో సాగైన పత్తి ఈ ఏడాది సగానికి తగ్గినట్టు వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఒక్క ఖమ్మం జిల్లాలోనే గతేడాది 2.21 లక్షల ఎకరాల్లో పత్తి సాగైతే.. ఈ ఏడాది 1.78 లక్షల ఎకరాల్లోనే సేద్యం చేశారు. ఈ ఏడాది వర్షాలు సకాలంలో పడకపోవడంతో ఇప్పటికే గూడ దశలో ఉండాల్సిన పత్తి ఇప్పుడిప్పుడే మొక్కలు వేళ్లూనుకుంటోంది. మద్దతు ధర ఇచ్చి పత్తి రైతును ఆదుకోవాల్సిన సీసీఐ 2021 నుంచి ఏ ఒక్క మార్కెట్లోనూ అడుగుపెట్టడం లేదు. క్వింటాల్‌కు రూ.6,300 మద్దతు ధర మాత్రమే ప్రకటించి చేతులు దులుపుకుంది. క్వింటాల్ పత్తికి రూ.12వేల మద్దతు ధర ఇవ్వాలని రైతుసంఘాలు డిమాండ్ చేస్తున్నా కేంద్రం పెడచెవిన పెడుతోంది.

మిర్చిపై రైతుల ఆసక్తి..

ఉండటంతో రైతులు ఆ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. 2021-22లో తామరనల్లి ప్రభావంతో గతేడాది మిర్చి సాగు విస్తీర్ణాన్ని తగ్గించిన రైతాంగం ఈ ఏడాది అటువైపే మొగ్గుచూపుతున్నారు. క్వింటాల్ తేజా రకం మిర్చి వరంగల్ మార్కెట్లో రూ.25వేల వరకు పలుకగా.. ఖమ్మంలోనూ ధర దానికి సమీపంలోకి వచ్చింది. రూ.24వేలకు పైగా నమోదైంది.

దీనికితోడు ఈ ఖరీఫ్ సీజన్‌లో పత్తి సాగుకు అనుకూలంగా వర్షాలు సకాలంలో కురవకపోవడంతో రైతులు మిర్చివైపు మళ్లుతున్నట్టు తెలుస్తోంది. గతేడాది ఖమ్మం జిల్లాలో 65వేల ఎకరాల్లో సాగైన మిర్చి ఈ ఏడాది 1.05 లక్షల ఎకరాలకు చేరుతుందని వ్యవసాయశాఖ అంచనా. భద్రాద్రి కొత్తగూడెంలో గతేడాది 20వేల ఎకరాల్లో వేస్తే ఈ ఏడాది 30వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉంది. తామరనల్లి ప్రభావం కూడా తగ్గడంతో రాష్ట్రవ్యాప్తంగా మిర్చి సాగు విస్తీర్ణం పెరగొచ్చని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. గత బుధవారం వ్యవసాయశాఖ కమిషనర్ రఘునందన్‌రావు నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లోనూ పత్తికి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గుచూపుతున్నట్టుగా ఆయా జిల్లాల వ్యవసాయశాఖ అధికారుల నుంచి అభిప్రాయం వెల్లడైంది.

దూదికి బూజు పడుతోంది..



గతేడాది ఐదెకరాల్లో పత్తి వేసినా. మొదట్లో రూ.9వేల వరకు ధర ఉండటంతో రెండు, మూడు క్వింటాళ్లు అమ్మిన. ఆ తర్వాత పత్తినంతా నిల్వ చేశా. కనీసం రూ.8వేల ధర పెట్టినా అమ్ముదామని 8 నెలలుగా ఎదురుచూస్తున్నాను. నిల్వ చేసిన పత్తి వర్షాలకు బూజు పడుతోంది కానీ ధర మాత్రం రావడం లేదు. భారీగా నష్టాలు వచ్చేలా ఉన్నాయి.

- రాయబారపు వీరబాబు, పమ్మి, ముదిగొండ

గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ తేదీని పొడిగించాలి

- ఎన్నికల వాగ్దానం మేరకు ప్రతి ఇంటికీ రూ.5.5 లక్షలివ్వాలి
- ఆదాయం, కులం, సదరం సర్టిఫికెట్లు తప్పనిసరనే నిబంధనను ఎత్తేయాలి
- గుడిసె వాసులందర్నీ అర్హులుగా గుర్తించాలి : వ్యకాస

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గృహలక్ష్మి కింద దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల పదో తేదీని తుది గడువుగా నిర్ణయించడం సరిగాదనీ, గడువును పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. కుల, ఆదాయ, సదరం ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా జమచేయాలనే నిబంధన లబ్దిదారులను కుదించే చర్య అని విమర్శించారు. ఆ నిబంధనను వెంటనే ఎత్తేయాలని డిమాండ్ చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే వారం నుంచి పది రోజులు పడుతుందని పేర్కొన్నారు. కేవలం రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలనీ, ఆ ధ్రువీకరణ పత్రాలను జతచేయాలనటం దారుణమని పేర్కొన్నారు. గత ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇంటి స్థలమున్న వారికి రూ.5.5 లక్షలు ఇస్తామంటూ బీఆర్ఎస్ ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని కోరారు. రూ. 3 లక్షలతో ఇల్లు ఎలా పూర్తవుతుందో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలను ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. వారికి నివాసస్థల పట్టా ఇవ్వడంతో పాటు గృహలక్ష్మి లబ్దిదారులుగా గుర్తించాలని కోరారు. వ్యక్తిగత వాంగ్మూలం ఆధారంగా గుడిసె వాసుల దరఖాస్తులను అధికారులు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లబ్దిదారుల ఎంపికను గ్రామ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టాలనీ, అందులో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉండే విధంగా చూడాలని కోరారు.

ఈ ఏడాదిలో అసెంబ్లీ 14 రోజులేనా?

- బీజేపీ ఎమ్మెల్యేలకు రూమ్‌ఇవ్వకపోవడందారుణం : ఈటల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ సమావేశాలను ఈ ఏడాది 14 రోజుల పాటే నిర్వహించడం దారుణమని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. గతంలో 55 నుంచి 60 రోజులు నడిచేవని గుర్తుచేశారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నాలుగున్నరేండ్ల పాటు అన్ని పార్టీల సభ్యులూ సహకరించారనీ, తెలంగాణలో ప్రశాంతంగా సమావేశాలు నిర్వహిస్తున్నామనే కితాబు వస్తుందని స్పీకర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో అన్ని పార్టీల సభ్యులకూ అసెంబ్లీ ఆవరణంలో రూములను కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. బీజేపీ ఎమ్మెల్యేలం ముగ్గురమున్నా రూమ్ కేటాయించకపోవడం అన్యాయమన్నారు. తమ హక్కులను కాపాడాల్సిన స్పీకర్ బాధ్యతను మరిచారనీ, దీంతో తాము సెక్యూరిటీల రూముల్లో కూర్చొని నోట్లు రాసుకున్నామని తెలిపారు. అధికార పార్టీ సభ్యులు ఎంత సేపు మాట్లాడినా అవకాశమిచ్చారనీ, తాము లేవగానే సీఎం, మంత్రుల వైపు చూస్తూ స్పీకర్ బెల్ మోగించడం దారుణమని విమర్శించారు. బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు మిత్రపక్షాలు అని సీఎం అంటున్నారన్నారు. అలాంటప్పుడు సభలో ప్రతిపక్ష పార్టీ ఎలా అవుతుందని ప్రశ్నించారు. పోలీసులకు, ఆఫీసర్లకు ఫోన్లు చేసేవారిగా ఎమ్మెల్యేలను మార్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని బట్టే సీఎం కేసీఆర్‌కు చట్టసభల మీద విశ్వాసం లేదని అర్థమవుతున్నదని విమర్శించారు. వరద బాధితులకు సహాయం చేయాలని అడిగితే తాము 100 మంది సభ్యులమున్నామంటూ ర్యాగింగ్ చేయడం దారుణమన్నారు. కాగ్ రిపోర్టు ఎత్తి చూపిన లోపాలపై కనీసం చర్చకు పెట్టకపోవడాన్ని తప్పుబట్టారు. కోకాపేటలో రూ.100 కోట్లకు ఎకరం అమ్మడం వెనుక ఏదో లోపాయికారి ఒప్పందం ఉందని ఆరోపించారు. గ్రామాల్లో కూడా రూ.40 లక్షలకు ఎకరం పలుకుతున్నదనీ, కంపెనీల కోసం రైతుల నుంచి సేకరిస్తున్న భూములకు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకే పరిహారం ఇవ్వడమేంటని ప్రశ్నించారు. దళితుల నుంచి 5800 అసైన్డ్ భూములను బెదిరించి ప్రభుత్వం లాక్కున్నదని విమర్శించారు. కలెక్టర్లకు టార్గెట్లు పెట్టి భూములను అమ్మించడం దారుణమన్నారు.

సాగునీటి విడుదలపై స్పష్టతివ్వాలి

రుణమాఫీని వెంటనే అమలు చేయాలి

- గృహలక్ష్మి పథకం దరఖాస్తుకు గడువు పెంచాలి : మాజీ ఎమ్మెల్యే జూలకంటి



నవతెలంగాణ-మిర్యాలగూడ

నాగార్జునసాగర్ ఎడమకాలకు నీటి విడుదలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వర్షాకాలం సీజన్‌లో నీటి విడుదలపై అనుమానాలు ఉన్నాయన్నారు. ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, దీనివల్ల బోర్లు, బావులు, చెరువులు ఎండిపోతున్నాయని చెప్పారు. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద నీరు వస్తోందని, ఆ నీటిని దిగువన సాగర్‌కు వదిలి తద్వారా ఎడమకాలువకు విడుదల చేసినట్టయితే ఆయకట్టుకు కొంత మెరకు జీవం పోసినట్టవుతుందన్నారు. ఇప్పటికే ఆయకట్టులో బోర్లు, బావుల కింద వరి నాట్లు వేసుకున్నారన్నారు. వాటిని కాపాడేందుకు సాగర్ కాలువ నీటిని విడుదల చేయాలన్నారు. సాగర్‌లో మరమ్మతులు చేస్తున్నామని, నీళ్ల తక్కువగా ఉన్నాయని సాకులు చూపి నీటి విడుదలపై జాప్యం చేయడం సరికాదన్నారు.

అదేవిధంగా, రుణమాఫీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం సీజన్ ప్రారంభం కావడం వల్ల రైతులకు పెట్టుబడులు అవసరం ఉందని, రుణమాఫీ వెంటనే చేస్తే మళ్ళీ రుణాలు తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సొంత స్థలం ఉన్న వారికి గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకంలో నిబంధనలు గందరగోళంగా ఉన్నాయని చెప్పారు. స్పష్టమైన నిబంధనలు పెట్టి గతంలో వేరే లబ్ది పొందిన వారిని కూడా ఈ పథకంలో అర్హులుగా గుర్తించాలని సూచించారు. దరఖాస్తులకు మూడ్రోజులు మాత్రమే సమయం ఇవ్వడం సరికాదన్నారు. నెలాఖరు వరకు గడువు పొడిగించాలని కోరారు.

34 రోజులుగా గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె చేస్తున్నారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ విషయంపై మంత్రి దయాకర్‌రావును కలిసి వివరించామని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారని తెలిపారు. త్వరితగతంగా కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) నాయకులు ముడావత్ రవినాయక్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, నాయకులు భావండ్ల పాండు, పరుశరాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి, లక్ష్మీనారాయణ, కె.రమేశ్‌బాబు, బాబునాయక్ తదితరులు ఉన్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న.. రెండో ఏఎన్ఎం, ఎంపీహెచ్ఏ(ఎఫ్)లను రెగ్యులరైజ్ చేయాలి

- రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయండి : సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఆరోగ్య సిబ్బంది నిరసన



నవతెలంగాణ-కంఠేశ్వర్

వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న తమను రెగ్యూలర్ చేయాలని, కొత్తగా రిక్రూట్‌మెంట్ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని రెండో ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఏ(ఎఫ్)లు పోరుబాట పట్టారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 48 గంటల నిరసన కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 1520 ఎంపీహెచ్ఏ (ఎఫ్) పోస్టుల భర్తీ కోసం జారీ చేసిన నోటిఫికేషన్ 2/2023ను రద్దు చేసి రెండో ఏఎన్ఎంలను రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. 20 ఏండ్లుగా పని చేస్తున్న వీరి సర్వీస్‌కి.. ఉద్యోగాల భర్తీలో 20 శాతం వెయిటేజీ ఇస్తున్నట్టు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో వీరిని 'రూల్ ఆఫ్ రిజర్వేషన్' మెరిట్ రోస్టర్ ప్రకారం ఎంపిక చేశారని, మళ్లీ పరీక్ష రాయమనడం సరికాదని తెలిపారు. ఇప్పటికే చాలా మందికి వయసు దాటి పోతుందని, వీరిని ఖాళీలు ఉన్న పోస్టులో రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒక వేళ ప్రభుత్వం పట్టించుకోకుంటే 15వ తేదీ నుంచి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంపీహెచ్ఏ(ఎఫ్)లందరూ సమ్మెలోకి వెళ్తారని స్పష్టంచేశారు. కార్యక్రమం టీయూఎంహెచ్ఈయూ జిల్లా అధ్యక్షుడు సంజూ జార్జ్, వర్కింగ్ ప్రసిడెంట్ ప్రవీణ్ రెడ్డి, సలహాదారు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి పుష్ప, షాదుల్లా, గంగజమున, వీణ, సరోజ, ప్రమీలతో పాటు జిల్లాలో ఉన్న 32 పీహెచ్‌సీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలు

- కానిస్టేబుల్ అభ్యర్థుల నిరసన
- జీవో నెంబర్ 46 ను రద్దు చేయాలని డిమాండ్



నవతెలంగాణ-వనస్థలిపురం

రాష్ట్రంలో స్పెషల్ పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలు జరిగాయని, జీవో నెంబర్ 46ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం 14 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు నిరసన తెలిపారు. హైదరాబాద్ వనస్థలిపురం డివిజన్ పరిధిలోని చింతలకుంట ప్రసారభారతి ఆకాశవాణి రేడియో టవర్ ఎక్కడానికి అభ్యర్థులు యత్నించగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. అనంతరం వారిని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అరెస్టు అయిన వారిలో నవీన్, కృష్ణ, లక్ష్మణ్, శివకుమార్, నాగచారితో పాటు మరో తొమ్మిది మంది ఉన్నారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ అభ్యర్థులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ జిల్లాల వారీగా ఉండేదని, ఇప్పుడు మూడు జిల్లాలను ఒక జోన్‌గా ఏర్పాటు చేశారని తెలిపారు. మార్కుల ప్రతిపాదికన ఎంపిక చేయకుండా, జనాభా ప్రతిపాదికన ఎంపిక చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీని వల్ల 100 శాతం మార్కులు తెచ్చుకున్న వివిధ సామాజిక తరగతుల అభ్యర్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 46ను రద్దు చేయాలని ప్రభుత్వానికి తెలియచేయడానికే ఈ నిరసన చేపట్టినట్టు తెలిపారు.

'దళితబంధు' రాలేదని వ్యక్తి ఆత్మహత్య

- రాకుండా కౌన్సిలర్ అడ్డుకుంటున్నాడని సూసైడ్ నోట్

నవ తెలంగాణ-మోత్కూరు



(ఫైల్)

దళితబంధుకు తనను ఎంపిక చేయడం లేదన్న మనస్తాపంతో ఓ నిరుపేద దళితుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన కూరెళ్ల రమేష్ (50) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బీఆర్ఎస్ కార్యకర్త అయిన రమేష్ 12వ వార్డు కౌన్సిలర్ కూరెళ్ల కుమారస్వామితో కలిసి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. కాగా, దళితబంధు పథకం మొదటి విడతలో రమేష్ పేరు పెట్టకపోవడంతో రెండో విడతలో పెట్టిస్తామని కౌన్సిలర్ అతనికి సర్దిచెప్పినట్టు స్థానికులు చెబుతున్నారు. కాగా, రెండో విడత దళితబంధు కోసం కౌన్సిలర్ కుమారస్వామి కాలనీకి చెందిన కొందరి పేర్లు ఎంపిక చేసి రెండు రోజుల క్రితం ఎమ్మెల్యేకు పంపారని, ఆ లిస్టులో తన పేరు లేకపోవడంతో రమేష్ మనస్తాపం చెందాడు. మంగళవారం గాంధీనగర్ కాలనీలో అతని బంధువు చనిపోగా అంత్యక్రియల్లో పాల్గొని సాయంత్రం ఇంటికి రాగా ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఉరి వేసుకున్నాడు. చిన్న కుమారుడు సామేల్ ఇంటికి రాగా అప్పటికే రమేష్ మృతి చెందాడు. కాగా, మృతుడు రమేష్.. దళితబంధులో తనను ఎంపిక చేయలేదని, తనను ఎంపిక చేయకుండా కౌన్సిలర్ కూరెళ్ల కుమారస్వామి అడ్డుకుంటున్నారని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సూసైడ్ లెటర్ కూడా రాసి పెట్టారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి సందర్శించి పంచనామా చేసి శవాన్ని పోస్టుమార్టం కోసం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో సూసైడ్ లెటర్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా, ఈ ఘటనపై కౌన్సిలర్ కూరెళ్ల కుమారస్వామిని వివరణ కోరగా.. దళితబంధు రాకపోవడానికి తాను కారణమన్నది అవాస్తవమని, లబ్దిదారుల పేర్ల ఎంపికతో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

కేసీఆర్ మహారాష్ట్ర పర్యటన వాయిదా

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

మహారాష్ట్రకు బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ వెళ్తారనే అధికారికంగా తొలుత ప్రగతిభవన్ నుంచి లీకు ఇచ్చారు. ఆ తర్వాత టూర్ క్యాన్సిల్ అయినట్టు మళ్లీ సమాచారం ఇచ్చారు. మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా ఇస్లాంపూర్‌లో షేట్కారీ సమాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ రైతు రుణమాఫీ నిర్ణయానికి అభినందన సభను బుధవారం ఏర్పాటుచేశారు. ఈ సభకు కేసీఆర్ హాజరవుతారని ఏర్పాట్లు చేశారు. అయితే అనివార్య కారణాలతో కేసీఆర్ పర్యటన వాయిదాపడింది. సీఎంకు బదులుగా బీఆర్ఎస్ పార్టీ మహారాష్ట్ర ఇన్‌చార్జీ కల్వకుంట్ల వంశీరావు, ఎంపీ బీబీపాటిల్ హాజరవుతున్నట్టు పార్టీ నేతలు తెలిపారు. తెలంగాణలోని సంక్షేమ పథకాలను వివరించనున్నారు.

జహీరుద్దీన్ కుటుంబానికి శ్రీనివాస్ గౌడ్ పరామర్శ

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

గుండెపోటుతో మృతిచెందిన ప్రముఖ ఉర్దూ దినపత్రిక సియాసత్ మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ కుటుంబ సభ్యులను రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, యువజన సర్వీసుల శాఖ డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ పరామర్శించారు. జహీరుద్దీన్ సోదరుడు జహెద్ అలీ ఖాన్, కుమారుడు అమీర్ అలీ ఖాన్ లను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. జహీరుద్దీన్ అకాల మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. జర్నలిజానికి, ఉర్దూ పత్రిక రంగానికి ఎనలేని సేవలు చేశారని ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్ గుర్తుచేసుకున్నారు.

ఆదివాసీలకు సీఎం శుభాకాంక్షలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని (ఆగస్టు 9) పురస్కరించుకుని ఆదివాసీలకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. అడవినే నమ్ముకుని జీవించే నిష్కల్మష హృదయులైన ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి వున్నదని పేర్కొన్నారు. జల్ జంగల్ జమీన్ నినాదంతో పోరాడిన నాటి ఆదీవాసీ ఆత్మగౌరవ పోరాట యోధుడు కుమురం భీం ఆశయాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి చూపిందన్నారు.

లౌకిక, ప్రజాస్వామిక శక్తులకు తీరని లోటు

- జహీరుద్దీన్ అలీఖాన్ మరణం పట్ల ఆవాజ్ సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సియాసత్ ఉర్దూ దిన పత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీ ఖాన్ మృతి పట్ల ఆవాజ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్బాస్ మంగళవారం ఒక ప్రకటనలో సంతాపాన్ని ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలీఖాన్ అభ్యుదయ వాదిగా , లౌకిక, ప్రజాస్వామిక విలువల కోసం తన జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు. దేశంలో పెరుగుతున్న మతోన్మాద, నియంతృత్వ ప్రమాదాన్ని నిలువరించడానికి అనేక ప్రజా సంఘాలు లౌకిక, వామపక్ష, ప్రజాస్వామిక, సామాజిక శక్తులతో కలిసి పనిచేశారని గుర్తుచేశారు. వివిధ విపత్తుల సందర్భంతో బాధితులకు, పేద ప్రజలకు సహకారం అందించేందుకు కృషి చేశారని తెలిపారు. ఆయన మృతి లౌకిక, ప్రజాస్వామిక, సామాజిక శక్తులకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

సైబర్ కరెంట్ నేరగాళ్ళతో జాగ్రత్త

- వినియోగదారులకు టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ఏ గోపాలరావు హెచ్చరిక

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

"మీ ఇంటి కరెంటు బిల్లు ఇంకా కట్టలేదు. బిల్లు పెండింగ్‌లో ఉన్నందున కరెంట్ కట్ చేస్తున్నాం. తక్షణం ఈ క్రింది నెంబర్‌కు ఫోన్ చెయ్యండి" అని సైబర్ నేరగాళ్లు విద్యుత్ వినియోగదారులకు పంపే మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్) సీఎమ్‌డీ ఏ గోపాలరావు హెచ్చరించారు. ఈ తరహా మోసాలు తమ దృష్టికి వచ్చాయనీ, ఆ మెసేజ్‌లకు, తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తమ సంస్థ ఈ తరహా మెసేజ్‌లు ఎప్పుడు పంపదని స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్ల పంపే మెసేజ్‌లు ఓపెన్ చెయ్యకూడదని, అందులో ఉన్న ఫోన్ నెంబర్లకు కాల్స్ చేయొద్దని సూచించారు. విద్యుత్ వినియోగదారులు సంస్థ అధికారిక వెబ్‌సైట్ ఞఞఞ.ఆఅజుఞఎ.ఎఫ్రీ.అఅ లో బిల్ డెస్క్ ద్వారా సర్వీస్ నెంబరు నిర్ధారించుకొని బిల్లులు చెల్లించాలని కోరారు. గూగుల్ పే, ఫోన్ పే ద్వారా కూడా బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్ల నుంచి ఏవైనా తప్పుడు మెసేజ్‌లు వస్తే సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.



ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టులో హై అలర్ట్

నవతెలంగాణ-శంషాబాద్

ఈ నెల 15న జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శాంతి భద్రతల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. ఇందులో భాగంగా సందర్శకుల పాసులను నిలిపివేశారు. సీఐఎస్ఎఫ్ డాగ్స్ స్కాడ్, బాంబుస్కాడ్, క్లూస్ టీంలతో అణువణువునా తనిఖీలు చేపట్టారు. పార్కింగ్, వాహనాల రద్దీ, తదితర ఏరియాల్లో క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నారు. ఏయిర్‌పోర్టులోకి వచ్చే వాహనాల రాకపోకలపై మరింతా నిఘా పెంచారు. హై అలర్ట్‌తో సందర్శకులు ఎవరు కూడా ఎయిర్‌పోర్టుకు రావొద్దని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ డాక్టర్ల డిమాండ్లను పరిష్కరించాలి

- తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ వైద్యుల డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ప్రతినిధుల బృందం రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ కె.రమేశ్ రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించింది. తమ డిమాండ్లను ప్రభుత్వానికి నివేదించాలని కోరింది. టైంబాండ్ ప్రమోషన్లకు సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌ను కలిసి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినట్టుగానే వైద్య విధాన పరిషత్ ఉద్యోగులను కూడా ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. వైద్యారోగ్యశాఖలో ఆర్డీవోల పెత్తనాన్ని సహించేది లేదనీ, వారిని పర్యవేక్షణ అధికారులుగా నియమించే యోచనను విరమించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో టైం బౌండ్ ప్రమోషన్లను వెంటనే కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీనియార్టీ ప్రాతిపదికన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను 33 జిల్లాలకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అడిషనల్ డీఎంహెచ్ఓ పోస్టులను డీఎంహెచ్ఓలుగా మార్చి సీనియారిటీ ప్రాతిపదికన నింపాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతినిధి బృందంలో డాక్టర్లు పల్లం ప్రవీణ్, బొంగు రమేష్, లాలూ ప్రసాద్ రాథోడ్, నరహరి, అజ్మీరా రంగ, ఉమా కాంత్ , రాజు, కళ్యాణ్ , వినోద్, శ్రీనివాస్, భూపేందర్, రవి, రమేష్, దీన్ దయాళ్, మురళి, బాలాజీ, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, రాగిణి, రాజ వర్ధన్ తదితరులున్నారు.

జహీరుద్దీన్ అలీఖాన్ మరణం పట్ల సీపీఐ సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సియాసత్ దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ ఆకస్మిక మరణం పట్ల సీపీఐ రాష్ట్ర సమితి తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వామపక్ష పార్టీలంటే ఎంతో అభిమానం కలిగిన వ్యక్తి అలీఖాన్ అని గుర్తు చేశారు. చార్టెడ్ అకౌంటెంట్ కోర్స్ పూర్తి చేసిన తర్వాత 35 ఏండ్లు జర్నలిజంలో ఉండి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారని పేర్కొన్నారు. ఆయన మరణం దురదృష్టకరమని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

ఉర్దూ పత్రికా రంగానికి ఆయనవి ఎనలేని సేవలు


- జహీరుద్దీన్ అలీఖాన్‌కు మంత్రి హరీశ్ సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సియాసత్ మేనిజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ ఉర్దూ పత్రికా రంగానికి ఎనలేని సేవలందించారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి మంగళవారం అలీఖాన్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలీఖాన్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

సంపాదకీయం

సభకు రాహుల్...



'మోడీ' ఇంటి పేరు వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సూరత్ కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షను గత శుక్రవారం సుప్రీం కోర్టు నిలుపుదల చేయడం ద్వారా... కింది కోర్టులు చేసిన తప్పిదాలను సరి చేసింది. 'సుప్రీం' మంజూరు చేసిన స్టే రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి భారీ ఊరట. కేంద్రంలో ఉన్న ప్రజా కంటక బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే

> రాహుల్‌ను దోషిగా పేర్కొన్న సూరత్ కోర్టు గరిష్టంగా రెండేళ్ల జైలుశిక్ష విధించడానికి కారణాలను పేర్కొన లేదని సుప్రీం కోర్టు తప్పుబట్టింది. గతంలో 'దేశ్‌కా చౌకీదార్ చోర్ హై' అన్న వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు రాహుల్‌ను మందలించిం దన్న అంశాన్ని మాత్రమే ప్రస్తావించిందని పేర్కొంది. అప్పిలేట్ కోర్టు, హైకోర్టు సైతం రాహుల్ స్టే అభ్యర్థనను తోసిపుచ్చడంపై కేంద్రీ కరించాయి తప్ప గరిష్ట కాల శిక్ష విధింపునకు కారణాలు తెలపలేదు.

లక్ష్యం ప్రాతిపదికగా పని చేస్తున్న విపక్ష 'ఇండియా' సంగమం వైపు నుంచి పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్షాలకు చెందిన కీలక నాయకులపై ఉద్దేశపూర్వక ఎజెండాతో ఒక పథకం ప్రకారం అక్రమ కేసులు బనాయిస్తున్న బీజేపీకి సుప్రీం మధ్యంతర ఉత్తర్వులు మింగుడు పడని వ్యవహారం. ఈ కేసులో తప్పిం చుకున్నా రాహుల్‌పై మరెన్నో కేసులు న్నాయని కేంద్ర బీజేపీ మంత్రులు, నేతలు ఆడిపోసుకుంటున్నారు. పరువునష్టం కేసులో ఈ ఏడాది 23న సూరత్ ట్రయల్ కోర్టు రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధించిన కొన్ని గంటల్లోనే ప్రజాప్రాతినిధ్య చట్టం నిబంధనలను ఉటంకిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పుడు సుప్రీంకోర్టు స్టే ఇచ్చిన మూడు రోజుల తర్వాత తీరిగ్గా, అదీ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాల డిమాండ్ తర్వాత సోమవారం రాహుల్ సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫై చేయడం గమనార్హం.

2019 సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో మోడీ అనే ఇంటి పేరు ఉన్నవాళ్లందరూ దొంగలంటూ బీజేపీ జమానాలో బ్యాంకులకు రూ.వేల కోట్లు ఎగనామం పెట్టి దేశాన్ని విడిచి పారిపోయిన కరడు గట్టిన ఆర్థిక నేరస్తులు లలిత్ మోడీ, నీరవ్ మోడీ, తదితరుల పేర్లను రాహుల్ ప్రస్తావించారు. వాస్తవానికి రాహుల్ చేసింది కేవలం రాజకీయ ఆరోపణ. ఒక నిర్దిష్ట కులానికి, ఇంటి పేరు కలిగిన వారికి అస్సలు వర్తించదు. ఎక్కడో కర్నాటక కోలార్ లో రాహుల్ విమర్శ చేస్తే గుజరాత్‌లోని సూరత్ కోర్టులో బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోడీ కేసు వేయడం ఒక వింత అయితే, రాష్ట్ర వ్యాప్తంగా కోట్లల్లో ఉన్న ఒబిసి కులస్తులందరి పరువుకూ రాహుల్ వ్యాఖ్యలు నష్టం కలిగించాయని క్రిమినల్ కేసు వేయడం వింతల్లో వింత. కాగా రాజకీయ విమర్శకు సూరత్ కోర్టు రాహుల్‌కు రెండేళ్ల జైలు విధించింది. ఇటువంటి కేసుల్లో రెండేళ్ల జైలు పడటం ఇదే తొలిసారి. సూరత్ మెజి స్ట్రేట్ నియామకం, హడావుడిగా సెలవుల్లే కుండా కేసు విచారణ, రెండేళ్ల జైలుశిక్ష విధింపు అసాధారణం. ఈ ప్రహసనాన్ని బట్టే రాజకీయ ప్రేరేపితం అని స్పష్టమైపోతుంది.

ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఏదైనా కేసులో దోషిగా నిర్ధారణై రెండేళ్లు, అంత కంటే ఎక్కువ శిక్ష పడితే అటు వంటి వ్యక్తి రాజ్యాంగ పదవులకు అనర్హుడవుతాడు. శిక్షాకాలంతో పాటు మరో ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హత కోల్పోతారు. ఐపిసి సెక్షన్ 499 కేసులో దోషిగా నిర్ధారణ అయిన వ్యక్తికి గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా లేదా కొన్ని సందర్భాల్లో ఆ రెండూ విధించే అవకాశం ఉంది. రాహుల్‌ను దోషిగా పేర్కొన్న సూరత్ కోర్టు గరిష్టంగా రెండేళ్ల జైలుశిక్ష విధించడానికి కారణాలను పేర్కొన లేదని సుప్రీం కోర్టు తప్పుబట్టింది. గతంలో 'దేశ్‌కా చౌకీదార్ చోర్ హై' అన్న వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు రాహుల్‌ను మందలించిం దన్న అంశాన్ని మాత్రమే ప్రస్తావించిందని పేర్కొంది. అప్పిలేట్ కోర్టు, హైకోర్టు సైతం రాహుల్ స్టే అభ్యర్థనను తోసిపుచ్చడంపై కేంద్రీ కరించాయి తప్ప గరిష్ట కాల శిక్ష విధింపునకు కారణాలు తెలపలేదు. సదరు గరిష్ట కాలశిక్షే లోక్‌సభలో రాహుల్‌పై అనర్హత వేటు వేయడానికి సాధనం అయిందని కింది కోర్టుల విచారణ, పరిశీలనపై సుప్రీం తీవ్రంగా వ్యాఖ్యా నించడం గమనార్హం.

ఇటువంటి శిక్షలు విధించినప్పుడు ఆయా వ్యక్తులు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల ప్రజల గురించి కూడా ఆలోచించాలని పేర్కొనడం అభినందనీయం. ప్రతిపక్షాలపై ఇ.డి, సిబిఐ వంటి దర్యాప్తు సంస్థలను ప్రయోగించి కక్ష సాధిస్తున్న మోడీ ప్రభుత్వం సరికొత్తగా పరువు నష్టం (క్రిమినల్) కేసులను బనాయించే సరికొత్త మార్గాన్ని ఎంచుకుంది. అందులో భాగమే రాహుల్‌పై కేసు. కేంద్ర ప్రభుత్వ ఈ తరహా వేధింపులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు.

చైనాపై అమెరికా సరికొత్త ప్రచార దాడి!

పెట్టుబడిదారీ విధానాన్నే అస్త్రంగా మార్చి అమెరికాను దెబ్బతీసేందుకు చైనా ఎలా చూస్తున్నదో చూడండి, మన పెట్టుబడులనే మన నాశనానికి వాడుతున్నది అంటూ అమెరికాలో విశ్లేషకులు కొందరు అక్కడి పాలక వర్గాన్ని హెచ్చరించారు. ఇది ఒక్కరిద్దరి అభిప్రాయం అనుకుంటే పొరపాటు, అమెరికాలో పెట్టుబడిదారీ విధాన మీద తలెత్తిన ఆగ్రహాన్ని పక్కదారి పట్టించేందుకు అక్కడి పాలకవర్గ మేధావులు ముందుకు తెచ్చిన సరికొత్త ప్రచార దాడిలో అదొక అస్త్రం.అదే విధంగా అమెరికా స్కూళ్లలో చైనా ప్రవేశించి కమ్యూనిస్టు పాఠాలు చెబుతు న్నదని ఆధారం లేని ఆరోపణలతో ఒక నివేదికను విడుదల చేశారు. ఈ రెండూ అక్కడి పాలకవర్గంలో ఉన్న చైనా, కమ్యూనిస్టు వ్యతిరేకత, దాన్ని జనం మెదళ్లలోకి ఎక్కించే ప్రయత్నం కనిపిస్తున్నది.



ఎం కోటేశ్వరరావు
8331013288

విశ్లేషకుల కథన సారం ఇలా ఉంది. "ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి కమ్యూనిస్టు సిద్ధాంత మార్గదర్శకత్వంలో పని చేసే చైనా నుంచి ముప్పు తీవ్రం అవుతున్నది. అందువలన దానితో ఆర్థిక లావాదేవీలను పున: విశ్లేషణ చేసుకోవాల్సిన అత్యవసరం ఎన్నటి కంటే మరింత పెరిగింది. అమెరికా పెట్టుబడులతో అపార సంపదలను చైనా పోగేసుకుంది. మన సొంత పెట్టుబడిదారీ వ్యవస్థను మన వ్యతిరేక ఆయుధంగా మార్చింది. పెన్షన్ నిధులు, ఇతర మార్గాల ద్వారా దాదాపు పది కోట్ల మంది అమెరికన్లు తమకు తెలియకుండానే తమను దెబ్బతీసే ఆర్థిక ప్రత్యర్థి చైనాలో పెట్టుబడులు పెట్టారు. ప్రపంచాధిపత్యం కోసం చూస్తున్న దాని మిలిటరీ బలపడేందుకు అవకాశం కల్పించారు. ఆర్థిక సరళీకరణను ప్రారంభించిన 1978 నుంచి చైనా ఒక పద్ధతి ప్రకారం పశ్చిమ దేశాల పెట్టుబడి మార్కెట్లను లక్ష్యంగా చేసుకుంది. చైనా కమ్యూనిస్టు పార్టీపై అమెరికా పార్లమెంటు ఏర్పాటు చేసిన సెలెక్ట్ కమిటీ ముందు సాక్ష్యమిచ్చిన పెట్టుబడి మార్కెట్ల భద్రతా కమిషనర్ రోజర్ రాబిన్సన్ మాట్లాడుతూ పరాకుగా ఉన్న అమెరికా చైనా కమ్యూనిస్టు పార్టీ నియంత్రణలో ఉన్న ఐదు వేల కంపెనీల్లో లక్షల కోట్ల డాలర్లను పెట్టుబడులుగా పెట్టేందుకు సాధారణ అమెరికన్లను అనుమతించింది. ప్రపంచమంతటి నుంచి చైనా వచ్చే పెట్టుబడుల్లో అరవై శాతం డాలర్లు అమెరికా వనరుల నుంచే ఉన్నాయి గనుక అవి నిలిచిపోతే అక్కడి ఆర్థికరంగం పూర్తిగా దెబ్బతిని చైనా ప్రభుత్వానికి ముప్పు ఏర్పడుతుంది.

పెట్టుబడులు పెట్టినందుకు దోహదం చేసిన బ్లాక్‌రాక్ వంటి అగ్రశ్రేణి ఆస్తుల నిర్వహణ సంస్థలు ఇప్పుడు సాకులు చెబుతున్నాయి. అమెరికా పర్యావరణ, సామాజిక, పాలన ప్రమాణాలను పక్కన పెట్టి పెట్టుబడులు పెట్టాయి. ఇలాంటి కంపెనీలు వాటిని గట్టిగా పాటించి ఉంటే చైనా కంపెనీలకు పెట్టుబడులు వెళ్లేవి కాదు. ప్రపంచంలోని ఏ దేశంలోనూ పెట్టనన్ని పెట్టుబడులను బ్లాక్‌రాక్ కంపెనీ సిఇఓ లారీ ఫింక్ ప్రవహింపచేశాడు. పెట్టుబడి సంస్థలు చైనాలో పెట్టుబడులు పెడితే సంభవించే ఆవదల గురించి పట్టించుకోకపోగా పైకి కనిపించినంత చెడుగా చైనా సంస్థలు లేవని యుబిఎస్ గ్లోబల్ వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ చెప్పింది. నిర్బంధ శిబిరాలు, బలవంతంగా కార్మికులను తరలించే, మారణ కాండ, చైనా మిలిటరీకి ఆధునిక ఆయుధాలను సరఫరా చేసేందుకు దోహదం చేసేవిగా చైనా కార్పొరేట్ కంపెనీలు ఉన్నాయి. ప్రపంచ ప్రజాస్వామిక ఆర్థిక వ్యవస్థ లున్న దేశాలన్నీ చైనా సంస్థలతో చేతులు కలిపితే వచ్చే ముప్పును గ్రహిస్తున్నాయి. చైనా మీద ఆధారపడితే తలెత్తే ముప్పును తొలగించుకొనేందుకు, నూతన సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు జి7 దేశాల కూటమి పూనుకుంది. ఇది చాలదు, అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజీలలో ఉన్న చైనా కంపెనీలను జాబితా నుంచి తొలగించాలి, రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి. చైనా కంపెనీలకు రుణాలు ఇచ్చే సంస్థలను నిషేధించాలి. డాలర్ల రూపంలో ఇస్తున్న చైనా ప్రభుత్వ బాండ్ల మీద నిషేధం విధించాలి. గతంలో సోవియట్ ముప్పును వమ్ము చేసేందుకు అనుసరించిన ఆర్థిక పద్ధతులను ఇప్పుడు చైనా మీద అనుసరించాలి. మనం దీర్ఘకాలంగా ప్రేక్షకుల మాదిరి ఉన్నాం, మన పెట్టుబడిదారీ వ్యవస్థను నియంత్రించేందుకు ఇది సరైన తరుణం."



అమెరికా గడ్డ మీద, వెలుపలా అమెరికా మీద చైనా నిరంతర నిఘాను ఉపేక్షించరాదని ఆగస్టు మొదటి వారంలో జరిగిన పార్లమెంటు సెలెక్ట్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన రిపబ్లికన్ పార్టీ ఎంపీ మైక్ గాలఘర్ డిమాండ్ చేశాడు. ఇప్పుడే మేలుకున్నా మని కూడా అన్నాడు. దానిలో భాగంగా ప్రపంచ మంతటా రహస్య పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసిందని ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే.చైనాలో ప్రయివేటు కంపెనీలంటూ లేవు, ప్రతి ఒక్కరూ, ప్రతిదీ, ప్రతి సంస్థ షీ జిన్‌పింగ్ కోరుకున్నదాని ప్రకారమే ఉంటుందని గాలఘర్ ఆరోపించాడు. చైనాలో పెట్టుబడులపై పరిమితులను మరింతగా విస్తరించాలని జో బైడెన్‌ను గాలఘర్ కోరాడు. ఉత్తరువుల ద్వారా వాటిని వెంటనే అమల్లోకి తేవాలంటూ ఒక లేఖను కూడా రాశాడు. ప్రభుత్వ పెట్టుబడులకే పరిమితం గాకుండా ప్రయివేటు పెట్టుబడుల మీద ఆంక్షలు విధించాలని కోరాడు. చైనా మిలిటరీ కంపెనీ లకు మన పెట్టుబడులు తరలటం అంటే మన నాశనానికి మనమే సహకరించినట్లు అవుతుందన్నాడు. చైనా బాండ్లు, కంపెనీల వాటాల్లో 1.1లక్షల కోట్ల డాలర్లు, ప్రైవేటు పెట్టుబడిదారులు 200బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టినట్లు పేర్కొన్నారు. దీనిలో ఎక్కువ భాగం చైనా మిలిటరీతో సంబంధాలున్న కంపెనీలలో ఉందని ఆరోపించాడు. తైవాన్ విలీనం షీ జిన్‌పింగ్ జీవిత లక్ష్యమని అందుకుగాను సన్నాహాలకు గాను అవసరమైన సమాచారం మొత్తాన్ని సేకరిస్తున్నారన్నాడు. దాన్ని ఎదుర్కొనేందుకు ఇండో పసిఫిక్ ప్రాంతానికి తరలించేందుకు అవసరమైన మిలిటరీ, పరికరాలను సమీకరించే మన సామర్థ్యాన్ని దెబ్బ తీసేందుకు చైనా చూస్తున్నదని, చైనాతో ఘర్షణకు దిగాల్సి వస్తే మనం భూమ్యాకాశాలను కదిలించాల్సి ఉంటుందని, ఎంతో వినాశకరంగా ఉంటుందని అన్నాడు. అమెరికా నిషేధిత జాబితాలో ఉంచిన చైనా కంపెనీల్లో పెట్టుబడులు ఎందుకు పెట్టారంటూ బ్లాక్ రాక్, ఎంఎస్‌సిఐ కంపెనీలకు సెలెక్ట్ కమిటీ అడిగిన సంజాయిషీకి తాము చట్ట ప్రకారమే తమ వాణిజ్య పద్ధతుల్లో భాగంగానే పెట్టుబడులు పెట్టినట్లు ఆ కంపెనీలు చెప్పాయి.

ఇలా సాగిన విశ్లేషణలు, పార్లమెంటరీ కమిటీ చైనా మీద చేసిన విచారణ అంతా అమెరికా ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలకు, రాజకీయంగా ప్రపంచంలో తింటున్న ఎదురుదెబ్బలకు కారణం చైనా అని తమ జనాన్ని నమ్మించేందుకు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు ముందుకు తెచ్చిన కొత్త ప్రచార ఎత్తుగడ. గతంలో సోవియట్ యూనియన్ ఉన్నపుడు దానితో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవు. కమ్యూనిజం విస్తరణను అడ్డుకొనే పేరుతో ప్రచ్ఛన్న పోరు పేరుతో సాగించిన ప్రత్యక్ష ప్రచార దాడిలో భాగంగా సోషలిజం, కమ్యూనిజం వ్యతిరేకతను రెచ్చగొట్టారు. ఆ పోరులో విజయం సాధించినట్టు మూడు దశాబ్దాల క్రితం స్వయంగా ప్రకటించుకున్నారు. మరోవైపు చైనాలో పెట్టుబడులు పెట్టడంతో పాటు అక్కడి నుంచి భారీ ఎత్తున సరుకులు దిగుమతి చేసుకున్నది. దాంతో అనేక మంది చైనా తమ ఉపాధిని హరించిందనే ప్రచారాన్ని అమెరికాలో పెద్దఎత్తున ప్రారంభించారు. అది అనేకమంది యువతలో సైద్ధాంతిక మదనాన్ని పెంచింది. సోషలిజమే మెరుగైనది, పెట్టుబడిదారీ విధానం విఫలమైందనే భావనలు పెరుగుతున్నాయి. అందువల్ల పాతబడిన కమ్యూనిస్టు వ్యతిరేక అస్త్రాన్ని ప్రధానంగా ప్రయోగిస్తే దశాబ్దాల తరబడి ఆ కమ్యూనిస్టు చైనాలో ఎందుకు పెట్టుబడులు పెట్టారు, ప్రతి వస్తువును అక్కడి నుంచి ఎందుకు దిగుమతులు చేసుకున్నారు, ఇప్పటికీ ఎందుకు కొనసాగిస్తున్నారు, చైనాతో తెగతెంపులు చేసుకోవటం లేదని ఎందుకు ప్రకటిస్తున్నారు అన్న ప్రశ్నలకు అమెరికా విధాన నిర్ణేతల దగ్గర సమాధానం లేదు. అందుకే మనలను దెబ్బతీసేందుకు మన పెట్టుబడిదారీ వ్యవస్థనే చైనా అస్త్రంగా మార్చు కున్నదనే తర్కానికి నిలవని ప్రచారానికి పూనుకున్నారు. ఒకటి వాస్తవం, ఏ విధంగా చూసినా నేటి చైనా నాటి సోవియట్ కాదు. ఆర్థికంగా త్వరలో అమెరికాను అధిగమించనుంది. ప్రపంచీకరణ భావన, స్వేచ్ఛా మార్కెట్‌ను ముందుకు తెచ్చింది అమెరికా తప్ప చైనా కాదు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని చైనా లబ్దిపొందిన మాట వాస్తవం. దివాలా కోరు విధానాలతో అమెరికా పెట్టుబడిదారీ విధానం విఫలబాటలో ఉంది.

> కమ్యూనిజం విస్తరణను అడ్డుకొనే పేరుతో ప్రచ్ఛన్న పోరు పేరుతో సాగించిన ప్రత్యక్ష ప్రచార దాడిలో భాగంగా సోషలిజం, కమ్యూనిజం వ్యతిరేకతను రెచ్చగొట్టారు. ఆ పోరులో విజయం సాధించినట్టు మూడు దశాబ్దాల క్రితం స్వయంగా ప్రకటించుకున్నారు. మరోవైపు చైనాలో పెట్టుబడులు పెట్టడంతో పాటు అక్కడి నుంచి భారీ ఎత్తున సరుకులు దిగుమతి చేసుకున్నది. దాంతో అనేక మంది చైనా తమ ఉపాధిని హరించిందనే ప్రచారాన్ని అమెరికాలో పెద్ద ఎత్తున ప్రారంభించారు. అది అనేక మంది యువతలో సైద్ధాంతిక మదనాన్ని పెంచింది. సోషలిజమే మెరుగైనది, పెట్టుబడిదారీ విధానం విఫలమైంది అనే భావనలు పెరుగుతున్నాయి.

అమెరికా స్కూళ్లలో పెద్ద ఎత్తున ప్రవేశిస్తున్న చైనా వాటిని కమ్యూనిస్టు ప్రచారానికి అడ్డాలుగా మారుస్తున్నదని విద్యా పరిరక్షక తలిదండ్రుల కమిటీ(పిడిఇ) పేరుతో ఉన్న సంస్థ తాజాగా ఒక నివేదికలో ఆరోపించింది. అమెరికాలో స్కూళ్లు పన్నెండవ తరగతి (మన దగ్గర ఇంటర్ మీడియెట్) వరకు బోధిస్తాయి. తమ దేశ తత్వవేత్త కన్ఫ్యూసియస్ పేరుతో వందకు పైగా కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో తరగతులను నిర్వహించేందుకు అమెరికా ప్రభుత్వ అనుమతుల మేరకే చైనా ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నది. నిజానికి అక్కడి సంస్థల సంఖ్యతో పోలిస్తే అసలు లెక్కలోకి రావు. ఈ పేరుతో అమెరికా సాంకేతిక పరిజ్ఞానాన్ని తస్కరించేందుకు, తమకు ఏజంట్లుగా పనిచేసే వారిని ఎంచుకొనే కేంద్రాలుగా మార్చుతున్నదంటూ ఆరోపిస్తూ ఇటీవల అమెరికా ఎఫ్‌బిఐ ఒక నివేదికను వెల్లడించింది.

ఇతర దేశాలతో ఉన్న సంబంధాలను మెరుగుపరచుకొనేందుకు గాను ప్రతి దేశం అనేక చర్యలను తీసుకోవటం తెలిసిందే. అమెరికా స్కూళ్లలోని టీచర్లు, విద్యార్థులతో చైనా వారు సంబంధాలు పెట్టుకుంటూ చైనా భాష, సాంస్కృతిక సంబంధాలు, విద్యార్థి బృందాల మార్పిడి పేరుతో గూఢచర్యానికి పాల్పడుతున్నట్లు పిడిఇ "లిటిల్ రెడ్ క్లాస్ రూమ్స్" పేరుతో విడుదల చేసిన ఒక నివేదికలో ఆరోపించింది. ఇలాంటి స్కూళ్లు, కాలేజీలన్నీ అమెరికాలోని 20 మిలిటరీ కేంద్రాల చుట్టూ ఉన్నట్లు మరొక కథనాన్ని దానిలో పేర్కొన్నారు. నిజానికి ఇవేవీ అమెరికా ప్రభుత్వానికి తెలియకుండా జరిగే అవకాశం లేదు.ప్రపంచంలో ఏ మూలన చీమ చిటుక్కుమన్నా పసిగట్టే శక్తి ఉన్న అమెరికా సిఐఏ, ఎఫ్‌బిఐ, ఎన్ఐఏ వంటి సంస్థలకు వేళ్ల మీద లెక్కించదగిన ఆ సంస్థల్లోని కేంద్రాలను మూసి వేయించటం పెద్ద కష్టమేమీ కాదు. ఒక వేళ నిజమే అనుకుంటే ఆ పని చేయకుండా వాటిని అనుమతిస్తూనే మరో వైపు అనుమానాలు రేకెత్తించే ప్రచారానికి అవి తెరలేపుతున్నాయి. అలాంటి కేంద్రాలన్నీ గూఢచర్యానికి పాల్పడుతుంటే, అది వాస్తవమనుకుంటే అమెరికా సర్కార్ లేదా అక్కడి సంస్థలు మన దేశంతో సహా అనేక చోట్ల విద్యా సంస్థలతో సంబంధాలు, అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి, వారాలు, నెలల తరబడి మన వారిని అమెరికా ఆహ్వానిస్తున్నాయి. వాటన్నింటినీ సిఐఏ గూఢచార కేంద్రాలుగా పరిగణించాలా ?


మణిపూర్ మారణకాండ-మరోకోణం

ఇప్పుడు మణిపూర్ అంటే అలలు, అలలుగా... బారులు తీరి ఉండే కొండలు... పచ్చపచ్చని పంట పొలాలు... అడవులు... లోయలు, అంతెత్తు నుంచి జాలువారే జలపాతాలు... నింగిని తనలో నింపుకున్నట్లు ఉండే నీలినీలి సరస్సులు కాదు. ఇప్పుడు మణిపూర్ అంటే... రగులుతున్న రావణకాష్టం! ఇప్పుడు ఇక్కడి గాలి వేడిని నింపుకొని వీస్తుంది. ఇచ్చటి నీరు ఎర్రటి రక్తాన్ని స్రవిస్తుంది. ఇచ్చటి నేల మహిళల కన్నీటితో తడిసి ముద్దయింది. ఇలా ఇంకా రాయాలని ఉంది. కాని కలం కన్నీరు స్రవిస్తు ఉంది.బహుశా చాలా అరుదుగా ఇటువంటి స్థితి రచయితలకు వస్తుందేమో! అయినా ఈ ఘోరకలి ప్రపంచానికి తెలియజేయాలనే తపనే ఇలా రాయించింది.

మనువాదం ఉన్న చోట మానవత్వం ఉండదని మణిపూర్‌ను చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది. 1990లో నూతన ఆర్థిక విధానాలు అమలు మొదలైనప్పటి నుంచి దేశంలో జరుగుతున్న పరిణామాలు నిశితంగా పరిశీలిస్తే ఆర్థిక దోపిడీకి మతం ముసుగు తొడిగి కలసిమెలసి జీవిస్తున్న ప్రజల మధ్య విద్వేషాలు రగిలించిన కారణంగా అనేక హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయి. గత మూడు నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండ అంతా ఇంతా కాదు. రెండు జాతుల మధ్య పరస్పర విధ్వంసం, జాతి వైరం తారా స్థాయికి చేరుకుంది. ఎల్లెడలా సైన్యం విస్తరించినా ఏమీ చేయలేని పరిస్థితి. మెజార్టీ మెయితీ అల్లరి మూకలు అత్యాధునిక ఆయుధాలతో ఊచకోతలు కోస్తున్నారు. వారి చేతుల్లోకి ఈ ఆయుధాలు ఎలా వచ్చాయి.? ఇంకా ఎన్నో, ఎన్నెన్నో అమానవీయ సంఘటనలు ప్రతిరోజూ జరుగుతూనే ఉన్నాయి. ఇంతఘోరకలి జరుగుతున్నా బాధ్యతగల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 'నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. ఇద్దరు అమాయక యువతులను బట్టలు లేకుండా రెండు కిలో మీటర్లు నడిపించి, సామూహికంగా అత్యాచారం చేసి చంపేశారు. రక్షించబోయిన సోదరుడు, తండ్రిని ప్రాణాలు పోయేలా కొట్టారు. మే 4వ తేదీన జరిగిన ఈ సంఘటనకు సంబంధించిని విడియో ఆలశ్యంగా వైరల్ అవడడంతో దేశం నివ్వెరపోయింది. ఇప్పటి వరకు మౌనముద్రలో ఉన్న ప్రధాని మోడి మొసలి కన్నీరు కార్చగా, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇలాంటి సంఘటనలు వందలు జరిగాయని, అందుకే రాష్ట్రంలో ఇంటర్నెట్ సేవలు నిలిపి వేశామని చెప్పడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

ఆదివాసి మహిళ అయిన దేశాధినేత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ సంఘటనపై నోరు మెదపకపోవడం దేన్ని సూచిస్తుంది? ఇదేనేమో మోడీ డబుల్ ఇంజన్ సర్కార్ పనితీరు. చివరకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని 'మీకు చేతకాకపోతే మేమే సమస్యను పరిష్కరిస్తామని 'ప్రభుత్వాన్ని హెచ్చరించిందంటే బీజేపీ పాలన ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక అసలు విషయానికి వస్తే మెయితీలకు ఎస్టీ హోదా కల్పించి కుకీల అటవీ భూములను మెయితీలకు కట్టబెట్టి ఇలా అటవీ ప్రాంతంపై ఆధిపత్యం కల్పించటం ద్వారా సామ్రాజ్యవాద బడా పెట్టుబడిదారులకు, అటవీ సంపదను దోచి పెట్టడం పాలకుల అసలు వ్యూహంగా ఉంది. అందుకే ఈ మారణకాండ. సువిశాలమైన సాంస్కృతిక వైవిధ్యం, భిన్నత్వం కలిగి కలిసిమెలిసి జీవిస్తున్న ప్రజల మధ్య విద్వేషం రగిలించటం ఇందులో భాగంగా చూడాలి. నేడు దేశం మొత్తం ఈ పరిస్థితి ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా మణిపూర్ లో గనులు, విలువైన ఖనిజ సంపద కోసం అన్వేషణ మొదలైంది. ప్రభుత్వ రంగ సంస్థ జీఎస్ఐ పెద్ద ఎత్తున సర్వేలు చేపట్టింది. ఈ సర్వేలలో ఆదివాసిలు నివసించే అటవీ ప్రాంతంలో ప్రపంచంలోనే అత్యంత విలువైన, అరుదైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని గుర్తించారు. విలువైన ఆకుపచ్చ గ్రానెట్, ప్లాటినం గ్రూప్ మెటల్స్, ఎలిమెంట్స్, నికేల్, సోమైట్, కాపర్, బొగ్గు, పెట్రోలియం, సిమెంట పరిశ్రమకు అవసరమైన సున్నపురాయి లాంటి విలువైన నిక్షేపాలు గుర్తించారు.

ఈ నిక్షేపాల అప్పగింతలపై మణిపూర్ ప్రభుత్వం 2017లో 39 కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందం చేసుకుంది. అయితే ఆదివాసి ప్రజలు నివసించే అటవీ, కొండ ప్రాంతాలలో వారికి కొన్ని రాజ్యాంగ, చట్టపరమైన హక్కులు ఉన్నాయి కాబట్టి అక్కడ మైనింగ్ దోపిడీకి సాధ్యం కాదు. ఇది బహుళజాతి కంపెనీలకు అడ్డంకిగా ఉంది. ఇందులోభాగమే అటవీ సంరక్షణ చట్టాల మార్పు చేయడం, హింసాత్మాకంగా ఆదివాసిలను బలవంతంగా అడవుల నుంచి గెంటి వేయడం, మారణకాండలు సృష్టించడం, వీరిపై మాదక ద్రవ్యాల స్మగర్లుగా, చట్టవిరుద్ధ కాందిశీకులుగా బురద జల్లడం జరుగుతున్నాయి. పైకి మణిపూర్ మారణకాండ రిజర్వేషన్ల జాతుల వైరంగా కనిపిస్తున్న ప్పటికి వాస్తవంలో అది అటవీ, ఖనిజసంపద మొత్తం బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టడమే అసలు లక్ష్యం. ప్రజలు వాస్తవాలను గుర్తించి దేశాన్ని విభజించి పాలిస్తున్న మతోన్మాద, పాసిస్టు పాలక మూకల నుండి కాపాడుకోవాలి. మణిపూర్ ఆదివాసి ప్రజలకు అండగా నిలబడాలి.



- షేక్ కరిముల్లా,
సెల్: 9705450705

ఓపీఎస్ పునరుద్ధరణ: రాష్ట్రాలపై భారమా? నిజమెంత!



ఎస్ఎస్ఆర్ఎ ప్రసాద్
9490300867

బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం నిర్ణయాన్ని ధిక్కరించి, నూతన పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి తమ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేస్తామని ప్రచారాన్ని మొదలుపెట్టాయి. న్యూ పెన్షన్ స్కీమ్‌కు వ్యతిరేకంగా అనేక పోరాటాలు ఊపందుకున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పెన్షన్ స్కీము నుండి పాత పెన్షన్ విధానానికి మారడానికి నిర్ణయాలు చేసి అమలు కూడా చేస్తున్నాయి. నూతన పెన్షన్ స్కీమ్ అంగీకారయోగ్యం కాదని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని రాజస్థాన్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌లలోని బీజేపీయేతర పార్టీ ప్రభుత్వాలు నిర్ణయించుకున్నాయి. ఈ పార్టీలు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని, ఆయా రాష్ట్రాల ఎన్నికల్లో వాగ్దానాలు చేసి ప్రస్తుతం అమలు కోసం ప్రకటించాయి. కేంద్రం మాత్రం నూతన పెన్షన్ విధానం అమలుకు తన నిబద్ధతను తెలియజేస్తూ పార్లమెంటులో ప్రకటించింది. పాత పెన్షన్ విధానానికి తిరిగి రివర్షన్‌కు ఎంచుకునే రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంక్షోభానికి దారి తీస్తాయని కేంద్ర ప్రభుత్వ అనుకూల ఆర్థిక వేత్తలు, అనుకూల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రచారం చేస్తున్నవి. అంతేకాక, ఉద్యోగుల ఓట్లు సంపాదించుకోడానికి ఆయా పార్టీలు ఎంచుకున్న ఎత్తుగడగా కూడా అభివర్ణిస్తున్నవి.

పాత పెన్షన్ విధానం కింద సభ్యులుగా వున్నవారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన రెగ్యులర్ ఉద్యోగులు 2004కు ముందు సర్వీసులో వున్నప్పుడు ఎటువంటి తన వాటా షేర్‌ను చెల్లించకుండానే పదవీ విరమణ తదుపరి, చివరగా తీసుకున్న వేతనంలో సగానికి సగం పెన్షన్ పొందుతారు. దీనిని నిర్దిష్ట పెన్షన్ ప్రయోజన పథకం అంటారు. అంతేకాక, పదవీ విరమణ తదుపరి, ఆ కుటుంబానికి సామాజిక భద్రత కల్పిస్తుంది. పదవీ విరమణ తరువాత, ధరల పెరుగుదలకు అనుగుణంగా కరువు భత్యం రిలీఫ్‌ను, పెన్షన్‌పై నిష్పత్తిగా చెల్లిస్తారు. ఇదే విధంగా సర్వీసులో ఉన్నప్పుడు కూడా కరువు భత్యం పేరుతో మూల వేతనంపై నిష్పత్తిగా ఇస్తారు. ప్రజలకు సేవ అందించే ఉద్యోగులకు విరమణ తరువాత వారి సామాజిక భద్రతకు భరోసా ఇచ్చే అవసరమైన నిర్వచించబడిన నిర్దిష్టమైన ప్రయోజనం సమకూర్చు పథకం అని అర్థం. నూతన పెన్షన్ బిల్లు పథకం రూపకల్పన అంటే, పథకం ప్రయోజనాలను అందించే సంస్థల పెన్షన్ బిల్లు, ఉద్యోగుల వేతనాల నుండి 10శాతం వాటా నిధులను ప్రభుత్వం తరపు నుంచి 14శాతం వాటా నిధులను సమకూరుస్తుంది.ఈ నూతన పెన్షన్ పథకాన్ని అమలుచేయుటకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత, భారతదేశంలోనే కాకుండా, అనేక ఇతర దేశాలలోనూ ఇలాంటి పథకాలు అమలులో వున్నాయి.

ప్రజలకు సేవలందించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కాకుండా, ఇతర సంస్థలలో 20 లేదా అంతకంటే ఎక్కువ మంది. కార్మికులు పనిచేసే సంస్థలలో తప్పనిసరిగా పదవీ విరమణ పొదుపు పథకం వర్తిస్తుంది. అటువంటి సంస్థలలో ఉద్యోగి అతని లేక ఆమె జీతంలో 10 శాతం వాటాను ఈ పథకానికి అందించవలసి వుంటుంది. ఈ పథకానికి యజమాని నుండి కూడా సహకారం అందించబడుతుంది. ఈ సేకరించబడిన సొమ్ము మొత్తాన్ని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థచే నిర్వహించబడుతుంది. పదవీ విరమణ తరువాత, ఉద్యోగి ఏకమొత్తం చెల్లింపునకు అర్హులు. మిగిలిన భాగాన్ని యాన్యుటీ చెల్లింపు పథకాలలో పెట్టు బడి పెట్టగా వచ్చిన దానిని పెన్షన్‌గా చెల్లిస్తారు. అనేకమంది కార్మికులు చిన్న అనధికారిక, ప్రయివేటురంగ యూనిట్లలో లేదా స్వయం ఉపాధి పొందుతున్న చాలామంది. కార్మికులు కూడా ఈ పథకం నుండి దూరంగా వున్నారంటే ఆశ్చర్యం కాదు. వారు ఇకపై పని చేయలేనప్పుడు, పొదుపు చేయడానికి. తగినంత సంపాదించలేని వారికి అందించడానికి అధికారిక సామాజిక రక్షణ పథకాలలో కొన్ని అధికారికంగా నిర్వచించబడిన దారిద్ర్యరేఖకు దిగువన వున్న వారికి కంట్రిబ్యూషన్ లేకుండానే పెన్షన్‌ను చెల్లిస్తున్నారు. ఈ పథకంలో పెన్షన్ రూపంలో చెల్లించేది. చాలా అల్పమయినదే.



ప్రస్తుత వైరుధ్యం పాత పెన్షన్ పథకాన్ని తిరిగి అమలు గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే పథకాలకు సంబంధించినది. పాత పెన్షన్ పథకాన్ని రద్దుచేసి, నూతన పెన్షన్ పథకంతో భర్తీ చేయాలనే నిర్ణయం, పాత పెన్షన్ పథకం ఆర్థికంగా నిలకడగా లేనందున సమర్థించబడుతోంది అనే వాదన కూడా వుంది. ప్రభుత్వ ఉద్యోగుల జీవితకాలం పెరగడం, ధరల పెరుగుదల ఆధారంగా హామీ ఇవ్వబడిన కరువు భత్యంతో పెన్షన్‌లో పెరుగుదల ఫలితంగా, ప్రతి వ్యక్తి పెన్షన్ సొమ్ము పెరిగింది. కారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెన్షన్ బిల్లులో పెరుగుదల ఏర్పడింది. మరొకవైపు ఆదాయాలు తగినంతగా పెరగడం లేదు. కారణం ఆర్థికలోటు జిడిపిలో రుణాల స్థాయి పెరగకుండా ఉండాలంటే, సామాజికంగా వ్యయంతో (పెన్షన్ తదితర వ్యయాలు) సహా ఇతర వ్యయాలను తగ్గించవలసి వుంటుంది. ఈ వాదన రెండు స్పష్టమైన ప్రశ్నలకు దారితీస్తుంది. ముందుగా పెన్షన్ బిల్లులో పెరుగుదలకనుగుణంగా ఆదాయాలు ఎందుకు లేవు? రెండవది లోటు, రుణం స్థాయిని ఏది నిర్ణయిస్తుంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వానికి భిన్నంగా వున్నాయి..

కేంద్రం విషయానికొస్తే, నయా ఉదారవాద విధానాల అమలు వల్ల ఆర్థికంగా పతనం చెంది ఆదాయ వృద్ధి లేకుండా వుంది. ఇది అభివృద్ధికి దారి తీస్తుందని అంచనా వేసి ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించబడానికి కేంద్ర ప్రభుత్వం అవలంబించిన పన్ను విధానమే! ఉదాహరణకు 2019-20లో లాభదాయకమైన సంస్థలపై పన్ను రేటు కేవలం 22.5 శాతం ఉందని ఒక సర్వే చెబుతోంది. అయితే కేవలం రూ.10 కోట్ల కంటే ఎక్కువ ఆదాయం వున్న కంపెనీలకు అవసరమైన చట్టబద్ధమైన రేటు (మినహాయింపులు, రాయితీలు లేకుండా) 34 శాతంగా వుంది. నయా ఉదారవాదం అంటే, ఆర్థిక మూలధనాన్ని తగ్గించాల్సిన అవసరం వున్నందున, ద్రవ్య లోటును తప్పనిసరిగా పూడ్చాలి. ఈ లోటు, ఆర్థిక వ్యయం రాష్ట్ర ప్రయోజనాలకు హానికరంగా పరిగణించింది. తద్వారా మొత్తం వ్యయం పెరుగుదలపై పరిమితిని నిర్దేశిస్తుంది. ఈ పరిమితి, పెన్షన్ బిల్లు పెరిగే రేటు కంటే తగ్గితే, పన్ను రాబడిని పెంచాలి. లేదా ఇతర ఖర్చులను తగ్గించవలసి వుంటుంది. ప్రయివేటు లాభదాయకతను ప్రోత్సహించే నయా ఉదారవాద నిబద్ధత కారణంగా పన్నురాబడిలో పెరుగుదల విస్మరించబడింది. కాబట్టి సర్దు బాటును నిర్ధారించడానికి, ఖర్చులను తగ్గించాల్సి వుంటుంది. కాని వారసత్వంగా వచ్చిన వ్యయకట్టుబాట్లను బట్టి ఆర్థిక సంక్షోభ ఫలితంగా కేంద్రం స్వచ్ఛందంగా కార్పొరేట్ రంగానికి, పన్ను రాయితీలను అందించి, దాని ఆర్థికలోటును నియంత్రించడానికి ఎంచుకున్నట్టే, 2004లో స్వచ్ఛందంగా, పాత పెన్షన్ విధానాన్ని ఉపసంహరణను ఎంచుకుంది.

నయా ఉదారవాదం, ఆర్థికంగా రాష్ట్రాలు బలహీనపడటం, సంక్షోభానికి కారణమని వాస్తవ పరిస్థితి నుండి దృష్టిని మరల్చడానికి పాత పెన్షన్ పథకాన్ని వదిలివేయబడుతున్న సంక్షోభానికి ప్రతిస్పందనగా, కేంద్ర ప్రభుత్వం మరియు నయా ఉదారవాదం న్యాయ నిర్ణేతలు నూతన పెన్షన్ పథకంను విజయవంతమైన పరిష్కారంగా నిర్వచించారు. నూతన పెన్షన్ పథకం కింద 2004 తరువాత ఉద్యోగంలో నియమించబడిన ప్రభుత్వ ఉద్యోగులు తమ వేతనంలో 10శాతం వాటాను నిధికి విరాళంగా అందిస్తారు. ప్రభుత్వం 14శాతం వాటాను నిధికి సహకారాన్ని అందిస్తుంది. పేరుకుపోయిన మొత్తాలను స్వతంత్ర పెన్షన్ ఫండ్ మేనేజర్లు వారి సేవలకు చెల్లించే నిధులతో పెట్టుబడి పెడతారు, ఉద్యోగులు పదవీ విరమణ చేసినప్పుడు వారు కార్పస్ ఫండ్‌లో గరిష్ఠంగా 60శాతం మొత్తాన్ని తీసుకొని మిగిలిన మొత్తాన్ని యాన్యుటీ స్కీమ్‌లో పెట్టుబడి పెడతారు. దాని నుండి వచ్చే రాబడి నుండి పెన్షన్ చెల్లిస్తారు. ఈ పథకం ప్రభుత్వ ఉద్యోగులకు తప్పనిసరి, కాని ఇతర ప్రయివేటురంగ యజమానులు వారి ఉద్యోగులు కూడా ఈ పథకంలో చేరడానికి అర్హులు.

పెన్షన్ అందించే కార్పస్ ఫండ్‌ను రూపొందించడంలో ఉద్యోగి, సహకరిస్తున్నప్పటికీ, ప్రభుత్వం ఇప్పటికే వాటాను అందజేసే, వృత్తిపరమైన ఫండ్ మేనేజరుల ద్వారా ఆ నిధుల నిర్వహణ, ఉద్యోగులకు పదవీ విరమణ సమయంలో తరువాత పొందిన మొత్తాలను సమీకరించింది. కానీ ఫండ్ మేనేజరు ద్వారా కార్పస్ ఫండ్ ఎంత బాగా నిర్వహించబడుతుందనే దానిపై పెన్షన్ చెల్లింపు ఆధారపడి వుంటుంది. 2008 ఆర్థిక సంక్షోభం సమయంలో అమెరికన్ పెన్షనర్లకు జరిగినట్లుగా మార్కెట్ ఆశించిన రాబడిని అందించక పోవచ్చు లేదా కుప్పకూలడం సంభవించినప్పుడు పొదుపులో ఎక్కువ భాగాన్ని కూడా తుడిచివేయవచ్చు. అంతేకాకుండా, ఎలాంటి ఫలితం వచ్చినా రుసుమును స్వీకరించే ప్రొఫెషనల్ ఫండు మేనేజరు. ఊహించనంత తెలివిగా ఉండక పోవచ్చు. ఈ స్కీము గ్యారంటీ లేనిది. బెనిఫిట్ లేనిది. నిర్వచించబడిన సహకారం లేదు. ఈ నష్టాలు ముఖ్యమైనవి. ఇది పాత పెన్షన్ పథకం కంటే నూతన పెన్షన్ పథకం వలన చాలా తక్కువ ఫలితం ఉంటుంది. అని అనేక ఉదాహరణలను ఉటంకించవచ్చు.

> ఉద్యోగులు, కార్మికులు పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు చేసే ఉద్యమంతో పాటు కేంద్ర ప్రభుత్వం, వారి అనుకూల మీడియా వారి ఆర్థికవేత్తలు చేసే తప్పుడు వాదనలో (అనగా పాత పెన్షన్ విధానం అమలు వలన ప్రభుత్వాలు అధిక ఆర్థిక భారాలు మోస్తున్నవి అనే వాదనలు) ఎంత మాత్రం వాస్తవం లేదని ప్రచార యుద్ధాన్ని కూడా జత చేసి పోరాటం నిర్వహించాల్సిన అవసరం ఉన్నది. అంతేగాక పాత పెన్షన్ పునరుద్ధరణ ఉద్యమంలో ఐక్యతను పటిష్టంగా నిర్మాణం చేసి దేశవ్యాపిత ఐక్య పోరాటాలకు కృషిచేయాలి.

ఉద్యోగులు, కార్మికులు పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు చేసే ఉద్యమంతో పాటు కేంద్ర ప్రభుత్వం, వారి అనుకూల మీడియా వారి ఆర్థికవేత్తలు చేసే తప్పుడు వాదనలో (అనగా పాత పెన్షన్ విధానం అమలు వల్ల ప్రభుత్వాలు అధిక ఆర్థిక భారాలు మోస్తున్నవి అనే వాదనలు) ఎంత మాత్రం వాస్తవం లేదని ప్రచార యుద్ధాన్ని కూడా జతచేసి పోరాటం నిర్వహించాల్సిన అవసరం ఉన్నది. అంతేగాక పాత పెన్షన్ పునరుద్ధరణ ఉద్యమంలో ఐక్యతను పటిష్టంగా నిర్మాణం చేసి దేశవ్యాపిత ఐక్య పోరాటాలకు కృషిచేయాలి. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో విడివిడిగా జరుగుతున్న పోరాటాలు దేశవ్యాప్త పోరాటాలుగా రూపాంతరం చెందే విధంగా కృషి చేసి విజయం సాధించేవరకూ పోరాడాలి. అదే కార్మికవర్గం ముందున్న ప్రస్తుత, ప్రధాన కర్తవ్యం కావాలి.

సియాసత్ మేనేజింగ్ ఎడిటర్‌కు కన్నీటి వీడ్కోలు

- నాంపల్లిలో జహీరుద్దీన్ అలీఖాన్ అంత్యక్రియలు పూర్తి
- కుటుంబీకులకు మంత్రులు, పలువురి పరామర్శ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్/బంజారాహిల్స్

పత్రికారంగంలో క్రియాశీలమైన భూమిక పోషించిన సుప్రసిద్ధ పాత్రికేయులు, సియాసత్ ఉర్దూ దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ అంత్యక్రియలు మంగళవారం నాంపల్లిలో ముగిశాయి. జహీరుద్దీన్ అలీఖాన్ మృతదేహాన్ని నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లోని మజీద్ నుంచి దారుసలంలోని ఖబ్రస్తాన్‌కు తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు, మతపెద్దలు, బంధువులు, స్నేహితుల మధ్య మృతదేహాన్ని సమాధి చేశారు. అంతిమయాత్రలో పెద్దసంఖ్యలో పత్రికారంగానికి చెందిన వారు, కవులు, కళాకారులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

లౌకిక విలువల పరిరక్షణే ధ్యేయంగా నిరంతరం పోరాడుతూ, సామాజిక ఉద్యమాల్లో ముందుండే జహీరుద్దీన్ అలీఖాన్(63) సోమవారం గద్దర్ అంతిమయాత్రలో పాల్గొన్న సమయంలో గుండెపోటుకు గురై హఠాన్మరణం చెందారు. గద్దర్ భౌతికకాయాన్ని తరలిస్తున్న వాహనంలోనే ఆయన ఇంటివద్దకు చేరుకున్నారు.

ఆ తర్వాత అక్కడి నుంచి మహాబోధి స్కూల్ ప్రాంతాన్ని పరిశీలించడానికి వెళ్లారు. అప్పటికి సాయంత్రం ఆరున్నర గంటలు సమయంలో ఆయనకు ఒక ఫోన్ కాల్ రావడంతో స్కూల్ ప్రాంగణం నుంచి బయటకు వచ్చారు. ఫోన్ మాట్లాడుతున్న క్రమంలోనే శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతూ ఆయన కుప్పకూలిపోయారు. అక్కడున్నవారు గమనించి సీపీఆర్ చేసి, ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి తీసుకొచ్చేటప్పటికే ఆయన కార్డియాక్ అరెస్టుతో తుది శ్వాస విడిచినట్టు వైద్యులు ప్రకటించిన విషయం విదితమే.

మంత్రులు సంతాపం

లక్డీకాపూల్‌లోని జహీరుద్దీన్ అలీఖాన్ నివాసంలో వారి కుటుంబ సభ్యులను మంత్రులు, ఇతర ప్రముఖులు పరామర్శించారు. మంత్రులు మహమూద్ అలీ, హరీశ్‌రావు, శ్రీనివాస్ గౌడ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎంపీ, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. జహీరుద్దీన్ అలీఖాన్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. జహీరుద్దీన్ అలీఖాన్ ఉర్దూ పత్రిక రంగానికి ఎనలేని సేవలు చేశారని గుర్తు చేసుకున్నారు.

కుటుంబ సభ్యులకు డీజీపీ అంజనీ కుమార్ పరామర్శ

జహీరుద్దీన్ అలీఖాన్ కుటుంబ సభ్యులను డీజీపీ అంజనీకుమార్ పరామర్శించారు. వారి నివాసానికి వెళ్లిన డీజీపీ జహీరుద్దీన్ అలీఖాన్ సోదరుడు జాహెద్ అలీఖాన్, కుమారుడు అమీర్ అలీఖాన్‌ను పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. నగరంలో మతసామరస్యానికి వారు చేసిన కృషిని ఈ సందర్భంగా డీజీపీ గుర్తు చేసుకున్నారు.

నేడు ఇంజినీరింగ్ తుదివిడత కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎంసెట్ తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో బుధవారం సీట్లు కేటాయిస్తామని సాంకేతిక విద్యాశాఖ తెలిపింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీట్లు కేటాయించిన అభ్యర్థులు ఈనెల 10 నుంచి 12 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. లేదంటే ఆ సీట్లు రద్దవుతాయని తెలిపారు.

ఒరిజినల్ బదిలీ ధ్రువపత్రంతోపాటు ఇతర సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతుల ను యాజమాన్యాలకు అందజేయాలని కోరారు. ఈనెల 17 నుంచి ఇంజినీరింగ్ ప్రవేశాల ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 23న సీట్లు కేటాయిస్తామని తెలిపారు. 25 నాటికి కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. లేదంటే కేటాయించిన అభ్యర్థుల సీట్లు రద్దవుతాయని స్పష్టం చేశారు.

9,355 జేపీఎస్‌ల క్రమబద్ధీకరణకు మార్గదర్శకాలు జారీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని 9,355 జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఒక ప్రకటన విడుదల చేశారు. నాలుగేండ్ల ఒప్పందాన్ని పూర్తిచేసుకున్న జేపీఎస్‌ల పనితీరును జిల్లా స్థాయిలో వేసిన పనితీరు మూల్యాంకన కమిటీ పరిశీలించాలని సూచించారు. దానికి సంబంధించిన రిపోర్ట్‌లను ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. నాలుగేండ్ల పనితీరులో 70 శాతం మార్కులను సాధించిన జేపీఎస్‌లను పంచాయతీరాజ్ శాఖ రూల్స్ ప్రకారం గ్రేడ్-4 కింద పర్మినెంట్ చేయాలని సూచించారు. 70 శాతం మార్కులు సాధించని జేపీఎస్‌లు తమ పనితీరును మెరుగు పరుచుకునేందుకు మరో ఆరు నెలల సమయం ఇవ్వాలని పేర్కొన్నారు. అప్పుడు వారి పనితీరును బట్టి పర్మినెంట్ చేయాలని సూచించారు.

ఆల్ నైన్స్.. ఆల్‌టైమ్ రికార్డు

- రూ.21.60 లక్షలు పలికిన 9999
- ఒక్కరోజే రూ.53.34 లక్షలపైగా సమకూరిన ఆదాయం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రవాణాశాఖ జారీ చేసే వాహన ఫ్యాన్సీ నెంబర్ల ద్వారా ప్రభుత్వానికి భారీ ఆదాయం వస్తోంది. స్టేటస్ సింబల్, క్రేజీ కోసం కొందరు.. అదృష్ట సంఖ్యగా భావించి మరికొందరు ఫ్యాన్సీ నెంబర్లు తీసుకుంటుండటంతో ఆర్టీఏకు ఆదాయం ఏటా పెరుగుతోంది. తాజాగా 9999 నెంబర్ రికార్డు స్థాయిలో రూ.21.60 లక్షలు పలికింది. 2021లో నిర్వహించిన ఈ-వేలంలో ఆల్ నైన్స్ 21.10లక్షలు పలికింది. దాదాపు రెండేండ్లుగా రవాణాశాఖ ఫ్యాన్సీ నెంబర్లను ఆన్‌లైన్ విధానంలో కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటలో పలు ఫ్యాన్సీ నెంబర్ల ద్వారా సుమారు రూ.53.34 లక్షలకు పైగా ఆదాయం వచ్చిందని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) జె.పాండురంగ నాయక్ తెలిపారు. వాహనదారులు స్టేటస్, క్రేజీ, న్యూమరాలజీ పేరుతో ఫ్యాన్సీ నెంబర్లను తీసుకుంటూ ఉండటం, నెంబర్ల కేటాయింపు ఆన్‌లైన్ విధానంలో పూర్తి పారదర్శకంగా కేటాయిస్తుండటంతో వాహనదారులు ఇష్టమైన సంఖ్య కోసం నచ్చినంత చెల్లించేందుకు పోటీపడుతున్నారని చెప్పారు. రవాణాశాఖలో ఇది అరుదైన రికార్డు అన్నారు.

మంగళవారం నిర్వహించిన ఆన్‌లైన్ ఈ-వేలంలో ప్రైమ్ సోర్స్ గ్లోబల్ ప్రయివేట్ లిమిటెడ్ అనే సంస్థ తమ ఖరీదైన వాహనం కోసం రూ. 21.60 లక్షలు వెచ్చించి టీఎస్09 జీడీ 9999 నెంబర్‌ను దక్కించుకుంది. అదే విధంగా టీఎస్09 జీడీ 0009 నెంబర్‌ను మెఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ రూ.10.50 లక్షలు చెల్లించి సొంతం చేసుకుంది. టీఎస్09 జీడీ 0001 నెంబర్‌ను ఆంధ్రా ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ రూ.3.01 లక్షలు వెచ్చించి కైవసం చేసుకోగా.. టీఎస్09 జీడీ 0006 నెంబర్‌ను గోయజ్ జ్యువెలరీ రూ.1.83 లక్షలు, టీఎస్ 09 జీడీ 0019 నెంబర్‌ను సితారా ఎంటర్‌టైన్‌మెంట్స్ రూ.1.70 లక్షలు, టీఎస్09 జీడీ 0045 నెంబర్‌ను సాయి పృథ్వీ ఎంటర్‌ప్రైజెస్ రూ.1.55 లక్షలు, టీఎస్09 జీడీ 0007 నెంబర్‌ను ఫిన్ ఎక్స్‌పర్ట్స్ రూ.1.30 లక్షలు, టీఎస్09 జీడీ 0027 నెంబర్‌ను శ్రీనివాస్ కన్‌స్ట్రక్షన్స్ 1.04లక్షలు చెల్లించి సొంతం చేసుకున్నాయి. ఫలితంగా ఒక్కరోజులు రవాణాశాఖ ఖజానాకు రూ.53.34.894 ఆదాయం చేరింది.

పేద విద్యార్థికి ఎమ్మెల్సీ కవిత ఆర్థిక చేయూత

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఓ పేద విద్యార్థి విదేశీ చదువుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆర్థిక సహాయం చేశారు. నిజామాబాద్ పట్టణానికి చెందిన సామల రితీష్‌కు అమెరికాలోని నార్త్ వెస్ట్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ సీటు లభించింది. చిన్న ఉద్యోగం చేస్తూ తన కుటుంబాన్ని పోషించే రితీష్ తండ్రి అమెరికాకు తన కొడుకుని పంపించే ఆర్థిక స్తోమత లేక, విషయాన్ని ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఆమె రితీష్ అమెరికాకు వెళ్లడానికి అవసరమయ్యే ఖర్చులను భరించారు. సొంత డబ్బుతో టిక్కెట్ కొని ఆర్థిక చేయూత ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవితకు రితీష్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ బకాయిల గురించి ఒత్తిడి చేయొద్దు : కేంద్రానికి హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ - హైదరాబాద్

ఏపీ విద్యుత్ సరఫరా చేసిన నిమిత్తం రూ.6,757 కోట్లు విద్యుత్ బకాయిలు చెల్లించాలంటూ తెలంగాణ ప్రభుత్వంపై ఏ విధమైన ఒత్తిడి తీసుకురావొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తెలంగాణ వేసిన మధ్యంతర పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేసింది. విచారణను ఈనెల 24కి వాయిదా వేసింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం తెలంగాణకు విద్యుత్ సరఫరా చేసింది. తెలంగాణ ప్రభుత్వం రూ.6,757 కోట్లు చెల్లింపు వ్యవహారంపై గతంలోనే హైకోర్టు స్టే విధించింది. ఇప్పుడు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయకపోతే కేంద్రం జోక్యం చేసుకునే అవకాశముంటుందని తెలంగాణ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేయడంతో పైవిధంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ అయ్యాయి. తీర్పునకు లోబడి ఎంబీబీఎస్ సీటు కేటాయింపు ఒకటి నుంచి పదో తరగతి వరకు తెలంగాణలో చదివిన విద్యార్థిని స్థానికేతరులుగా పరిగణించడంపై విచారణ చేస్తామంటూ హైకోర్టు తెలిపింది. తల్లి దండ్రులు ఉద్యోగ రీత్యా చెన్నై వెళ్లిన కారణం గా అక్కడ ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థిని హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి ప్రశంస రాథోడ్‌కి నీట్‌లో ర్యాంక్ వచ్చింది. అయితే ఆమె నాన్‌లోకల్ అంటూ అధికారులు ప్రకటించారు. దీంతో ఇందుకు సంబంధించిన జీవో 114ను రద్దు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ బెంచ్ మంగళవారం విచారించింది. పిటిషనర్‌కు ఎంబీబీఎస్ సీటు కేటాయించాలనీ, అయితే తుది తీర్పునకు లోబడి అది ఉంటుందని ఉత్తర్వులను జారీ చేసింది.

హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 60,060	▲ 100
22 క్యారెట్లు	- 55,050	▲ 100
కిలో వెండి	- 77,300	▲ 1000

చికెన్ ధరలు హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 84
రిటైల్ (లైవ్)	రూ. 106
స్కిన్‌తో	రూ. 154
స్కిన్‌లెస్	రూ. 175

పేదల కష్టాలు కనిపించలేదా?

- కోవిడ్ సమయంలో ఛిద్రమైన బతుకుల సంగతేంటి?
- 'పేదరికం'పై వాస్తవాలను విస్మరించిన నిటి ఆయోగ్

న్యూఢిల్లీ : దేశంలో పేదరికం తగ్గిపోయిందా? అవునట. నిటి ఆయోగ్ గత నెలలో విడుదల చేసిన నివేదిక ప్రకారం 2015-16లో 24.85 శాతంగా ఉన్న పేదరికం 2019-21 నాటికి గణనీయంగా... అంటే 14.96 శాతానికి తగ్గిపోయిందట. అయితే గత కొన్ని సంవత్సరాలుగా వివిధ సంస్థలు విడుదల చేస్తున్న నివేదికలను, గణాంకాలను పరిశీలిస్తే నిటి ఆయోగ్ నివేదికపై అనుమానాలు తలెత్తడం సహజం. పైగా నిటి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక ఏం చెప్పిందంటే అత్యంత నిరుపేద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్‌లో కూడా పేదరికం తగ్గిపోయిందట.

ఈ నివేదిక ప్రకారం గడచిన ఐదు సంవత్సరాలలో దేశంలోని 13.5 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారు. ఇదే నిజమైతే 2030 నాటికి నిర్దేశించుకున్న అభివృద్ధి లక్ష్యం దిశగా దేశం సాగుతున్నట్లే. పురుషులు, మహిళలు, చిన్నారులు... వారు ఏ వయసువారైనప్పటికీ ప్రజానీకంలో సగం మందిని 2030 నాటికి పేదరికం నుంచి గట్టెక్కించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



వాస్తవానికి కోవిడ్ కష్టకాలంలో ప్రజల ఆర్థిక స్థితిగతులు చిన్నాభిన్నమై పోయాయి. పట్టణాలు, నగరాలలో ఉపాధి కోల్పోయిన ప్రజలు గ్రామాల బాట పట్టి వందలాది కిలోమీటర్లు నడిచి, రాష్ట్రాలను దాటి స్వస్థలాలకు చేరుకున్నారు. కోవిడ్ మహమ్మారి ప్రభావం తగ్గిన తర్వాత వారు మళ్లీ పట్టణాలు, నగరాలకు చేరుకొని జీవనోపాధి కోసం ప్రయత్నించారు. ఆశ్చర్యకరమైన విషయమేమంటే పేదల బతుకులు ఛిద్రమైన ఆ సమయంలో సైతం దేశంలో పేదరికం తగ్గిందని నిటి ఆయోగ్ చెబుతోంది.

కోవిడ్ సమయంలో...

2020-21కి సంబంధించిన సమాచారాన్ని 2020 జనవరి నుంచి 2021 ఏప్రిల్ మధ్యకాలంలో సేకరించారు. ఈ సమయంలోనే కోవిడ్ మహమ్మారి దేశాన్ని అతలాకుతలం చేసింది. ఈ కాలంలోనే పేదలు పెద్ద ఎత్తున పట్టణాలు, నగరాల నుంచి గ్రామాలకు వలస పోయారు. ప్రజలు అనారోగ్య కారణాలతో వైద్యం పైన ఎక్కువ సొమ్మును ఖర్చు చేయాల్సి వచ్చింది. కోవిడ్ కారణంగా చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. లాక్‌డౌన్‌తో చిన్న చిన్న వ్యాపారాలు మూతపడ్డాయి. కొన్ని ఇప్పటికీ ప్రారంభం కాని పరిస్థితి. కొందరైతే వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తెచ్చి వ్యాపారాలు మొదలు పెట్టారు. పరిశ్రమలు మూతపడడం అంటే యజమానులే కాదు వాటిలో పని చేసే కార్మికులు కూడా ఉపాధి కోల్పోయినట్లే. ధనికులైనా, పేదలైనా విద్యార్థుల చదువులు అటకెక్కాయి. విద్యా సంస్థలను మూసేశారు. ఆన్‌లైన్ క్లాసులతో నెట్టుకొచ్చారు. కానీ అవి పేద విద్యార్థులకు అందుబాటులో లేకుండా పోయాయి. గ్రామీణ ప్రాంతాలకు తల్లిదండ్రులతో పాటే వలస పోయిన విద్యార్థుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఒక్క మాటలో చెప్పాలంటే 2020-21లో పేదల ఆదాయాలు, ఉపాధి, విద్య, ఆరోగ్య ప్రమాణాలకు గట్టి విఘాతం ఏర్పడింది. ఇలాంటి ప్రతికూల పరిస్థితులు నెలకొని ఉంటే పేదరికం తగ్గిపోయిందని చెబుతున్న నిటి ఆయోగ్ నివేదికను ఎలా విశ్వసించగలం?

అంచనాలలో లోపాలు

నిటి ఆయోగ్ నివేదిక విశ్వసనీయతపై ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యులు సైతం అనుమానాలు వ్యక్తం చేశారు. 2011 నాటి జనగణనకు సంబంధించిన నమూనాలలో ఇటీవల చేసిన ప్రధాన మార్పులను ఈ నివేదిక పట్టించుకోలేదని వారు ఎత్తిచూపారు. పైగా 2012 తర్వాత ప్రభుత్వం వినియోగ సర్వే చేపట్టలేదు. దీనివల్ల ప్రభుత్వం పేదరికాన్ని సరిగా అంచనా వేయలేకపోయింది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన 28 కోట్ల మంది కార్మికులలో 94 శాతం మంది తమ నెలసరి వేతనం పది వేల రూపాయల కంటే తక్కువేనని డిక్లరేషన్ ఇచ్చారు. అంటే అసంఘటిత రంగంలో పని చేస్తున్న చాలా మంది కార్మికులు దారిద్ర్య రేఖకు సమీపంలోనే ఉన్నారని అర్థమవుతుంది. ఆరోగ్యం, విద్య సూచికలలోనే కాదు... అనేక ఇతర అంశాలలో కూడా కోవిడ్ కాలంలో పేదల బతుకులు చిన్నాభిన్నమైపోయాయి.

ఎలా నిర్ణయిస్తారు?

ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు అనే మూడు అంశాలను ఆధారంగా చేసుకొని పేదరిక సూచికను రూపొందిస్తారు. ఈ మూడింటికి సమాన ప్రాధాన్యత ఇస్తారు. ఈ మూడు అంశాలను తిరిగి 12 సూచికలుగా విభజిస్తారు. వీటిలో మూడు ఆరోగ్యానికి, రెండు విద్యకు, ఏడు జీవన ప్రమాణాలకు సంబంధించినవి. కోవిడ్ రాక ముందే అంటే 2019-20లోనే 70% సమాచారాన్ని సేకరించామని నిటి ఆయోగ్ తెలిపింది. ఇదే నిజమైతే 2019-20 సమాచారంతో 2015-16 సమాచారాన్ని పోల్చి చూడాల్సింది. కానీ మరి ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైన అసాధారణ కాలంతో ఎందుకు పోల్చారు? అధికారిక గణాంకాల ప్రకారమే 2019-20లో ఉన్న జీడీపీ (4.8 శాతం) 2022-23 నాటికి కానీ తిరిగి ఆ స్థాయికి చేరుకోదు. అంటే మూడు సంవత్సరాల అభివృద్ధిని దేశం కోల్పోయింది. ఆర్థికాభివృద్ధి పది శాతం పడిపోయింది. కోవిడ్ ప్రభావం తగ్గిపోయిన తర్వాత సంఘటిత రంగం సంక్షోభం నుంచి కోలుకుంది. కానీ పేదలు ఎక్కువగా పని చేసే అసంఘటిత రంగం మాత్రం నిదానంగా కోలు కుంటోంది. అయితే ఈ వాస్తవాన్ని నిటి ఆయోగ్ విస్మరించింది.

ఆయన పలుకే బంగారం ...

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నకూ సమాధానం చెబుతానని మాత్రం ఆయన పలు సందర్భాలలో ప్రకటిస్తుంటారు.. మోడీ ప్రధాని అయిన తర్వాత ప్రధాని కార్యాలయం (పీఎంఓ) కేవలం 13 ప్రశ్నలకు మాత్రమే సమాధానం చెప్పింది. అసలు ప్రశ్నించే గొంతుకలంటేనే ఆయనకు గిట్టదు. విదేశీ పర్యటనల నుండి తిరిగి వచ్చిన తర్వాత ఆయన ఎన్నడూ వాటిపై సభలో ప్రకటన చేయలేదు. సభ్యుల ప్రశ్నలకు సమాధానాలూ ఇవ్వలేదు. ఏదైనా విషయంపై చర్చ జరిగినా ఆయన ఎన్నడూ జోక్యం చేసుకునే వారు కాదు. కేవలం ఒకే ఒక్క సందర్భంలో... అది కూడా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సంవత్సరంలో మాత్రం చర్చలో భాగస్వామి అయ్యారు. ఓ ఎన్నికల ప్రచార సభలో సాధ్వి నిరంజన్ జ్యోతి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ప్రతిపక్ష సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేసినప్పుడు స్పందించారు. అదే మొదటి సారి...చివరిసారి కూడా.

ఇక గత ఏడు సంవత్సరాల కాలంలో చర్చ సందర్భంగా ఆయన పార్లమెంటులో పెదవి విప్పింది ఒకే ఒక్క సందర్భం లో. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు 2017 ఫిబ్రవరిలో ఆయన సమాధానం ఇచ్చారు. పార్లమెంట్ సమావేశాలు జరగడానికి ముందు ప్రతిసారీ ఆయన మీడియాకు ఓ సందేశం చేర వేస్తుంటారు. ఉభయ సభలలో అర్థవంతమైన చర్చలు జరగాలని ఆశా భావం వ్యక్తం చేస్తారు. కానీ ఆయన మాత్రం ఎన్నడూ ఏ చర్చలోనూ క్రియాశీలకంగా వ్యవహరించిన పాపాన పోలేదు. సభ్యుల ప్రశ్నలకు మంత్రులే సమాధానాలు ఇస్తుంటారు. ప్రధానిని ఉద్దేశించి అడిగే ప్రశ్నలకు సైతం పీఎంఓ సహాయ మంత్రే జవాబు ఇస్తుంటారు. గడచిన ఏడు సంవత్సరాలలో ఆయన ఒక్క పత్రికా సమావేశాన్ని కూడా నిర్వహించలేదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన ఇంటర్వ్యూలలో సైతం ప్రశ్నలు అడిగేందుకు అవకాశం ఇచ్చే వారు కాదు. తాను చెప్పింది రాసుకోవడమే పాత్రికేయుల విధి అని అనుకునే వారు. ప్రధాని అయిన తర్వాత ఇచ్చిన ఇంటర్వ్యూలు కూడా తనను పొగిడే భజనపరులకు ఇచ్చినవే. మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు అరుణ్ శౌరి వంటి పరిశీలకులు ఆయనది అధ్యక్ష తరహా పాలన అని అంచనా వేశారు. జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే వారి అభిప్రాయంతో ఏకీభవించక తప్పదేమో!.

ఎయిర్‌పోర్టులో 1.527 కిలోల బంగారం పట్టివేత

నవతెలంగాణ-శంషాబాద్



శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో పెద్ద ఎత్తున బంగారం పట్టుబడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. హైదరాబాద్ కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు వేర్వేరు కేసుల్లో రూ.93.26 లక్షల విలువైన 1.527 కిలోల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన ఒక ప్రయాణికుడి నుంచి రూ.49,47,480 విలువైన 810 గ్రాములు, అదే విమానంలో మరో ప్రయాణికుని నుంచి రూ.43,79,436 విలువ చేసే 717 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

ఎస్‌బీఐ 'పిఎం స్వనిధి' క్యాంపెయిన్



హైదరాబాద్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సర్కిల్ పిఎంస్వనిధి పబ్లిసిటీ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. మంగళవారం దీన్ని కోటిలోని ఆ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ జింగ్రన్, చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ లాంచనంగా ప్రారంభించారు. వీధి వ్యాపారులు, సూక్ష్మ ఎంటర్‌ప్రెన్యూర్స్‌ను చేరడమే లక్ష్యంగా.. వారికి రుణాలు అందించే ఉద్దేశ్యంతో ఈ క్యాంపెయిన్ చేపడుతున్నామని జింగ్రన్ పేర్కొన్నారు. వీధి వ్యాపారులకు ఎలాంటి తనఖా లేకుండానే రూ.50,000 వరకు రుణం అందిస్తున్నామని రాజేష్ కుమార్ తెలిపారు. ఆ పథకం వివరాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ బ్యాంక్ జీఎం (ఎన్‌డబ్ల్యు-2) దేబాషిస్ మిత్రా, డిజిఎం జి భువనేశ్వరి, ఇతర ఉన్నతాధికారులు, స్టాఫ్ పాల్గొన్నారు.

బాలికా సాధికారతే బీబీజీ లక్ష్యం

హైదరాబాద్ : బాలికల సాధికారతే లక్ష్యంగా కృషి చేస్తున్నామని బీబీజీ చైర్మెన్, ఎండీ ఎంవి మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. 2040 నాటికి 20 లక్షల ఆడపిల్లలను శక్తివంతం చేయడం ద్వారా నిజమైన సంపదను సృష్టించాలని నిర్దేశించుకున్నామన్నారు. తెలంగాణలోని పెద్దంబర్‌పేట, ఎల్‌బినగర్, వనస్థలిపురంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 'ప్రేరణ' కార్యక్రమం నిర్వహించినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఆయా పాఠశాలల్లోని 1500 పైగా విద్యార్థులు, 50 మంది ఉపాధ్యాయులకు చేరువయినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా 'బాల దుర్వినియోగం', 'సామాజిక బాధ్యత', 'డిజిటల్ డిటాక్స్', 'స్టడీ స్కిల్స్' అంశాలపై అవగాహన సెషన్‌లను ఉషా కస్తూరి, నీరజ నేతృత్వంలో నిర్వహించినట్లు వెల్లడించింది. ప్రేరణ అనేది పేద పిల్లలకు నాణ్యమైన విద్యను, వ్యక్తిగత వద్ధికి అవకాశాలను అందించడం ద్వారా వారికి సాధికారత కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు పేర్కొంది.

ఓట్ల కోసం దేశాన్ని తగల బెడుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

క్యాబిన్‌లో కూర్చొని ప్రజలను ఎలా విభజించాలని పదే పదే ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విభజనను ఎలా చాకచక్యంగా వచ్చే ఎన్నికల్లో గెలుపుకోసం ఉపయోగించుకోవాలో కూడా 50 మంది బీజేపీ ఎంపీలకు ఆయన సూచిస్తున్నారని విమర్శించారు. "ప్రధాని పార్లమెంట్‌కు రావడానికి ఎందుకు వెనుకాడుతున్నారు? పార్లమెంట్‌లో ఎదుటి సభ్యులందరూ మీకు శత్రువులని మీరు అనుకుంటున్నారు. కానీ మేము కూడా మీలాగే ప్రజలచే ఎన్నుకోబడ్డాం" అని గుర్తు చేశారు.

"ప్రపంచ ప్రఖ్యాత అమెరికా టైమ్ మ్యాగజైన్ ప్రధాని ముఖచిత్రాన్ని ప్రచురించి, ఆయనను విభజన నాయకుడిగా అభివర్ణించింది. అదేవిధంగా రోమన్ సామ్రాజ్యం మండుతున్నప్పుడు తన పియానో వాయించిన నీరో చక్రవర్తిగా మన దేశంలోను, వెలుపల ఉన్న ప్రముఖ మీడియాలన్నీ ప్రధాని మోడీని పోల్చాయి" అని తెలిపారు. పార్లమెంట్ చరిత్రలో అతి తక్కువ సమయం సభకు హాజరైన ప్రధానిగా మోడీ రికార్డు సృష్టించారని తమకు తెలుసని, ఈ రికార్డును మరెవరూ బద్దలు కొట్టలేరని తాను భావిస్తున్నానని అన్నారు. మణిపూర్‌లో హింస మొదలైన 79 రోజుల తరువాత మాత్రమే ప్రధాని సభ వెలుపల నోరు విప్పారని, ఇది సిగ్గుచేటని ధ్వజమెత్తారు. టెలిగ్రాఫ్ వార్తాపత్రిక ప్రధాని స్పందనను మొసలి కన్నీరుగా చిత్రీకరించిందని తెలిపారు. మణిపూర్ అంశం మీ 56 అంగుళాల ఛాతిలోకి చొచ్చుకుపోవడం చాలా కష్టం కాబట్టి, ఇది మొసలి కన్నీరుగా అభివర్ణించిందని అన్నారు.

మణిపూర్ తగలబడుతుంటే మన ప్రధాని ఫ్రాన్స్‌కు వెళ్లి ప్రపంచ శాంతి గురించి ప్రసంగించారని,"ఆయన దుర్వాసన వెదజల్లుతూ సుగంధ ద్రవ్యాలు అమ్ముతారు" అని అన్నారు. మణిపూర్ దహనమవుతుంటే, ప్రధాని మోడీ విదేశాల్లో ప్రపంచ శాంతి గురించి మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అతీతంగా ఒక రాష్ట్రం (మణిపూర్)పై సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకోవడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. ఈ ప్రభుత్వానికి సిగ్గుంటే, ప్రధాని, హోంమంత్రి తమ పదవికి రాజీనామా చేయాలన్నారు.

మణిపూర్ వివాదం తరువాత మరో మతపరమైన అల్లర్లు హర్యానాకు విస్తరించి ఇంకా కొనసాగుతూనే ఉన్నాయన్నారు. హింసను అరికట్టేందుకు రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం ఏమీ చేయలేదని అన్నారు. మణిపూర్ మండుతున్నప్పుడు ప్రధాని యూసీసీ అనే మరో అంశంతో ప్రజల్లో చర్చకు ప్రయత్నించారని విమర్శించారు. బాబ్రీ మసీదు తరువాత వారణాసిలో మరో మసీదు (జ్ఞానవాపి) కూల్చివేసేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. దీని తరువాత కాశీ, మధుర మసీదులకు వెళతారని తమకు తెలుసన్నారు. ఇవన్నీ ఒక్కొక్కటిగా వస్తాయని, ఓట్ల కోసం ఈ దేశాన్ని తగలబెడతారనడంలో సందేహం లేదని ధ్వజమెత్తారు.

దేశంలోని లౌకిక శక్తులు ఈ విభజన శక్తుల నుంచి దేశాన్ని కాపాడతాయని, బీజేపీ ఈ దేశానికి చేసిన వినాశనం నుంచి దేశాన్ని రక్షించడానికి అన్ని ప్రతిపక్ష పార్టీలు కలిసి ఇండియా కూటమిగా ఏర్పడ్డాయని అన్నారు. ఇండియా కూటమిని ఓడించేందుకు ఈడీ జీవిత కాల డైరెక్టర్‌గా మిశ్రాను నియమించారని, కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి లోక్‌సభలో మీ ఇంటికి ఈడీ వస్తుందని ప్రతిపక్షాలను హెచ్చరిస్తోందని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం ఈడీ ఇప్పటికే తన ఎంపిక విధిని ప్రారంభించిందని విమర్శించారు. కేరళలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమను ఓడించేందుకు సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ, ఆదాయపు పన్ను, సెంట్రల్ విజిలెన్స్, కస్టమ్స్, కాగ్ వంటి తొమ్మిది ఏజెన్సీలను పంపారని, కానీ అక్కడి లెఫ్ట్ ప్రభుత్వాన్ని ఓడించలేకపోయారని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రధాని మోడీ కూడా ఇండియా కుటమిని ఓడించేందుకు అనేక కుట్రలు పన్నుతున్నారని, అయితే ఆ పప్పులేవీ ఉడకవని స్పష్టం చేశారు.ఆర్ఎస్ఎస్ నాయకత్వం స్వాతంత్ర్య ఉద్యమా నికి వ్యతిరేకం ఉండటం వల్లే, క్విట్ ఇండియా గురించి ప్రధాని మోడీకి తెలియదని ఎద్దేవా చేశారు. ఈ పార్లమెంట్‌లో జర్నలిస్టులు ప్రవేశించడానికి అనుమతి లేదని, దీనికి కారణం ప్రధాని మోడీకి మీడియా అంటే ద్వేషం, భయం అని పేర్కొన్నారు. ఈ సభలో మెజార్టీతో అవిశ్వాస తీర్మానాన్ని ఓడించ వచ్చని, కానీ దేశంలోని ప్రజల బలంతో బీజేపీ ప్రభుత్వంపై అసలు అవిశ్వాసం పెట్టగలమని తమకు గట్టి నమ్మకం ఉందన్నారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

లేనిపక్షంలో ప్రగతిభవన్‌ను ముట్టడిస్తాం

- తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా, క్యాబ్ డ్రైవర్ల సంఘాల జేఏసీ హెచ్చరిక
- ఆర్టీఏ కమిషనర్ ఆఫీస్ ముట్టడి
- ఆఫీస్‌లోకి దూసుకెళ్లడానికి ప్రయత్నించిన డ్రైవర్లు
- అడ్డుకుని ఈడ్చుకెళ్లి అరెస్టు చేసిన పోలీసులు



నవతెలంగాణ-సిటీబ్యూరో/బంజారాహిల్స్

వందశాతం పెరిగిన ఇంధన ధరలు, ఆదాయం పతనంతో రవాణారంగం కార్మికులు అనేక సమస్య లు ఎదుర్కొంటున్నారని, వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఆటో రిక్షా అండ్ క్యాబ్ డ్రైవర్ల సంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గతంలో అనేకసార్లు విజ్ఞాపనలు, ధర్నాలు, పోరాటా లు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుందని, ముఖ్యమంత్రి కేసీఆర్ తక్షణమే స్పందించి ఆటో రిక్షా, క్యాబ్ డ్రైవర్లు సమస్యలు పరిష్కరించాలంది. లేనిపక్షంలో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించింది.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాష్ట్ర ఆటో రిక్షా అండ్ క్యాబ్ డ్రైవర్ల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని రవాణాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ఆటో రిక్షా, క్యాబ్ డ్రైవర్లు ముట్టడించారు. పెద్దఎత్తున నినాదాలు చేస్తూ కమిషనరేట్ లోకి దూసుకెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. డ్రైవర్లకు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ క్రమంలో నిరసనకారులు రహదారిపై బైటాయించగా పోలీసులు బలవంతంగా ఈడ్చుకుంటూ తీసుకెళ్లి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు బి.వెంకటేశం (ఏఐటీయూసీ), వి. మారయ్య (బీఆర్‌టీయూ), శ్రీకాంత్(సీఐటీయూ), ఏ.సత్తిరెడ్డి (టిఏడిఎస్), కిరణ్ (ఐఎఫ్‌టీయూ), షేక్ సలావుద్దీన్, సతీష్, నగేష్(క్యాబ్స్ యూనియన్) మాట్లాడారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్లు పేదరికంలో జీవిస్తున్నారని, 2014 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఆటో మీటర్ చార్జీలు పెంచకపోవడం దారుణమని అన్నారు. నిత్యావసర వస్తువులతోపాటు, పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు వంద శాతం పెరగడంతో రవా ణారంగ కార్మికులు దయనీయ పరిస్థితులను ఎదు ర్కొంటున్నారని తెలిపారు. అసంఘటిత రంగంలోని ఆటో కార్మికులు కార్మిక చట్టాల పరిధిలో లేరని, వారికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి లేవని, ప్రభుత్వం నుంచి ఎలాంటి సామాజిక భద్రత ప్రయోజనాలూ పొందడం లేదని తెలిపారు. ఆటో కార్మికుల మనో వేదనలను ప్రభుత్వం అర్థం చేసుకొని, తక్షణమే ఆటో మీటర్ చార్జీలు పెంచి, కార్మికుల సంక్షేమానికి రవాణారంగ కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్త ఆటో పర్మిట్ల జారీ నిషేధం వల్ల నిరుద్యోగ యువతకు ఉపాధి దొరకకుండా పోతుందని, నిషేధం ఎత్తివేసి 25 వేల కొత్త ఆటో పర్మిట్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్ ట్యాక్స్, గ్రీన్ ట్యాక్స్‌లు, నూతన మోటర్ వాహన చట్టాన్ని రద్దు చేయాలని, పెట్రోల్, డీజీల్, ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చేందుకు కేంద్రపై ఒత్తిడి తేవాలని కోరారు.

ఆటోరంగ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ముట్టడిలో ఏఐఆర్‌టీడబ్లూఎఫ్-సీఐటీయూ నగర కార్యదర్శి అజయ్ బాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ నేతలు కొంరెల్లి బాబు, సీహెచ్. జంగయ్య, ఎండీ. ఒమర్ ఖాన్, ఎస్.కే. లతీఫ్, కృష్ణమూర్తి, ఐఎఫ్‌టీ యూ ప్రవీణ్, బీఆర్‌టీయూ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల కమీషన్ రూ.1,400కు పెంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రేషన్ డీలర్ల కమిషన్‌ను మెట్రిక్ టన్నుకు రూ.1,400కు రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. తెలంగాణ ఏర్పాటు సమయంలో రూ.200గా ఉన్న కమిషన్‌ను దశల వారీగా పెంచుతూ వచ్చారు. ఈ పెంపుతో రాష్ట్రంలోని 17,227 మంది రేషన్ డీలర్లు లబ్ది పొందనున్నారు. ఇందు కోసం ప్రతి ఏటా అదనంగా రూ.139 కోట్లను ప్రభుత్వం వెచ్చించనుంది. కరోనా సమయంలో చనిపోయిన 100 మంది రేషన్ డీలర్ల వారసులకు షాపులను కేటాయిస్తూ సర్కారు నిర్ణయించింది. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్‌తో డిప్యూటీ స్పీకర్ పద్మారావు, రేషన్ డీలర్ల సంఘం గౌరవాధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి, జేఏసీ ప్రతినిధులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, కమిషన్‌ను అతి తక్కువ సమయంలో 700 శాతం పెంచిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ఏకమొత్తంలో రెండింతలు పెంచడమే కాకుండా ప్రధానమైన 13 అంశాలను పరిష్కరించినట్టు వారు తెలిపారు.

డీలర్ల కమిషన్ పెంపు సహా తమ ఇతర సమస్యలను పరిష్కరించిన ప్రభుత్వానికీ, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రేషన్ డీలర్లు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సహకరించిన మంత్రులు, డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిలకు సమావేశంలోనే ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ కమిషనర్ వి.అనిల్ కుమార్, రేషన్ డీలర్ల జేఏసీ ప్రతినిధులు నాయికోటి రాజు, మల్లిఖార్జున్, రవీందర్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల కొన్ని అంశాల పట్ల మంత్రులు సానుకూలత వ్యక్తం చేశారు. ఆ డిమాండ్లు ఇవే...

- కరోనా సమయంలో సేవలందిస్తూ మరణించిన 100మంది రేషన్ డీలర్ల వారసులకు కారుణ్య నియామకం కింద డీలర్‌షిప్ మంజూరు చేయడం
- రాష్ట్రంలో అమలవుతున్న రైతు, నేత, గౌడ తదితర బీమాల తరహాలో రేషన్ డీలర్లకు రూ.5 లక్షల బీమా అమలు
- ఆరోగ్యశ్రీ పరిధిలోకి ప్రతీ డీలర్‌ను తీసుకురావడం
- ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద ఖచ్చితమైన తూకం వేసేలా వేబ్రిడ్జిల ఏర్పాటు
- డీలర్‌షిప్ రెన్యూవల్ కాలాన్ని ఐదేండ్లకు పెంచడం
- రేషన్ డీలర్‌షిప్ వయోపరిమితిని 40 నుండి 50 ఏండ్లకు పెంపు
- అంత్యక్రియల నిర్వహణకు తక్షణ సాయం రూ.10 వేలు,
- 1.5 క్వింటాళ్ల వేరియేషన్ను కేసుల పరిధినుంచి తీసేయడం,
- హైదరాబాద్‌లో రేషన్ భవన్ నిర్మాణానికి భూకేటాయింపు

నోరు విప్పరేం...!

(మొదటిపేజీ తరువాయి)

ఎఎం ఆరీఫ్ (సీపీఐ(ఎం), సుప్రియా సూలే (ఎన్‌సీపీ), డింపుల్ యాదవ్ (ఎస్‌పీ), ఎన్‌కె ప్రేమ్ చంద్రన్ (ఆర్ఎస్‌పీ), అరవింద్ గణపత్ సవంత్ (శివసేన (ఠాక్రే)), సర్దార్ సిమ్రాన్‌జిత్ సింగ్ (ఎస్ఏడీఎం), తిరుమవలవన్ (వీసీకే), పినాకి మిశ్రా (బీజేడీ), శ్రీకాంత్ షిండే (శివసేన (షిండే)), నవనీత్ రాణ (ఇండిపెండెంట్ ఎంపీ) తదితరులు మాట్లాడారు.

బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబేపై కాంగ్రెస్ ప్రివిలేజ్ నోటీస్

లోక్‌సభలో బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబేపై కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ ప్రివిలేజ్ నోటీస్ ఇచ్చారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై నిషికాంత్ దూబే 'పూర్తి కల్పితం' అని ఆరోపణలు చేశారని నోటీసులో పేర్కొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తు గడువు పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)

కారణాలతో పనిచేయకపోవడం వల్ల ఈ గడువు సరిపోదని పేర్కొన్నారు. ఫలితంగా కొంతమంది అర్హులు ఈ పథకానికి దూరమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి దరఖాస్తు గడువును మరో నెలరోజుల వరకు పొడిగించాలనీ, ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా ఈ పథకాన్ని అమలు చేయాలని కోరారు. మొదటి విడత గృహలక్ష్మి పథకం ద్వారా ప్రతి నియోజకవర్గానికీ మూడువేల ఇండ్లు మంజూరు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. అయినప్పటికీ మార్గదర్శకాల్లో పేర్కొన్న కొన్ని అంశాల వల్ల కొంతమంది అర్హులు దూరమవుతున్నారని వివరించారు. వేలాది ఆహార భద్రత కార్డుల దరఖాస్తులను పరిష్కరించకుండా ప్రభుత్వం తన దగ్గర పెండింగ్‌లో పెట్టుకోవడంతో చాలామంది అర్హులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏండ్ల తరబడి ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు, చిన్నచిన్న రేకుల రూములు వేసుకుని నివసిస్తున్న పేదలు 59 జీవో కింద ఇంటి స్థలాలు పొందారని తెలిపారు. వారికి ప్రభుత్వం మొండిచెయ్యి చూపడం సరైందికాదని విమర్శించారు. ఎన్నికల ముందు డబుల్‌బెడ్రూం ఇండ్లకు రూ.ఐదు లక్షలిస్తామన్న హామీని రూ.మూడు లక్షలకు కుదించడంతో పేదల ఇంటి నిర్మాణం భారంగా మారనుందని తమ్మినేని పేర్కొన్నారు. అర్హులందరికీ ఈ పథకంలో అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

20 రోజులు పొడిగించాలి : ప్రజాపంథా

గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువును 20 రోజులు పొడిగించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఇండ్లులేని నిరుపేదలందరికీ షరతుల్లేకుండా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసేందుకు మూడు రోజులే గడువు ఇచ్చారని తెలిపారు. కులం, నివాసం, ఆదాయం, భూమి పేపర్లు, ఫొటోలు, ఓటర్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ ఇవన్నీ తయారు చేసుకునే వరకు మూడు రోజులు గడిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చూస్తుంటే దరఖాస్తుకు అవకాశం ఇచ్చినట్టే ఇచ్చి ఈ పథకాన్ని అటకెక్కించే ఉద్దేశం కనిపిస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లబ్దిదారులకు ఎలాంటి అక్నాలెడ్జ్‌మెంట్ కార్డు ఇవ్వకుండా బాక్సుల్లో వేయించడం సరైంది కాదని తెలిపారు.

దరఖాస్తు ఏమైందో తెలుసుకుని ప్రజలు ప్రశ్నించే అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పొందిన వారిని అనర్హులుగా ప్రకటిస్తే లక్షలాది మంది పేదలు అన్యాయానికి గురవుతారని తెలిపారు. వాటికి సంబంధం లేకుండానే ఈ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తగిన సమయం ఇవ్వకపోతే పేదల పక్షాన పోరాటాలు చేయకతప్పదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

వైద్యవిధాన పరిషత్ విభాగంలో 3,124 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యవిధాన పరిషత్‌లోని 3,124 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు మంగళవారం ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి హరిత కల్లెపు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేశారు. 968 పోస్టులను కాంట్రాక్టు, 2,029 పోస్టులను పొరుగుసేవల, 127 పోస్టులను ఎంటీఎస్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఆమోదం తెలిపింది.

బిజినెస్

అమెరికన్ బ్యాంక్‌ల పరపతి పతనం

- 10 బ్యాంక్‌ల రేటింగ్‌కు మూడీస్ కోత
- మరిన్ని విత్త సంస్థలకు హెచ్చరిక



వాషింగ్టన్ : అమెరికన్ బ్యాంక్‌ల పరపతి దెబ్బతింటుంది. అక్కడి ఆర్థిక వ్యవస్థలోని లోపాలు విత్త సంస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలోనూ మూడు, నాలుగు బ్యాంక్‌లు దివాలా అంచునకు చేరిన విషయం తెలిసిందే. తాజాగా గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ అమెరికాకు చెందిన 10 బ్యాంక్‌ల పరపతికి కోత పెట్టింది. మరిన్ని బ్యాంక్‌ల రేటింగ్‌ను తగ్గిస్తామని హెచ్చరించింది. దేశంలోని కొన్ని అతిపెద్ద రుణదాతల స్థితిని సమీక్షిస్తున్నట్టు తెలిపింది. స్థూలంగా 27 బ్యాంక్‌లపై అంచనాలను విడుదల చేసింది. దేశంలోని ఎంఅండ్‌టీ బ్యాంక్, పినాకిల్ ఫైనాన్షియల్ పార్ట్‌నర్స్, ప్రాస్పిరిటీ బ్యాంక్, బీఓకే ఫైనాన్షియల్ కార్ప్ సంస్థల రేటింగ్‌కు కోత పెట్టింది. మరోవైపు బీఎన్‌వై మెల్లన్, యూఎస్ బన్‌కార్ప్, స్టేట్‌స్ట్రీట్, ట్రూయిస్ట్ ఫైనాన్షియల్ విత్త సంస్థలను డౌన్‌గ్రేడ్ కోసం సమీక్షాలో ఉంచినట్లు మూడీస్ వెల్లడించింది. "చాలా బ్యాంకులు జూన్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో లాభదాయకత ఒత్తిళ్లను చవి చూశాయి. ఇది అంతర్గత మూలధనాన్ని ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. ఇది స్వల్ప మాంద్యం కారణంగా వస్తుంది. బ్యాంకులు వడ్డీ రేట్లు, వారి ఆస్తులు, బాధ్యతలను నిర్వహించడం వల్ల ఎక్కువ నష్టాలను ఎదుర్కొంటున్నాయి" అని మూడీస్ విశ్లేషించింది. ఈ ఏడాది ప్రారంభంలో సిలికాన్ వ్యాలీ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్ పతనం అమెరికా బ్యాంకింగ్ రంగంపై విశ్వాసాన్ని సన్నగిల్లేలా చేశాయి. ఈ పరిణామాలు అక్కడి సంక్షోభానికి అద్దం పట్టాయి. విశ్వాసాన్ని పెంచడానికి అధికారులు అత్యవసర చర్యలను ప్రారంభించినప్పటికీ.. ప్రాంతీయ బ్యాంకుల్లో డిపాజిట్లను ఉపసంహరించుకోవడానికి ప్రజలు పరుగులు పెట్టారు.

మూన్‌లైటింగ్ ఉద్యోగులకు ఐటీ శాఖ షాక్

న్యూఢిల్లీ : ఐటీ పరిశ్రమలో రెండేసి ఉద్యోగులు (మూన్‌లైటింగ్) చేసే వారికి ఆదాయపు పన్ను శాఖ షాక్ ఇచ్చింది. ముఖ్యంగా కరోనా లాక్‌డౌన్ సమయంలో చాలా మంది ఉద్యోగులు అధిక ఆదాయం కోసం రెండేసి ఉద్యోగాలు చేశారు. కానీ.. ఆ ఆదాయాలను ఐటీ రిటర్న్‌లలో చూపించలేదు. దీంతో ఆయా ఉద్యోగులకు ఐటీ శాఖ నోటీసులు జారీ చేసిందని ఇటి ఓ కథనంలో పేర్కొంది. ప్రస్తుతానికి 2019-2020, 2020-2021 ఆర్థిక సంవత్సరాల ఆదాయాలకు సంబంధించి నోటీసులు ఇచ్చిందని సమాచారం. మూన్‌లైటింగ్ ద్వారా సంపాదిస్తున్న వారిలో ఎక్కువ మంది ఐటి రంగం, అకౌంటింగ్ మేనేజ్‌మెంట్ నిపుణులు ఉన్నారు. మూన్ లైటింగ్ సంపాదనపై పన్ను చెల్లించని దాదాపు 1000 మందికి పైగా ఉద్యోగులకు ఆదాయపు పన్ను శాఖ నోటీసులు జారీ చేసింది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. మూన్‌లైటింగ్‌కు పాల్పడిన వారిని కొన్ని సంస్థలు ఉద్యోగం నుంచి తొలగించిన ఘటనలు ఉన్నాయి. తొలుత రూ.5 నుంచి రూ.10 లక్షల వరకు వార్షికాదాయాన్ని రిటర్నుల్లో చూపించని వారికి ఈ నోటీసులు పంపినట్టు తెలుస్తోంది.

ఏడాదిలో ఆకాశ ఎయిర్‌కు 4.9శాతం వాటా

న్యూఢిల్లీ : భారత విమానయాన రంగంలోకి ప్రవేశించిన అనాతికాలంలోనే మెరుగైన ప్రగతిని కనబర్చుతున్నట్లు ఆకాశ ఎయిర్ తెలిపింది. ఏడాది కాలంలోనే 0 శాతం నుంచి 4.9 శాతానికి మార్కెట్ వాటాను పెంచుకున్నట్లు తెలిపింది. కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుండి 84 శాతం కంటే ఎక్కువ ప్రయాణీకుల లోడ్ ఫ్యాక్టర్‌ను నమోదు చేసినట్లు వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు అక్యూపెన్సీ 90 శాతానికి చేరినట్టు పేర్కొంది. భారత్‌లో ఈ సంస్థ 2022 ఆగస్టులో తొలిసారి విమాన కార్యకలాపాలను ప్రారంభించింది.

ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ 'ఎకో ఫ్రెండ్లీ' డెబిట్ కార్డ్



న్యూఢిల్లీ : ఫిన్‌టెక్ సంస్థ ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ కొత్తగా ఎకో ఫ్రెండ్లీ డెబిట్ కార్డ్‌ను ఆవిష్కరించి నట్లు ప్రకటించింది. దేశంలోనే తొలిసారి పర్యావరణ అనుకూల పదార్థం ఆర్ పీవీసీ మెటీరియల్‌తో తయారు చేసినట్టు పేర్కొంది. తమ సంస్థలో సేవింగ్స్ బ్యాంక్ ఖాతాతో కొత్త, ఇప్పటికే ఖాతాదారులుగా ఉన్న వారు దీన్ని పొందవచ్చని వెల్లడించింది. ఆర్‌పిసి కార్డులతో హైడ్రోకర్బన్ వినియోగంలో 43 శాతం తగ్గించొచ్చని పేర్కొంది. ఈ కార్డ్ ద్వారా రూ.10,000 వరకు ఈ-కామర్స్ ప్రయోజనాలు పొందవచ్చని ఆ సంస్థ సీఈఓ గణేష్ అనంతనారాయణన్ పేర్కొన్నారు.

సామ్‌సంగ్ నుంచి కొత్త ఉత్పత్తులు

గురుగావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ భారత మార్కెట్లోకి పలు నూతన ఉత్పత్తులను విడుదల చేసింది. ఇందులో గెలాక్సీ ఫోల్డబుల్స్ ఐదవతరం, వాచ్ 6సిరీస్, టాబ్ ఎస్9 సిరీస్‌లు ఉన్నాయని ఆ సంస్థ తెలిపింది. గెలాక్సీ వాచ్6, క్లాసిక్‌లను ఆవిష్కరించింది. ఈ రెండింటి ధరలను వరుసగా రూ.29,999గా, రూ.36,999గా నిర్ణయించింది. ట్యాబ్ ఎస్ సీరిస్‌లో అల్ట్రా, ఎస్9 ప్లస్, ఎస్9 వేరియంట్లను విడుదల చేయగా.. వీటి ధరలను రూ.1,19,999గా, రూ.90,999గా, రూ.96,999గా ప్రకటించింది. ఆయా ఉత్పత్తులపై పలు రాయితీలను అందిస్తున్నట్టు తెలిపింది.

సూక్ష్మ రుణాల కోసం 200 సెంటర్లు

తెరిచిన యూనియన్ బ్యాంక్

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సులభంగా సూక్ష్మ రుణాలను జారీ చేయడానికి వీలుగా దేశ వ్యాప్తంగా 200 మైక్రో ప్రాసెసింగ్ సెంటర్లు (ఎంపీసీఎస్) తెరిచింది. మంగళవారం వీటిని ఆ బ్యాంక్ ఎండీ, సీఈఓ మనిమెఖలయి వర్చ్యువల్‌గా ప్రారంభించారు. పీఎం స్వనిధీ, పిఎంఎస్‌బివై, పిఎంజెజెబివై, ఎపివై, ఎన్‌యుఎల్‌ఎం తదితర ప్రభుత్వ పథకాల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆ బ్యాంక్ తెలిపింది.

తెలంగాణ మార్కెట్లోకి ఎలక్ట్రానికా ఫైనాన్స్

50 శాఖల ఏర్పాటు లక్ష్యం : సీఈఓ వెల్లడి



హైదరాబాద్ : పూణెకు చెందిన బ్యాంకింగేతర విత్త సంస్థ ఎలక్ట్రానికా ఫైనాన్స్ లిమిటెడ్ (ఇఎఫ్ఎల్) తెలంగాణ మార్కెట్లోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంస్థ ఎండీ, సీఈఓ శిల్పా పోపాలే మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల వరంగల్, సూర్యాపేటలో ఏడు శాఖలను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో 50 శాఖలను తెరువాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం రూ.10కోట్ల మేర పెట్టుబడులు అవసరం అవుతాయన్నారు. ప్రత్యక్షంగా 250 పైగా ఉద్యోగాలను కల్పించనున్నామన్నారు. దేశ వ్యాప్తంగా 13 రాష్ట్రాల్లో 180పైగా శాఖలు ఉన్నాయన్నారు. వచ్చే ఐదేండ్లలో దేశ వ్యాప్తంగా 500 శాఖలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2023 జూన్ ముగింపు నాటికి రూ.3,000 కోట్ల రుణ పుస్తకాన్ని సాధించామన్నారు. తాము ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని వారితో పాటు ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలకు సులభంగా రుణాలు అందిస్తామన్నారు. కనీస వడ్డీ రేటు 12 శాతం నుంచి ప్రారంభమవుతుందన్నారు.

ఈసెట్ మొదటి విడతలో 9,606 మందికి సీట్ల కేటాయింపు

సివిల్, మెకానికల్ కోర్సుల్లో 96.60 శాతం ప్రవేశాలు

- సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 12

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, బీ ఫార్మసీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ద్వితీయ సంవత్సరంలో (లాటరల్ ఎంట్రీ) ప్రవేశాలకు నిర్వహించిన ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఈసెట్) మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో మంగళవారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఈసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసెట్ కౌన్సెలింగ్‌లో 12,953 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారనీ, వారిలో 12,880 మంది వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని తెలిపారు. 171 ఇంజినీరింగ్ కాలేజీల్లో 11,698 సీట్లుంటే, 9.606 (82.11 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. 2,092 (17.89 శాతం) సీట్లు మిగిలిపోయాయని తెలిపారు. 117 ఫార్మసీ కాలేజీల్లో 1,213 సీట్లుంటే, 74 (6.10 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామనీ, 1,139 (93.9 శాతం) సీట్లు మిగిలిపోయాయని వివరించారు. సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లను నమోదు చేయకపోవడం వల్ల 3,200 మంది అభ్యర్థులు సీట్లు పొందలేకపోయారని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 574 మంది సీట్లు పొందారని పేర్కొన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా ట్యూషన్‌ఫీజును చెల్లించాలని కోరారు. సీట్లు కేటాయించిన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసే గడువు ఈనెల 12 వరకు ఉందని వివరించారు. అయితే కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) అనుబంధ కోర్సుల్లో 6,900 సీట్లుంటే, 5,118 (74.17 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని తెలిపారు. 1,782 (25.83 శాతం) సీట్లు మిగిలాయని వివరించారు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో 2,892 సీట్లకుగాను 2,736 (94.61 శాతం) మంది అభ్యర్థులు సీట్లు పొందారని పేర్కొన్నారు. ఇందులో 156 (5.39 శాతం) సీట్లు మిగిలిపోయాయని తెలిపారు. సివిల్, మెకానికల్ అనుబంధ కోర్సుల్లో 1,617 సీట్లుంటే, 1,562 (96.60 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని వివరించారు. ఇందులో కేవలం 55 (3.4 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. ఇతర ఇంజినీరింగ్ కోర్సుల్లో 289 సీట్లకుగాను 190 (65.74 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. ఇందులో 99 (34.26 శాతం) సీట్లు మిగిలాయని వివరించారు. సీట్ల కేటాయింపు, ఇతర వివరాలకు హ్ట్ట్ప్స్://ఎచెట్.ట్ష్చ్హె.అచ్.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వరదలకు 49 మంది మృతి

హైకోర్టుకు ప్రభుత్వం నివేదిక

- ఆ కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం

నవతెలంగాణ - హైదరాబాద్

రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరదల్లో 49 మంది మరణించారంటూ హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదికను సమర్పించింది. వారి కుటుంబాలకు రూ.నాలుగు లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని తెలిపింది. వరద సాయం అందించాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని పేర్కొంది. ఇప్పటికే సీఎం కేసీఆర్ వరద సాయం రూ.500 కోట్లను ప్రకటించారని గుర్తు చేసింది. 49 మంది మృతుల్లో జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలో నలుగురున్నారని వివరించింది. వరదలపై చెరుకు సుధాకర్ వేసిన పిల్‌లో ప్రభుత్వం తరఫున విపత్తుల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా పై వివరాలతో కౌంటర్ దాఖలు చేశారు. రెండు హెలికాప్టర్లు, 27 పడవలను అందుబాటులో ఉంచామని తెలిపారు. 655 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని పేర్కొన్నారు. 177 షెల్టర్లను ఏర్పాటు చేసి సుమారు 11,700 పైచిలుకు ప్రజలకు శిబిరాలను ఏర్పాటు చేశామని వివరించారు. రోడ్లు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఈ పిల్‌ను ప్రధాన న్యాయమూర్తి (సీజే) బెంచ్ మంగళవారం విచారణ చేసింది.



హైదరాబాద్‌లో గుంతల నివారణకు చర్యలేంటీ?

హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో భారీ వర్షాల కారణంగా రోడ్లపై ఏర్పడిన గుంతల నివారణకు తీసుకున్న చర్యలు చెప్పాలంటూ అధికారులను హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి, పురపాలక శాఖ, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శితోపాటు నిజాంపేట్ మున్సిపాలిటీలకు నోటీసులు జారీ చేసింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలోని బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లో కిశోర్ అనే వ్యక్తి రెండో తరగతి చదువుతున్న తన కుమార్తె దీక్షితను బైక్‌పై తీసుకువెళ్తూ గుంతలో పడ్డారు. బాచుపల్లి పరిధిలో రెడ్డీస్ ల్యాబ్స్ కంపెనీ వద్ద రోడ్లు గుంతలుగా మారడంతో బైక్ జారి అదుపుతప్పి తండ్రి, కుమార్తె ఇద్దరూ కింద పడిపోయిన వెంటనే అటుగా వస్తున్న బస్సు చిన్నారి దీక్షితపై నుంచి వెళ్లిపోయింది. ఆమె అక్కడికక్కడే మరణించింది, ఈ మేరకు పత్రికల్లో వచ్చిన వార్తను ఆధారంగా చేసుకుని అందిన లేఖను పిల్‌గా పరిగణించి హైకోర్టు విచారించింది.

బుద్వేల్ భూమి వేలం ఆపండి

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో హైకోర్టు నిమిత్తం ఇవ్వాలని కోరుతున్న వంద ఎకరాలను వేలం వేయకుండా ఆపేందుకు ఉత్తర్వులివ్వాలని కోరుతూ హైకోర్టులో పిల్ దాఖలైంది. బుద్వేల్‌లోని సర్వే నెంబర్ 282, 299లోని వంద ఎకరాలను వేలం వేయకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ హైకోర్టు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కట్టా ప్రదీప్‌రెడ్డి పిల్ వేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు హెచ్‌ఎండీఏ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాజేంద్రనగర్ ఆర్డీవో, తహశీల్దార్ తదితరులను ప్రతివాదులుగా చేర్చారు. ఆ భూమి హైకోర్టు నిమిత్తం ఇవ్వాలన్న వినతిపై పదేండ్ల క్రితమే ప్రభుత్వం స్పందించిందనీ, హైకోర్టు కూడా ఆ భూమి కోసం ప్రయత్నాలు చేసిందనీ, ఇప్పుడు దాన్ని వేలం వేయకుండా ఆపాలని కోరారు. ఈ పిల్‌ను చీఫ్ జస్టిస్ విచారణ చేయనున్నారు.

జెడ్పీ చైర్మెన్‌పై అసమ్మతి గళం

- సమావేశానికి హాజరుకాకుండా ఓ హోటల్‌లో జడ్పీటీసీల మీటింగ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా జడ్పీ చైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావుపై జడ్పీటీసీలు అసమ్మతి గళం వినిపించారు. మంగళవారం నిర్వహించిన జడ్పీ సమావేశానికి హాజరుకాకుండా.. నగరంలోని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. నిధులు విడుదల, కేటాయింపులో జడ్పీటీసీలను పట్టించుకోవడం లేదని ఆరోపణలు చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన 24 మంది జడ్పీటీసీలు సమావేశానికి రాలేదు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నుంచి ఒక్కొక్క జడ్పీటీసీ మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. దాంతో కోరం లేక సమావేశం వాయిదా వేస్తున్నట్టు చైర్మెన్ ప్రకటించారు. ఈ సందర్భంగా అధికార పార్టీకి చెందిన జడ్పీటీసీలు మాట్లాడుతూ.. చైర్మెన్ తమను పట్టించుకోవడం లేదని, అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదని ఆరోపించారు. కనీసం మంత్రులను కలవడానికి కూడా తీసుకెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొందరు జెడ్పీటీసీలు, ఎంపీపీలు తమకున్న పరిచయంతో కనీసం తమ మండలంలో ఎటువంటి అభివృద్ధి లేదని తమను ప్రజలు ప్రశ్నిస్తున్నారని ఎమ్మెల్సీ కవితను కలవడంతో 14 మంది సభ్యులకు రూ.10 లక్షల చొప్పున నిధులను సీడీసీ నుంచి మంజూరు చేయించారని తెలిపారు. జడ్పీ చైర్మెన్ హోదా పైనే విసుగుచెందామని, ఎన్ని సార్లు చెప్పినా మండలంలో జరిగే సమస్యలను, అధికారులతో పర్యవేక్షణ చేసిన దాఖలాలు లేవన్నారు. గత సమావేశంలో లేవనెత్తిన సమస్యలను వచ్చే మీటింగ్‌లో ఆ పనులు ఎంతవరకు పూర్తి చేశారు, ఎంత వరకు వచ్చింది అనే అంశాలను ఏ ఒక్క సమావేశంలోనూ జెడ్పీ చైర్మెన్ అధికారులను అడిగిన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. తాము అభివృద్ధి పనులు చేపట్టకుంటే గ్రామాల్లో ఎలా తిరగాలని ప్రశ్నిస్తున్నారు. కనీసం జడ్పీ చైర్మెన్ ఫండ్ నుంచైనా నిధులు మంజూరు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కాగా, నేడు నగరంలో మంత్రి కేటీఆర్ పర్యటన ఉండగా.. దానికి కొన్ని గంటల ముందే ఇలాంటి పరిణామం చేసుకోవడం గమనార్హం.

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

- తెలంగాణ యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్

15వ తేదీ నుంచి నిరవధిక సమ్మె

నవతెలంగాణ-ముషీరాబాద్



కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో హైదరాబాద్ గోల్కొండ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు అందరినీ వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. ఇప్పటికే యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చామని, 15వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు తెలిపారు. ఏఎన్‌ఎంలందరినీ ప్రభుత్వం పిలిచి వారితో చర్చించి వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. సమస్యలను పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలని కోరారు. లేనిపక్షంలో ఈనెల 15వ తేదీ నుంచి కాంట్రాక్టు ఏఎన్‌ఎంలందరూ సమ్మెలోకి వెళ్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకురాలు ఏ.కవిత, నగర అధ్యక్షులు జె. కుమారస్వామి, నగర ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, నగర నాయకులు సంతోషి, బాలమని, అమ్మాజీ దైవమని పాల్గొన్నారు.

అసెంబ్లీలో కేసీఆర్ అసత్య ప్రచారం

- టీడీపీ ప్రధానకార్యదర్శి ఐలయ్యయాదవ్

నవతెలంగాణ-హైదరాబాద్

టీడీపీ ప్రభుత్వంలో తెలంగాణ పరిస్థితులు దిగజారి పోయాయని అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్ అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉండడంతో పాటు ప్రస్తుతం బీఆర్‌ఎస్ క్యాబినెట్లో ఉన్న సగం మంది మంత్రులు అప్పుడు టీడీపీ ప్రభుత్వంలో భాగస్వాము లేనని గుర్తు చేశారు. 2009 సంవత్సరంలో టీడీపీతో పొత్తు పెట్టుకొని కేటీఆర్ ఎమ్మెల్యేగా, కేసీఆర్ ఎంపిగా గెలవలేదా? అప్పుడు గుర్తుకు రాలేదా విద్యుత్ సమస్యలు అని ప్రశ్నించారు. రాష్ట్రంలో చంద్రబాబు చేసిన సంస్కరణలు, పరిపాలనా దక్షతతోనే రాష్ట్రంలో సంపద పెరిగిందన్నారు. గొర్రె తోక బెత్తడు అన్నట్టుగా ఉన్న రాష్ట్ర బడ్జెట్ రూ.50 వేల కోట్లకు పెంచిందన్నారు. సంపద ఎట్లా సృష్టించాలో, రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలో చంద్రబాబు నాయుడుకే తెలుసంటూ కేసీఆర్ చెప్పింది వాస్తవం కాదా అని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో అనేక సాగు నీటి ప్రాజెక్టులు టీడీపీ హయాంలోనే ప్రారంభించారని గుర్తు చేశారు. జూరాల, ఏఎంఆర్ ప్రాజెక్టు తో పాటు అనేక ప్రాజెక్టులు పూర్తి చేయడంతో పాటు దేవాదుల, నెట్టెంపాడు, బీమా, కల్వకుర్తి తదితర ప్రాజెక్టులు టీడీపీ హయంలో నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని అన్నారు.

సంచార నీటినాణ్యత ప్రయోగశాల ప్రారంభం

నవతెలంగాణ-హైదరాబాద్



సంచార నీటి నాణ్యత ప్రయోగశాలకు రాష్ట్ర సాగునీట పారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్‌కుమార్ ప్రారంభించారు. ఈ కేంద్రం ప్రతియేటా 1600 శాంపిళ్ల సేకరించనుం దన్నారు. జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టులో భాగంగా సంచార నీటి నాణ్యత ప్రయోగశాల వాహనాన్ని రాష్ట్రవ్యాప్తంగా తిప్పనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటి వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వి. ప్రకాష్ డైరెక్టర్ శంకర్, ఇంజినీర్ ఇన్ చీఫ్ సి. మురళీధర్, సీఎం ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీని కామెడీ సినిమాగా మార్చిన బీఆర్‌ఎస్

- టీపీసీసీ అధికార ప్రతినిధి బోరెడ్డి అయోధ్యరెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీని బీఆర్‌ఎస్ కామెడీ సినిమాగా మార్చిందని టీపీసీసీ అధికార ప్రతినిధి బోరెడ్డి అయోధ్యరెడ్డి ఎద్దేవా చేశారు. మొత్తంగా శాసనసభ గులాబీ పార్టీ సమావేశాలను తలపించాయని విమర్శించారు. ఎన్నికల హామీలు ఎంతవరకు అమలు అయ్యాయో చర్చ జరుగుతుందని ఆశించిన ప్రజలకు నిరాశేమిగిల్చిందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధులు బొజ్జ సంధ్యారెడ్డి, లింగం యాదవ్, వచన్ కుమార్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం వేదిక కావాల్సిన సభ...రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేసేందుకు పరిమితమైందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు విషయంలో రేవంత్ లేవనెత్తిన అంశాలకు ఎందుకు సమాధానం చెప్పలేదని ప్రశ్నించారు. రెండు సార్లు అధికారంలో ఉండి ఏం చేశారో ఎందుకు చెప్పలేదన్నారు. కొత్త సచివాలయంలో వర్షపు నీళ్లు ఎందుకు నిలిచాయో చెప్పాలన్నారు. కాంగ్రెస్ హయాంలో అభివద్ధిలో ఉంటే, కేసీఆర్ పాలనలో అగాధంలో ఉందని ఎద్దేవ చేశారు.కేసీఆర్ అసమర్థ పాలన నుంచి ప్రజలకు విముక్తి కావాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమైన పదవుల్లో ఉన్నదంతా టీడీపీ నాయకులేనని గుర్తు చేశారు. తెలంగాణ ద్రోహులను పక్కన కూర్చోబెట్టుకొని ఇంకా తెలంగాణ సెంటిమెంట్‌తో లబ్ధి పొందాలని చూస్తే ప్రజలు ఊరుకోబోరని హెచ్చరించారు.

నేడు ఆదివాసీ తండాల్లో కాంగ్రెస్ నేతల బస

- బెల్లయ్య నాయక్ పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివాసీ తాండాల్లో కాంగ్రెస్ నేతలు బస చేసి, అక్కడే నిద్రించాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ నేత బెల్లయ్య నాయక్ పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం మండలానికి రెండు తండాలను ఎంపిక చేసుకుని 'గిరిజన ఆదివాసీ సంరక్షణ హస్తం' పేరుతో కార్యక్రమం చేపట్టాలని కోరారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కొమురం భీమ్, సేవాలాల్ మహారాజ్, ఇందిరాగాంధీ వంటి మహనీయుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని విజ్ఞప్తి చేశారు.

29, 30 తేదీల్లో గ్రూప్-2 రాతపరీక్షలు

- ఆ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్ -2 రాతపరీక్షలను ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఏర్పాట్లుచేస్తున్నది. ఈ క్రమంలో గ్రూప్-2 పరీక్షా కేంద్రాలకు కేటాయించిన ప్రభుత్వ ప్రయివేటు విద్యాసంస్థలకు ఆయా తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఇందుకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేనను ఆదేశించింది. దీంతో పరీక్షా కేంద్రాలున్న విద్యా సంస్థలకు సెలవులిచ్చేలా జిల్లా విద్యాశాఖాధికారుల (డీఈవో)కు ఆమె మంగళ వారం ఆదేశాలను జారీ చేశారు. పరీక్షా కేంద్రాల్లేని మిగతా ప్రభుత్వ ప్రయి వేటు విద్యాసంస్థలు యథావిధిగా నడుస్తాయని స్పష్టం చేశారు. ఈనెల 29, 30 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం సమయంలో రోజు రెండు పేపర్ల చొప్పున గ్రూప్-2 పరీక్షలు జరుగుతాయి. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీ ఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. పరీక్ష నిర్వహణ తేదీకి వారం రోజుల ముందు నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసేందుకు టీఎస్‌పీఎస్సీ చర్యలు తీసుకుంటున్నది.

మణిపూర్‌పై విచారణకు ప్యానెల్

న్యూఢిల్లీ : మణిపూర్‌పై సర్వోన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. మణిపూర్‌లో జరిగిన లైంగిక హింస కేసులపై సీబీఐ విచారణకు ముంబయి మాజీ పోలీసు కమిషనర్ దత్తాత్రే పద్సాల్గికర్ "మొత్తం మానిటర్"గా వ్యవహరిస్తారని వెల్లడించింది. అలాగే, మానవతా అంశాలను పరిశీలించడానికి రిటైర్డ్ జమ్మూకాశ్మీర్ హైకోర్టు చీఫ్ జస్టిస్ గీతా మిట్టల్ నేతృత్వంలోని మాజీ హైకోర్టు న్యాయమూర్తులతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీని కూడా సుప్రీంకోర్టు నియమించింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డి.వై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం.. దీనికి సంబంధించి వివరణాత్మక ఉత్తర్వు జారీ చేయబడుతుందని వివరించింది.

169 డీటీలకు తహశీల్దార్లుగా పదోన్నతి

- నవీన్ మిట్టల్ అధ్యక్షతన డీసీసీ ఆమోదం
- సీసీఎల్‌ఏకు ట్రెసా కృతజ్ఞతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 169 మంది డిప్యూటీ తహశీల్దార్ల (డీటీ)కు తహశీల్దార్లుగా పదోన్నతి లభించింది. మంగళవారం రెవెన్యూ శాఖ కార్యాలయంలో సీసీఎల్‌ఏ నవీన్ మిట్టల్ అధ్యక్షతన శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) సమావేశాన్ని నిర్వహించారు. 2016-17 ప్యానల్ ఇయర్‌కు సంబందించిన డిప్యూటీ తహశీల్దార్లకు తహశీల్దార్లుగా పదోన్నతులు రావడం పట్ల రెవెన్యూ వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. సీసీఎల్‌ఏ, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్‌ను ట్రెసా రాష్ట్ర అధ్యక్షులు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె గౌతమ్ కుమార్ నేతృత్వంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గత నెలలో 100 మంది మంది డిప్యూటీ కలెక్టర్ల పదోన్నతులతో రెవెన్యూ శాఖలో కింది నుంచి పైస్థాయి వరకు అన్ని స్థాయిల్లో పదోన్నతుల ప్రక్రియ కొనసాగిందని పేర్కొన్నారు. తాజాగా 169 మంది డిప్యూటీ తహశీల్దార్లకు తహశీల్దార్లుగా పదోన్నతులు కల్పించారని పేర్కొన్నారు. తర్వాత 200 మందికిపైగా సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ తహసీల్దార్లుగా అదే స్థాయిలో, జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లకు పదోన్నతులు కల్పించబడతాయని వివరించారు. రెవెన్యూ శాఖలో పదోన్నతులను కల్పించాలంటూ ఆదేశించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెసా అసోసియేట్ అధ్యక్షులు మన్నె ప్రభాకర్, ఉపాధ్యక్షులు కె నిరంజన్, రమేష్ పాక, కార్యదర్శి చిల్లా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులు నజీమ్ ఖాన్, శ్రావణ్ కుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కె రామకృష్ణ, నిజామాబాద్ అధ్యక్షులు రమన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల మహాధర్నాకు ఏఐవైఎఫ్ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధ, గురువారాల్లో చేపట్టనున్న మహాధర్నాలకు ఏఐవైఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లాఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె ధర్మేంద్ర మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోడీ ప్రభుత్వం మందబలంతో బరితెగించి ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని విమర్శించారు. సహజ వనరులను, ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు అమ్మేస్తున్నారని తెలిపారు. డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్, ఇతర నిత్యావసర వస్తువుల ధరలను పెంచి ప్రజల నడ్డివిరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

దశలవారీగా డివిజన్‌ను అభివృద్ధి చేస్తా



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌ను దశల వారీగా అభివృద్ధి చేస్తానని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీ శ్రీనివాస కాలనీ, వీరాంజనేయ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్లను మంగళవారం కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. డివిజన్‌లోని కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాల రూపకల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస కాలనీ అధ్యక్షులు చిత్రాంజన్, వీరాంజనేయ కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ, బృందావన్ మెడోస్ కాలనీ అధ్యక్షులు శివశంకర్, ఉపాధ్యక్షులు అమ్జాద్, జీవి సత్యనారాయణ, సుధాకర్, బుల్లయ్య, శశికాంత్, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'గద్దర్ మృతి తీరని లోటు'



నవతెలంగాణ- బడంగ్ పేట్

ప్రజా గాయకులు కామ్రేడ్ గద్దర్ మృతి తీరని లోటు అని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సి పల్ కార్పొరేషన్ కేంద్రంలోని పాత గ్రామ పంచాయతీ చౌరస్తాలో మంగళవారం మేయర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నేనావత్ బాలు నాయక్, ఎర్ర జైహింద్, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ- బడంగ్ పేట్

నేటి సమాజంలో మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం భారత్ ఆత్మ నిర్భర్ పథకం ద్వారా వీధి విక్రయదారులకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శంకర్ సింగ్, డిప్యూటీ మేయర్ ఇబ్రమ్ శేఖర్, కమిషనర్ సుమన్ రావు, శ్రీనిధి ఆర్‌ఎం ఉదయ, బ్యాంక్ మేనేజర్లు, ఆర్పీలు, స్ట్రీట్ వెండర్లు తదితరులు పాల్గొన్నారు.

కీర్తన అనాథాశ్రమానికి నాగార్జున విద్యార్థుల విరాళం



నవతెలంగాణ-హస్తినాపురం

హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని సాగర్ రోడ్డులో ఉన్న నాగార్జున మాంటిస్సోరి అండ్ మోడల్ స్కూల్ విద్యార్థులు మంగళవారం కీర్తన అనాథ శరణాలయానికి ఐదు క్వింటాళ్ల బియ్యం, 50 కిలోల పప్పులు అందజేశారు. తర్వాత నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్ రెడ్డి జన్మదినం సందర్భంగా పాఠశాలలో అన్నదానం చేశారు. విద్యార్థుల నుంచి సేకరించిన వస్తువులతో పాటు యాజమాన్యం కొంత డబ్బును ఆశ్రమానికి అందజేసింది. ఈ సందర్భంగా చైర్మన్ గుమ్మకొండ విఠల్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని అభాగ్యుల పట్ల ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలన్నారు. తమ విద్యా సంస్థలో పిల్లల వ్యక్తిత్వ వికాసానికి అధిక ప్రాధాన్యం ఇస్తు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె. విజయ్ కుమార్ రావు, ఇంచార్జి పుష్పలత, అరుణ, దివ్య, ప్రియాంక, ఉషశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలి

- రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



నవతెలంగాణ - మీర్ పేట్

పెంచిన ఇంటి పన్నులు, నల్ల బిల్లులను వెంటనే తగ్గించాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటి పన్నులు 200 శాతం, నల్లా బిల్లులు పెంచారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మీర్ పేట్‌లో ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పక్కనున్న జీహెచ్‌ఎంసీలో సైతం ఇంతగా ఇంటి, వ్యాపార పన్నులు, నల్ల బిల్లులు లేవన్నారు. ఇంటి పన్నులు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన మంత్రి..ఇప్పుడు ఆ విషయాన్ని ఎలా మరిచిపోయారని ప్రశ్నించారు. అధికారులు మాత్రం మూడు నెలల ఇంటి పన్నులను వెంటనే చెల్లించాలని ప్రజలకు నోటీసులు ఇస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా మంత్రి సబితా ఇంద్రారెడ్డి చొరవ తీసుకుని పన్నులు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట ఈ నెల 11,12వ తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, నాయకులు చల్లా బాల్ రెడ్డి, సిద్దాల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

'ఒక్క అంగుళం కూడా వదలం'



నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న దావుత్ ఖాన్ గూడలోని సర్వే నంబర్ 2లో ఉన్న భూమిని ఒక్క అంగుళం కూడా వదలమని.. మొత్తం సాగురైతులదేనని నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. బడంగ్ పేట కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వంటా వార్పు చేస్తున్న దళిత మహిళలను, రైతులను మంగళవారం పరామర్శించి మాట్లాడారు. దళిత, బహుజన భూముల్లో పెద్దపెద్ద కట్టడాలు కట్టి వారినే గెంటేస్తారా అని ప్రశ్నించారు. దళితుల భూముల సమస్యపై అసెంబ్లీలో ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడినా ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. ధరణి పోర్టల్‌తో ఎక్కడెక్కడ ప్రభుత్వ, దళిత భూములు ఉన్నాయో అక్కడ బీఆర్‌ఎస్ నేతలు వాలిపోతున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు దళిత నేతలే..దళితులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, రమాదేవి శ్రీనివాస్, నిమ్మల సునీతా శ్రీకాంత్ గౌడ్, రామిడి మాధురివీరకర్ణారెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, దడిగె శంకర్, శూరకర్ణారెడ్డి, మద్ది రాజశేఖర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి సహా గుడ్ల శ్రీనివాస్, రాములు, కర్రె ముత్తయ్య, కర్రె ముత్యాలు, లక్ష్మమ్మ, రాజు, ధన్ రాజ్, జ్ఞానేశ్వర్, ఉమాకాంత్, సురేశ్, రాజ్ కుమార్, పుట్టగళ్ల చింటూ, అండాలు, విజయ, విజయలక్ష్మీ, శ్రీలక్ష్మీశ్రీనివాస్, రాధమ్మ, సత్తయ్య, యాదయ్య దళిత సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

'అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తాం'



నవతెలంగాణ- చైతన్యపురి

వచ్చే ఎన్నికల్లో హైదరాబాద్ జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో పోటీ చేస్తామని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. కొత్తపేటలోని బాబు జగ్జీవన్ భవన్ లో మంగళవారం నిర్వహించిన హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భావ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజక వర్గానికి ధర్మ సమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అబ్దుల్ రెహమాన్, రాజేంద్రనగర్ అసెంబ్లీకి పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాఘవేంద్ర ముదిరాజ్, మేడ్చల్ అభ్యర్థిగా రాజ్ కమల్ ను బరిలో ఉంటారని తెలిపారు. ఈ ముగ్గురు వేల కోట్ల ధనం ఉన్న అగ్ర కుల అభ్యర్థులతో ఢీకొని గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ మహానగరంలో ఉన్న కోటి మంది ప్రజల్లో 93శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలు పేదరికంలో ఉన్నారన్నారు. హైదరాబాద్ నగరాన్ని 10శాతం లేని అగ్ర కులాల వారు ఏలుతున్నారని మండిపడ్డారు. హైదరబాద్ కు కొన్నేండ్ల నుండి రాష్ట్ర నలుమూలు, దేశవ్యాప్తంగా ఉన్న కటిక పేదలు పొట్టకూటి కోసం శరణార్థులుగా వచ్చి సంపద సృష్టించారని అన్నారు. కానీ వారికి మాత్రం కనీసం కూడు, గూడు లేక బతుకుతున్నారని, వీళ్ళని ఓటు బానిసలుగా వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ పాత నగరంలో జరిగిన మత ఘర్షణల్లో ముస్లిం, హిందూ కటిక పేదలైన దళితులే మృత్యు ఘర్షణలో మరణించారని అన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గ ప్రసాద్ మహారాజ్, నర్రి స్వామి కురుమ, తెలంగాణ సామాజిక రాష్ట్ర వ్యవస్థాపకులు తిరుపతయ్య వంశ రాజ్, రిటైర్డ్ డీఎస్ పీ విజయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు రెహమాన్, రాఘవేంద్ర, హైదరాబాద్ జిల్లా ప్రచార కమిటీ బాధ్యులు కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యార్థులకు వైద్య పరీక్ష శిబిరం



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కాలడేరాలో మంగళవారం వైద్య శిబిరం కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. వైరల్ జ్వరాలు, కండ్ల కళతలు దృష్టిలో పెట్టుకుని ఆర్‌బీఎస్‌కే తరఫున డాక్టర్ హబీబా బేగం, డాక్టర్ రాహుల్, స్వరూప(ఏఎన్‌ఎం), భాగ్యలక్ష్మి పాఠశాలకు విచ్చేసి ప్రతి విద్యార్థిని పరిశీలించారు. అవసరమైన పిల్లలకు పిల్లలకు మందులు ఇచ్చారు.

ఎవరూ నోరెత్తని విధంగా అభివృద్ధి చేశాం

- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-హయత్ నగర్

ప్రతి పక్షాలు నోరు ఎత్తలేని విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి చూపించామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హయత్ నగర్‌లో మంగళవారం ఎక్సైజ్ నూతన భవనానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో సీఎం కేసీఆర్ కుల వృత్తులను గౌరవిస్తూ.. ఆత్మగౌరవ భవనాలను ఏర్పాటు చేస్తున్నారని కొనియాడారు. ఆనాటి ప్రభుత్వాలు ఆదాయం వచ్చే శాఖలను అభివృద్ధి చేసే ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. అప్పటి ప్రభుత్వాలు ఎక్సైజ్ శాఖను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఒరిస్సా నుండి తెలంగాణకు సరఫరా చేసే నకిలీ అక్రమ మద్యం ముఠాను పట్టుకొని పీడీ యాక్ట్ పెట్టామని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో ఎకరాకు రూ.100 కోట్లకు దాటిపోవడం వెనుక రాష్ట్ర అభివృద్ధి కనపడుతుందని హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ 1 ఎకరం అమ్మితే..ఆంధ్రాలో 100 ఎకరాలు వస్తామన్నారు. ప్రపంచంలో తెలంగాణకు ప్రత్యేక స్థానాన్ని కల్పించడం కోసం సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. అక్రమంగా మందు అమ్మే వారిపై..అక్రమ రవాణా మందుపై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. అందుకే మరో సారి కూడా బీఆర్‌ఎస్ పార్టీ గెలిచి..హ్యాట్రిక్ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కమిషనర్ ముషారఫ్ అలీ ఫరుకీ, రంగారెడ్డి జిల్లా చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి, హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య, డిప్యూటీ ఎక్సైజ్ ఆఫీసర్ రవీందర్ రావు, అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి హనుమంతరావు, హయత్ నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్, సత్యనారాయణ, ఎస్ఐలు హనుమంతు, సరళ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణ పాటించాలి'



నవతెలంగాణ- వనస్థలిపురం

ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ పాటించాలని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి అన్నారు. డివిజన్ లోని భూలక్ష్మి నగర్ కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారంలో స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి..వాటిని సంరక్షించాలని కోరారు. అనంతరం కాలనీ వాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. వాటిని దశల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్ రెడ్డి, వెంకట రెడ్డి, మాధవ రెడ్డి కాలానివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీని సందర్శించిన కార్పొరేటర్



నవతెలంగాణ - వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో ఉన్న ప్రభుత్వ చైతన్య జూనియర్ కళాశాలను మంగళవారం కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కాలేజీ నిర్వాహకులు..కాలేజీ ఆవరణలో ఇబ్బందికరంగా పెరిగిన మొక్కలు, చెట్లు..ఆటస్థలం బాగు చేయాలని కార్పొరేటర్‌ను కోరారు. స్పందించిన కార్పొరేటర్ వెంటనే సంబంధిత సిబ్బందితో..చెట్ల కొమ్మలను తొలగించి, ఆటస్థలాన్ని బాగు చేయాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రధానోపాధ్యాయురాలు అశోక కుమారి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, రఘువీర్, సూర్యనారాయణ మూర్తి, సుబ్బారెడ్డి, సురేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

దళిత రైతులకు ఎమ్మార్పీఎస్ మద్దతు



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 2లో దళిత రైతులు చేపట్టిన దీక్షకు ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి బొర్ర రవి మాదిగ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా ప్రభుత్వ భూమిని నమ్ముకొని ఉన్న మాదిగలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు పుట్టగల రాము, చింతల చిన్న వంక ఉపేందర్, బడంగ్‌పేట అంబేద్కర్ విగ్రహం వ్యవస్థాపక అధ్యక్షులు గట్టు శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

'క్రీడలతోనే మానసిక ఉల్లాసం'



నవతెలంగాణ - బడంగ్‌పేట్

క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని టీపీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజక వర్గం సుల్తాన్ పూర్ ఎయిర్పోర్ట్ రోడ్డు ఏబీఆర్ఆర్ క్రికెట్ మైదానంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి టీ 10 క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం అమరేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో యువతీయువకులకు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు కె.ఎం.అశ్ఫాక్ ఖాన్, టీపీసీసీ మైనార్టీ వైస్ చైర్మన్, మహమ్మద్, కాంగ్రెస్ నాయకులు షైక్ హామీద్, ఇంచార్జి మహమ్మద్ రియాజ్, జల్ పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హమద్ బామ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ డివిజన్‌లో మరో ఫ్లైఓవర్ నిర్మాణం

- ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ - నాగోల్

పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని..నాగోల్ డివిజన్‌లోని రేడియల్ రోడ్డును తాత్కాలిక విస్తరణతో పాటు ఆనంద్ నగర్ చౌరస్తాలో ఫ్లైఓవర్ నిర్మాణాన్ని చేపట్టినట్లు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. రూ.7కోట్ల వ్యయంతో డివిజన్‌లోని పలు కాలనీలలో సీసీ రోడ్లు, యూజీడీ, కమ్యూనిటీ భవన నిర్మాణాలకు మంగళవారం కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.25.50లక్షలతో నాగోల్ గ్రామంలోని హరిజన బస్తీ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణం, రూ.38.70 లక్షలతో శ్రీనివాస ఎన్క్లేవ్ లో సీసీ రోడ్డు, రూ.11 లక్షలతో అరుణోదయ కాలనీ రోడ్డు వెడల్పు, రూ.12.50 లక్షలతో గ్రీన్ ఫీల్డ్ కాలనీలో సీసీ రోడ్డు, రూ.64 లక్షలతో అనంతల జంగారెడ్డి కాలనీలో సీసీ రోడ్డు, రూ.65 లక్షలతో లక్ష్మీనరసింహస్వామి కాలనీ ఫేజ్ ఒకటిలో సీసీ రోడ్డు, ఫేజ్ టూ లో రూ.80 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాలతో పాటు పలు కాలనీల్లో సీసీ రోడ్లు, ఆర్‌సీసీ బాక్స్ డ్రయిన్స్, గ్రేవీయార్డ్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసినట్లు వివరించారు. నాగోల్ చౌరస్తా నుండి మహంకాళి దేవాలయం ముందు గుండా రేడియల్ రోడ్డుకు వెళ్లేందుకు వన్ వే సౌకర్యాన్ని కొన్ని రోజులపాటు కల్పిస్తున్నట్లు చెప్పారు. మంచి ఫలితం వస్తే దాన్ని శాశ్వతంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు. నాగోల్ నుండి ఓఆర్ఆర్ వైపు, మన్సురాబాద్ కు వెళ్లాలంటే ఆనంద్ నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని.. దీనిని అధిగమించడానికి అక్కడ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం సంక్షేమ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీవాసులు..ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లను సన్మానించి, జ్ఞాపికగా నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, ప్రమీల, రమేష్, జగదీష్ యాదవ్, తూర్పాటి కృష్ణ, పాల్వాయి సంజీవరెడ్డి, దప్పు రాజు ,మైనం రాజేశ్వర్, వినోద్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లెలగూడలో ఓపెన్ టెన్త్ క్లాసులు ప్రారంభం



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెలగూడ 43వ డివిజన్ పరిధిలో ఓపెన్ టెన్త్ క్లాసులను మంగళవారం కార్పొరేటర్ గజ్జల రాంచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ్ సెకండ్చాన్స్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లెలగూడ 43వ డివిజన్ పరిధిలోని కమ్యూనిటీ హాల్లో క్లాసులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు గంగమ్మ, శోభ, లావణ్య, ప్రథమ్ సంస్థ సభ్యులు పరిమళ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సమస్యలపై

మంత్రులను కలిసిన టీఎన్జీవో నేతలు





నతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం అధ్యక్షుడు ఎం.రాజేందర్, ప్రధాన కార్యదర్శి ఎం.జగదీష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్) మంగళవారం రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్‌ని కలిసి తెలంగాణ వక్ఫ్‌బోర్డులో నెలకొన్న ఉద్యోగుల సమస్యలు, పరిస్థితుల గురించి వివరించారు. వక్ఫ్ బోర్డులో ఉద్యోగ విరమణ వయసు 61 ఏండ్ల నుంచి 60కి తగ్గించారని, ప్రభుత్వ ఉత్తర్వు లను బోర్డు ఉల్లంఘిం చిందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అందుకు ప్రతిస్పందిస్తూ మహ మూద్ అలీ, కొప్పుల ఈశ్వర్ తెలంగాణ ప్రభుత్వంలో ఏ ఉద్యోగికీ అన్యాయం జరగదని, వక్ఫ్‌బోర్డు ఉద్యోగుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని చెప్పారని వారుత తెలిపారు. రాజేందర్, ముజీబ్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు ఉద్యోగులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన పని లేదని, వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగదని హామీచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం సహాధ్యక్షుడు సత్య నారాయణ గౌడ్, హన్మ కొండ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, భూపాలపల్లి జిల్లా అధ్య క్షుడు బూరుగు రవి, జిల్లా సభ్యుడు శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల వేడుకలు



వనస్థలిపురం - నాగోలు

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధి కొత్తపేటలో శివ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అధిక శ్రావణ మాస బోనాల సందర్భంగా అమ్మవారి తొట్టెల ఊరేగింపును నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస గుప్త హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్, బీ.ఆర్.ఎస్.వి సీనియర్ నాయకుడు రాహుల్ గౌడ్, బాబు ,సుధీర్, సత్యనారాయణ, కన్నా గౌడ్, ఐవీఎఫ్ యూత్ ఉపాధ్యక్షులు నరేష్ గుప్త, యూత్ సెక్రటరీ మార్త వీరేందర్, రంగారెడ్డి జిల్లా ఐవీఎఫ్ నాయకులు లోకేష్ గుప్త, మేడ్చల్ జిల్లా ఐవీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పూజలు చేసిన కార్పొరేటర్



బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సామనగర్‌లో నాయి బ్రాహ్మణ సంఘం మంగళవారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలలో నవజీవన్ రెడ్డి..



సామ నగర్‌లో నాయిబ్రాహ్మణల రేణుక ఎల్లమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలకు మంగళవారం హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎర్రవెలి సత్యనారాయణ , లక్ష్మణ్, కాలానీవాసులు పాల్గొన్నారు.

శ్రీనివాస హై స్కూల్‌లో ఆధార్ కేంద్రం



నవతెలంగాణ - ధూల్ పేట్

జియాగూడ పాఠశాల సమీపంలోని శ్రీనివాస హై స్కూల్ లో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు సెంటర్ ఇంచార్జి సునీల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ జియాగూడలో విద్యార్థులు, చిన్న పిల్లల ఆధార్, అప్డేట్‌ల కోసం కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్కూల్ విద్యార్థులకు స్కూల్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి నేతృత్వంలో ప్రిన్సిపల్ కావ్య ఆధార్ ఫారంలు అందజేసినట్లు తెలిపారు. వికలాంగులకు ఉచితంగా ఆధార్, అప్డేట్‌ను చేస్తున్నామని తెలిపారు. న్యూ ఎన్రోల్మెంట్, బాయోమెట్రిక్ అప్డేట్, డెమో వెరిఫాయింగ్, ఫోన్ అప్డేట్, ఇంటి పేరు, తండ్రి పేరు, పేరు వంటి వివిధ కరెక్షన్‌లు, అడ్రెస్స్ ఛైంజింగ్, ఫింగర్ ప్రింట్, ఫోటో ఛైంజ్ వంటి లోపాలను సరి చేస్తామన్నారు. ఈ కేంద్రం నెలరోజుల పాటు కొనసాగుతుందని..ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ కో ఆర్డినేటర్ రాజు యాదవ్, స్కూల్ టీచర్ లావణ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వాణి రెడ్డి సేవలు అభినందనీయం : మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపల్ అభివృద్ధిలో ఇటీవల బదిలీపై వెళ్లిన మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి సేవలు అభినంద నియామని మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. బదిలీపై వెళ్లిన వాణిరెడ్డికి వీడ్కోలు సమావేశం లో మాట్లాడారు. నాగారం మున్సిపాల్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ప్రతి ఉద్యోగికి బదిలీలు సాధారణం అన్నారు. అనంతరం పూలదండతో సన్మానించి, మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్ర కుమార్, వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సొంత నిధులతో అభివృద్ధి చేస్తా : మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-కీసర

సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపడుతానని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళ వారం కీసర మండలంలోని కీసర, అంకిరెడ్డిపల్లి, కీసర దయారా, వన్నిగూడ, భోగారం గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకు న్నారు. గ్రామలలో అసంపూర్తిగా ఉన్న ఆలయాలు, సీసీ రోడ్లు నిర్మాణం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ముస్లిం మస్జీద్, శ్మశానవాటిక, ఫ్లోరింగ్, ప్రహరీ గోడలను సొంత నిధులతో కట్టిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట భద్రారెడ్డి, జడ్పీ వైస్ చైర్మెన్ వెంకటేష్, ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్లు, ఉపసర్పంచ్‌లు, వార్డ్ మెంబర్స్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



నవతెలంగాణ-ఘట్కేసర్

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి వస్తుందని ఘట్కేసర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కేశపావుల వినోద్ కుమార్ అన్నారు. రాష్ట్ర నాయకులు శివసేనరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ప్రతాప్ సింగారం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు భాను ప్రకాష్ ఆధ్వర్యంలో డోర్ టూ డోర్ క్యాంపెయినింగ్ నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి రుక్కువర్ధన్‌రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి కార్యదర్శి బండ్లగూడ క్రాంతిగౌడ్, మేడ్చల్ అసెంబ్లీ అధ్యక్షుడు కొత్త శశాంత్‌గౌడ్‌తో కలిసి ప్రజల సమస్యలను తెలుసుకున్నా రు.అనంతరం వినోద్‌కుమా ర్ మాట్లాడుతూ..వృద్ధులకు రూ.4వేలు పెన్షన్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, నిరుద్యో గుల కోసం 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. అమరవీరుల కుటుంబాలకు రూ.25వేలు, కౌలు రైతులకు ఏడాదికి రూ.15వేల అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా వినోద్ పలువురికి రూ.2 లక్షల ప్రమాద బీమా కార్డును అందజేశారు. కార్యక్రమంలో ఘట్కేసర్ మండల యువజన కాంగ్రెస్ సెక్రెటరీ రాజీవ్, మల్లేష్ తదితరులు, పాల్గొన్నారు.

భవిష్యత్ ఆవిష్కర్తలను ప్రోత్సహించేందుకు సైన్స్ ఫెయిర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

భవిష్యత్ ఆవిష్కర్తలను ప్రోత్సహించేందుకు ప్రేమియా అకాడమీ సిద్ధమైంది. అందులో భాగంగా సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించింది. విద్యార్థులను సైన్స్ ప్రపంచంవైపు ప్రేరేపించడం, ప్రోత్సహించడం ఈ కార్యక్రమం లక్ష్యం. వైజ్ఞానిక అన్వేషణపై లోతైన అవగాహనను పెంపొందించుకుంటూ వారి వినూత్న ప్రాజెక్టులు, పరిశోధనలను ప్రదర్శించేందుకు సైన్స్ ఫెయిర్ వేదికను అందించింది ప్రేమియా అకాడమీ. ఈ సైన్స్ ఫెయిర్‌లో గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 12 వరకు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సజనాత్మకత, అభిరుచిని ప్రతిబింబించే విభిన్న ప్రాజెక్టలను ప్రదర్శించారు. అంకితమైన అధ్యాపకులు, మార్గదర్శకుల మార్గదర్శకత్వంలో, వారు వివిధ శాస్త్రీయ భావనలను అన్వేషించారు. శాస్త్రీయ ప్రయోగాలు నిర్వహించారు. విద్యార్థులు వారి అన్వేషణలను వివరించడానికి ఆకర్షణీయమైన నమూనాలను రూపొందించారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో వివిధ రకాలైన వైజ్ఞానిక రంగాలకు చెందిన ప్రాజెక్టలను ప్రదర్శించారు. విద్యార్థులు సుస్థిర వ్యవసాయం కోసం నీటిపారుదల పద్ధతులను చాకచక్యంగా ప్రదర్శించారు. సీస్మోగ్రాఫిక్ పద్ధతులను ఉపయోగించి భూకంప హెచ్చరిక వ్యవస్థలను రూపొందించారు. గుండె ద్వారా రక్త ప్రసరణ, న్యూరాన్ ప్రసారం వంటి జీవ ప్రక్రియలను పరిశోధించారు. న్యాయమూర్తుల ప్యానెల్ శాస్త్రీయ పద్ధతి, ఆవిష్కరణ ,ప్రదర్శన ఆధారంగా ప్రాజెక్టలను అంచనా వేసింది. ప్రేమి యా అకాడమీ విద్యార్థుల విశిష్ట సేవల ను గుర్తించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి న క్రీడాకారులకు ప్రశంసలు, బహు మతులు అందించింది. ఈ సందర్భంగా ప్రేమియా అకాడమీ వ్యవస్థాపకురాలు, మేనేజింగ్ డైరెక్టర్ సింధూరిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల గాఢమైన ఆసక్తిని పెంపొందించడంతోపాటు నేర్చుకోవాలనే అభిరుచిని పెంచడమే ప్రేమియా అకాడమీ లక్ష్యం అన్నారు. "మా విద్యార్థుల సజనాత్మకత, మేధో ఉత్సుకత, సైన్స్ అద్భుతాలను అన్వేషించడంలో వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో దాని అనువర్తనాన్ని అన్వేషించడంలో వారి ఉత్సాహాన్ని చూడటం సంతోషాన్ని ఇచ్చింది' అని ఆమె తెలిపారు. ప్రిన్సిపాల్ తప్పిరావు మాట్లాడుతూ ' సైన్స్ ఫెయిర్ మా విద్యార్థులు అవసరమైన పరిశోధన, ప్రదర్శన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి అనుమతించింది. అకాడమిక్ ఎక్సలెన్స్‌కు మించి, శాస్త్రీయ ఆవిష్కరణల ద్వారా సమాజానికి సానుకూలంగా దోహదపడాలనే ఆతతను విద్యార్థులు ప్రదర్శించారు" అని పేర్కొన్నారు.

నాగారం మున్సిపాల్టీ అభివృద్ధికి కృషి



- చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాల్టీ అభివృద్ధికి పాలకవర్గం కృషిచేస్తుందని చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాల్టీ సాధారణ సమావే శం చంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమా వేశంలో 20 వార్డులలో వివిధ అభివృద్ధి పనులు అండర్ గ్రౌండ్ డ్రయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.2కోట్ల 95 లక్షలతో చేపట్టే పనులకు తీర్మానం చేశారు. పారిశు ధ్య సిబ్బందికి దుస్తులు, సబ్బులు, నూనెలు, చెప్పులు కొనుగోలుకు రూ.23లక్షలు తీర్మానించారు. ఈ సంద ర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. నాగారం మున్సిపాల్టీ అభివృద్ధికి రాజకీయ పార్టీలకతీతంగా అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయించామని తెలిపారు. ఎక్కడ కూడా రాజకీయ స్వార్థం లేకుండా అన్ని విధాలుగా విడ తల వారీగా వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయింపునకు కౌన్సిలర్స్ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ రాజేందర్ కుమార్, వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, కార్యాలయం మేనేజర్ చంద్రశేఖర్, డీఈ రఘు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జవహర్ నగర్ ఘటనపై..సీతక్క మండిపాటు



నిందితుడిని కఠినంగా శిక్షించాలి
టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జోత్స్న

నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్‌నగర్ బాలాజీ నగర్‌లో యువతి బట్టలు చింపి దాడి చేసిన ఘటనపై ఎమ్మెల్యే సీతక్క మండి పడ్డారు. జవహర్ నగర్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్‌తో కలిసి బాధితురాలును మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. మంత్రి మల్లారెడ్డి ప్రాతిని ధ్యం వహించే మేడ్చల్ నియోజకవర్గంలో ఓ ఆడ బిడ్డను నడి రోడ్డుపై ఇంత దారుణం జరిగినా ప్రభుత్వం స్పందించలేదన్నా రు. ప్రభుత్వం స్పందించక పోతే మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. మహిళలను గౌరవించాల్సిన ఈ దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జోత్స్న శివారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో రోడ్డుపై వెళ్తున్న మహిళను వివస్త్రను చేయడం సిగ్గుచేటన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ లో సీఐతో మాట్లాడుతూ.. ఈ దుర్మార్గానికి పాల్పడిన వ్యక్తితో పాటు అతడికి సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుచేసి శిక్ష పడేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గోగుల సరిత, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, నాయకులు అనంతలక్ష్మి, బిల్లా సుగుణ, గండి సునీత, చింత విజయ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్ల వినయ్ కుమార్, తదితరులున్నారు.

ఎన్‌క్యూఏఎస్ అసెస్‌మెంట్ టీం ముగింపు కార్యక్రమం



నవతెలంగాణ-సిటీబ్యూరో

కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేంద్ర ఎన్‌క్యూఏఎస్ అసెస్‌మెంట్ టీం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్, అసెస్మెంట్ కోసం విచ్చేసిన అధికారులు డాక్టర్ విజయరామన్, డాక్టర్ భరణి కుమార్, అంబలాగన్, బహుగుణలను సాధరంగా శాలువా పుష్ప గుచ్చాలతో సన్మానించారు. అసెస్మెంట్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య ప్రోగ్రామ్స్ సంబంధించి ఓపీ, ఐపీ, స్టాక్, జెఎస్వై, జెఎస్ఎస్కె, ఎఎన్సి, ఇమ్యునైజేషన్ రిజిస్టర్‌లను, ఫార్మసీ స్టోర్ రూమ్, ల్యాబ్‌ను పీహెచ్‌సీ పారిశుధ్యాన్ని కూడా తనిఖీ చేస్తారు. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ విస్తతంగా సర్వీస్ ప్రొవిజన్, పేషెంట్ రైట్స్, ఇన్‌పుట్‌లు, సపోర్ట్ సర్వీసెస్, క్లినికల్ కేర్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్, క్వాలిటీ మేనేజ్‌మెంట్, అవుట్‌కమ్‌ల కింద ఏర్పాటు చేశారు. ఈ ప్రమాణాలు ఐఎస్‌క్యూ యూఏ (ది ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ క్వాలిటీ ఇన్ హెల్త్ కేర్) గుర్తింపు పొందాయి. సమగ్రత, నిష్పాక్షికత, సాక్ష్యం, అభివృద్ధి ప్రపంచ ప్రమాణాలు ఉంటాయి.

సోనియాగాంధీ నగర్‌లో దొంగల హల్‌చల్

- పట్టించుకోని పోలీసులు
- ఆందోళనలో ప్రజలు
- ఆకతాయిలు, గంజాయికి కేంద్రంగా కాలనీలు

నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోనియా గాంధీ నగర్ కాలనీలో సీసీ కెమెరాలు పర్యవేక్షణ లేకపో వడంతో తరచుగా దొంగతనాలు జరుగుతున్న ఘటనలు ఆలస్యంగా వెలుగు చూస్తున్నాయి. దొంగలు ముసుకు వేసుకుని ఇండ్లలోని డబ్బు, బంగారం, నగలు, ఎలక్ట్రా నిక్ వస్తువులు దొంగలిస్తున్నారు. దొంగతనాలపై గతం లో కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదై నప్పటికీ దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమైయ్యారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, చిన్నారులు ఇంటి నుంచి బయటికి వెళ్లాలన్నా.. కిరాణా షాప్‌కు వెళ్లాలన్నా ప్రాణా లను అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నారు. ఆకతా యిలు కిరాణా షాపుకు వెళ్లే మహిళలు, చిన్నారులతో మాటలు కలిపి వారి ఫోన్ నెంబర్లు తీసుకుంటున్నారు. ఆ తర్వాత వాళ్లపై వేధింపులకు పాల్పడుతున్నారు. ఈ ఇలాంటి ఘటనపై కూడా స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు నిమ్మకునీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దొంగలు అర్ధరాత్రి ఇంటి ప్రహరీ గోడను దూకి దొంగతనాలకు పాల్పడుతున్నారు. సోనియా గాంధీ నగర్, గణేష్ నగర్, ఈస్ట్ గాంధీనగర్, శుభోదయం కాలనీలో దొంగలు వెళ్లే విజువల్స్ సీసీ కెమెరాలల్లో రికార్డు అయ్యాయి. కుషాయిగూడ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించకపో వడంతోనే తరచూ దొంగతనాలు, ఆకతాయిల వేధింపు లు ఎక్కువగా అవుతున్నాయని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు. గంజాయి మత్తులో ఒకరిపై ఒకరు కత్తులతో దాడి చేసుకున్న ఘటనలు కాలనీలో చోటు చేసుకున్నాయి. ఈ విషయం కుషాయిగూడ పోలీసు స్టేషన్‌లో చేరింది. పోలీసులు వారిపై కేసులు నమోదు చేయకుండా మధ్యలో ఎవరో ఒకరు జోక్యం చేసుకుని రాజీ కుదురుస్తున్నారు. ఇలాంటి ఘటనలతో కాలనీలోకి కొత్త వ్యక్తులు వస్తే మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పని లేని ఆకతాయిలు తమ నివాసాల ఎదురుగా ఉండే మహిళ లను విచిత్రంగా చూస్తూ వేధింపులకు పాల్పడు తున్నా రని మహిళలు, యువతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కుషాయిగూడ పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా, ఆగతాయిల వేధింపుల నుంచి రక్షించాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే క్రైమ్ ఎస్ఐ మదన్ లాల్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

దివ్యాంగులకు ఆర్థిక చేయూత



నవతెలంగాణ-జవహర్‌నగర్

దివ్యాంగులకు ఆర్థిక చేయూత ఇవ్వడం అభినందనీయ మని 28వ డివిజన్ కార్పొరేటర్ నిహారిక అన్నారు. మంగళవా రం జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వికలాంగు ల కాలనీలో నివసించే నాగరాజు అనే దివ్యాంగుడి కుటుంబానికి ఉపాధి కోసం కిరాణం కొట్టు, పాన్‌షాపును శ్రీ హర్షిని, ఎన్జీవో భవాని ప్రసాద్, తీరునంగిరిలు తెలంగాణ వికలాంగుల రాష్ట్ర సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మేరుగు శివకృష్ణ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ నిహారిక హాజరై మాట్లాడుతూ..మిత్రులు కలిసి ఒక దివ్యాంగుల కుటుంబానికి ఉపాధి కల్పించడం మంచి పరిణా మంఅన్నారు. ఎన్జీవోలు ప్రతి నెలా 25మంది దివ్యాంగులకు నిత్యావసర సరు కులు అందిస్తున్నందుకు మేరుగు శివకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమానికి తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు గుత్తికొండ కిరణ్ కుమార్, మేడ్చల్ జిల్లా గౌరవ అధ్యక్షులు గోదా సంపత్ కుమార్, లెజెండ్ శ్రీనివాస్, సాంబయ్య, అప్పారావు. సుగుణ, బబ్లూ, దివ్యాంగులు కాలనీవాసులు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలకు నిరసనగా 9,10న ధర్నాలు



నవతెలంగాణ-కాప్రా

కేంద్ర ప్రభుత్వ అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 9,10 తేదీలలో అఖిల భారత కార్మిక సంఘాల పిలుపులో భాగంగా క్విట్ ఇండియా డే సందర్భంగా మహా ధర్నాలు నిర్వహించాలని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటీయూసీ) జాతీయ నాయకులు వి.ఎస్.బోస్ పిలుపునిచ్చారు. ధర్నాకు సంబంధించిన గోడపత్రికను ఈసీఐఎల్ చౌరస్తాలో విడుదల చేశారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ..బీజేపీ ప్రభుత్వం మందబలంతో ప్రజా, కార్మిక వ్యతిరేక పరిపాలన సాగిస్తున్నదన్నారు. జాతీయ సహజ వనరులు, ప్రభుత్వరంగ సంస్థలను స్వదేశీ, విదేశీ కార్పోరేట్లకు అమ్మేస్తున్నదని ఆరోపించారు. డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజల నడ్డివిరుస్తున్నారని మండిపడ్డారు. రైతులకు 2015లో నరేంద్ర మోడీ పార్లమెంట్లో ఇచ్చిన కనీస మద్దతు ధర హామీని నేటికీ అమలు చేయలేదన్నారు. 2023-24 కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి, ఆహార ఉత్పత్తులకు సబ్సిడీలకు భారీగా కోతలు విధించిందన్నారు. జీడీపీలో విద్యా రంగానికి 6 శాతం, వైద్య రంగానికి 2 శాతం కేటాయించకుండా, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలపై ఉక్కుపా దం మోపిందన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కడం, జైల్లో పెట్టడం, పౌరుల ప్రాథమిక హక్కులను పాతరేస్తున్నదని చెప్పారు.మహాధర్నాను విజవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు, నేతలు ఎం. నర్సింహా, లక్ష్మీ నారాయణ, మిరియాల సాయిలు,నర్సింగ్ రావు,భిక్షపతి, ధర్మేంద్ర, సత్య ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల విముక్తే గద్దర్ ఆశయం : కార్పొరేటర్ వెంకటేష్



నవతెలంగాణ-బోడుప్పల్

పీడిత ప్రజల విముక్తే గద్దర్ ఆశయం అనీ, తన గళం, కలంతో ఎంతో మంది పీడిత ప్రజలను చైతన్యం చేసిన మహనీయుడు అని బోడుప్పల్ కార్పొరేటర్ రాసా ల వెంకటేష్ యాదవ్ అన్నారు. మంగళవారం బోడుప్ప ల్ నగర పరిధిలోని 15 వ డివిజన్ బాల చిత్తారి నగర్‌లో బీఆర్ఎస్ నాయకులు పడతం లోకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గద్దర్ సంతాప సభలో ఆయన మాట్లా డారు. అసమానతలకు కారణమైన పెట్టుబడి దారి వ్యవస్థకు స్వస్తి పలకాలని తుదిశ్వాస వరకు పోరాడిన ప్రజా నాయకుడని కొనియాడారు. తన పాటను తన పేరుగా మార్చుకోని అణగారిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషిచేసిన యోధుడని పేర్కొన్నారు. తెలంగా ణకు జరుగుతున్న అన్యాయాలపై 1969 ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. మలిదశ ఉద్యమంలో పొడుస్తు న్న పొద్దు మీద నడుస్తున్న కాలమా అంటూ జనాన్ని చైతన్యం చేసిన ఘనత గద్దర్‌కు దక్కుతుందన్నారు. గద్దర్ విగ్రహాన్ని బోడుప్పల్‌లో ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావిస్తాన ని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వల్లపు ఐలేష్ యాదవ్, కె. రామచందర్, రచ్చ శ్రీనివాస్, కె. వెంకట్రావు, రూపాని శంకరయ్య, దేవేందర్,గిరి,ఆర్ వెంకటేష్, దామోదర్, చిన్నయ్య, రామ్ శెట్టి విజయకుమార్, ఎన్.మల్లేష్ ,జోసెఫ్, కృష్ణారెడ్డి, మహేష్, పి మల్లేష్, శేఖర్, ,పరమేష్, బాలకృష్ణారెడ్డి, రవీందర్ రెడ్డి, వినోద్ తదితరులున్నారు.


సన్ సీడ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉయ్యాల పథకం



నవతెలంగాణ-కాప్రా

ప్రభుత్వం అందించే కేసీఆర్ కిట్టు మాదిరిగా సన్‌సీడ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కాన్పు అయినా మాతాశిశువులకు ఉయ్యాల పథకం పేరుతో రూ.6వేల విలువగల కిట్టు (ఉయ్యాల కిట్టు మదర్ న్యూట్రిషన్ కిట్టు, బేబీ న్యూట్రిషన్ కిట్టు) వివిధ రకాల వస్తువులను హాస్పిటల్ చైర్మెన్ డాక్టర్ అన్వేష్ కల్యారి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తేజస్విని చేతుల మీదుగా మంగళవారం కాన్పు అయినా ముగ్గురికి కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ అన్వేష్ మాట్లాడుతూ.. మా హాస్పిటల్‌లో ఎన్ఏబిహెచ్ స్టాండర్డ్ ప్రకారం వైద్య సేవలు ఇస్తున్నామని తెలిపారు. రకాల వైద్య సేవలకు సంబంధించిన వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉంటారని చెప్పారు. గర్భిణీల కోసం గర్భం దాల్చిన మొదటి నెల నుంచి డెలివరీ అయ్యే వరకూ ప్రతీ నెల ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తల్లి, పిల్లలకు ఇబ్బందులు లేకుండా సునాయాసంగా ప్రసూతి కావడానికి కావాల్సిన అన్ని రకాల వైద్య పద్ధతులను పాటిస్తూ చికిత్స చేస్తున్నామని వివరించారు. ఆస్పత్రిలో ప్రత్యేకంగా 30% డిస్కౌంట్ ఇస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తేజస్విని, హాస్పిటల్స్ సూపరిండెంట్ డాక్టర్ భాను ప్రకాష్, ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ లావణ్య, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వైష్ణవి, సీఈవో కలుకూరి రాములు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకులకు ప్రజా సమస్యలపై పట్టింపు లేదా?



నవతెలంగాణ-ఉప్పల్

ప్రజా సమస్యలపై పాలకులకు పట్టింపు లేదా అని సీపీఐ (ఎం) నాయకులు ఎర్రం శ్రీనివాస్ ప్రశ్నించారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతపూర్‌లో అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వానం గా ఉండడంతో స్థానికులతో కలిసి మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామం తపూర్ డివిజన్‌లోని ప్రజా సమస్యలపై పాలకులకు పట్టించుకో వడం లేదన్నారు. అంతర్గత రోడ్ల సమస్యతో రెండు నెలలుగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అధికారు లు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో, ప్రజలు ఎన్నాళ్లు అవస్థలు పడాలని మండిపడ్డారు. వెంటనే అంతర్గత రోడ్లకు మరమ్మత్తులు చేపట్టకుంటే జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

అక్రమంగా రోడ్డు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వేల్లి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ చెరువు శిఖం భూమిలో నుంచి కొంతమంది ప్రయివేట్ వ్యక్తులు అక్రమంగా రోడ్డు వేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు రఫీ, ప్రేమ్ దాస్, ఈశ్వర్ కుర్మ తెలిపారు. ఆలయ భూమిలో వేస్తున్న రోడ్డును మంగళవారం గ్రామస్తులు పరిశీలించి మీడియాతో మాట్లాడు తూ.. ఓ ప్రయివేట్ వెంచర్ కు దారి కోసం రోడ్డు వేస్తున్నారని తెలిపారు. వేంకటేశ్వర స్వామి ఆలయ పూజారి సుదర్శన్ వెంచర్ నిర్వాహకులకు సహకరి స్తున్నారని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లో ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా కాపాడుకుంటామని ఈ విషయమై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్టుగా వెల్లడించారు. సర్వే నంబర్లు 466,436లో గల స్థలం బఫర్ జోన్‌లో ఉందని గ్రామస్తులు రఫీ,ప్రేమ దాస్ ఆరోపించారు. చెరువు శిఖం ఉన్న భూమిలో వెంచర్ లేఅవుట్ ఏర్పాటు చేసి ఏవిధంగా ప్లాట్లు అమ్ముతారని ప్రశ్నించారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.లేని పక్షంలో జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఎం.సీపీఐ(యూ) ఆధ్వర్యంలో వినతిపత్రం



నవతెలంగాణ-బోడుప్పల్

ప్రజలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చ డంలో విఫలమైందని ఎం.సీపీఐ (యూ) మేడిపల్లి మండల కార్యదర్శి మూడి మార్టిన్ అన్నారు.ఎం సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మేడిపల్లి తహశీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మార్టిన్ మాట్లాడుతూ..నాడు ఉద్యమ ఆకాంక్షల ద్వారా అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఆ దిశగా కృషి చేయడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనికోరారు. ఈ కార్యక్రమంలో ఎం.సీపీఐ (యూ) నేతలు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఆగస్టు 13న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ 373 వ జయంతికి ఉత్సవాలకు హాజరుకావాలని జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షులు డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు శేష గాని నరేష్ గౌడ్ ఆదేశాల పిలుపుమేరకు మంగళవారం ఎమ్మెల్యే కె.పి వివేకానంద్‌ను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి బీసు వెంకటేశం గౌడ్, సంఘ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం స్థానిక గౌడ సంఘ సభ్యులు మునుకుంట్ల శ్రీనివాస్ గౌడ్, బొమ్మగాని శంకర్ గౌడ్, బాసుపల్లి వ్యాస్ గౌడ్ ,బట్టల పాపన్న గౌడ్, నల్లగోపుల బాబుగౌడ్, శంకర్ గౌడ్, శేఖర్ గౌడ్, వెంకటేష్ గౌడ్, అభిరామ్ గౌడ్, నిరంజన్ గౌడ్, వివిధ గౌడ సంఘ కులస్తులకు వేర్వేరుగా కలిసి అందజేశారు.

కౌన్సిలర్‌ను కలిసిన ప్రజలు



నవతెలంగాణ-దుండిగల్

బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణను నియోజకవర్గ పరిధిలోని ప్రజలు మంగళవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అందుకు శంభీపూర్ క్రిష్ణ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారంలో ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

స్థానికుల సమస్యల పరిష్కారానికే పాదయాత్ర

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ - బాలానగర్

బాలానగర్ డివిజన్‌లో గత 60 సంవత్సరాల్లో కానీ అభివృద్ధిని రాష్ట్రం ఏర్పడిన 9 సంవత్సరాలలో చేశామని,స్థానికు సమస్యల పరిష్కారానికే పాదయాత్ర అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కూకట్ పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే ఏడో రోజు పాదయాత్ర చేశారు. గణేష్ నగర్, వినాయక నగర్, జేపీఆర్ నగర్, దిల్ కుష్ నగర్‌లో పాదయాత్ర చేశారు. అడుగడుగునా ప్రజలు నీరాజనం పలుకుతూ మంగళహారలతో శాలువాలతో ఎమ్మెల్యేకు కాలనీవాసులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన అనంతరం బాలానగర్ డివిజన్‌లో డ్రయినేజీల సమస్యలను పరిష్కరించామని, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పలు కాలనీల్లో స్వయంగా పాదయాత్ర చేసి కాలనీలలో సమస్యలను తెలుసుకుని జీహెచ్ఎంసీ అధికారులు, సంబంధిత అధికారులతో కలిసి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. దిల్కుష్ నగర్‌లో ఎన్నో సంవత్సరాలుగా రోడ్లు లేక ప్రజలు ఇబ్బంది పడ్డారని, అలాంటి ప్రాంతం కోసం కేంద్రంతో పోరాడినా ఫలితం లేకపోవడంతో సొంత నిధులతో రోడ్లు వేయించామన్నారు. డివిజన్ అభివద్ధికి మంత్రి కేటీఆర్‌ను కలిసి పెండింగ్‌లో ఉన్న పనులను, సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులు స్థానిక నాయకులు మార్కెట్ చైర్మెన్ మండడి సుధాకర్ రెడ్డి, అంబటి సునీల్ కుమార్, పంజా రామచందర్,దారం సతీష్ గుప్త, అరుణ్ కుమార్, ఉపేందర్ రెడ్డి, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



మాన్యర్ సురేష్

హొటల్లో గ్యాస్ లీక్..

- మంటల్లో చిక్కుకుని యజమాని మృతి

నవతెలంగాణ-బాలానగర్

గ్యాస్ లీక్ కావడంతో వ్యాపించిన మంటల్లో చిక్కుకుని ఓ హెూటల్ యజమాని మృతి చెందిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కె. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డినగర్‌లో మాన్యర్ సురేష్ (42) శ్రీ సాయి హెూటల్ నడుపుతున్నాడు. యథావిధిగా మంగళవారం హెూటల్లో పనులు నిర్వహిస్తున్న సమయంలో సిలిండర్ అయిపోవడంతో మరో సిలిండర్ మార్చాడు. అయితే రెగ్యులేటర్ నుంచి గ్యాస్ లీక్ కావడంతో అకస్మాత్తుగా మంటలు వ్యాపించి ప్రమాదం సంభవించింది. వెంటనే స్థానికులు బాలానగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకున్నారు. అప్పటికే హెూటల్ యజమాని సురేష్ మంటల్లో చిక్కుకుని అక్కడికక్కడే మతి చెందాడు. హెూటళ్ళో ఉన్న కొందరిని పోలీసులు రక్షించారు. మృతుడిని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

సీఐటీయూ జెండా దిమ్మెను కూల్చాలని యత్నిస్తే తీవ్ర పరిణామాలు

- సీఐటీయూ మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు



నవతెలంగాణ-మల్కాజిగిరి

మున్సిపల్ పరిధిలోని ఈస్ట్ ఆనంద్ బాగ్ బీసీడబ్ల్యూ (సీఐటీయూ) జెండా దిమ్మెను కూల్చాలని కొంతమంది దుండ గులు ప్రయత్నిస్తున్నారంటూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు మాట్లాడుతూ మల్కాజిగిరి మండలంలోని ఈస్ట్ ఆనంద్ బాగ్ నందు భవన నిర్మాణ కార్మికులు సీఐటీయూకు అనుబంధంగా యూనియన్ ఏర్పాటు చేసుకొని దినసరి కూలి చేసుకుంటూ ఉపాధి పొందు తున్నారని తెలిపారు. అయితే అడ్డా కార్మికులను అక్కడి నుంచి పంపించే కుట్రలో భాగంగా సీఐటీయూ దిమ్మె రోడ్డుకు అడ్డంగా ఉందంటూ తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలను సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఆదర్శనగర్ కాలనీ అసోసియేషన్ ముసుగులో కొంతమంది దుండగులు ఇలా చేస్తున్నారని తెలిపారు. జెండా దిమ్మె మూలంగా వాహనదారు లకుగాని, బస్తీవాసులకు గాని ఎలాంటి ఇబ్బందులు, అవంతరాలు లేవన్నారు. అయినప్పటికీ అసోసియేషన్ ముసుగులో జెండా దిమ్మెను ఎందుకు కదల్చాలని చూస్తున్నారని ప్రశ్నించారు. జెండా దిమ్మెను కదిలిస్తే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కృష్ణ, నాగప్ప, మాధవ్, రామాంజనేయులు, గోపాల్, గోవిందు, మదిలేటి, నాగేషు, రాములు తదితరులు పాల్గొన్నారు.

సూరారం డివిజన్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రజల సమస్యల తెలుసుకొని వాటి పరిష్కారమే ధ్యేయంగా, అలాగే ప్రస్తుతం జరుగుతున్నా అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రగతియాత్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ 129 సూరారం డివిజన్ పరిధిలోని సంజయ్ గాంధీ నగర్, న్యూ షాపూర్ నగర్‌లో 96వ రోజు పాదయాత్ర చేశారు. పూర్తి చేసిన అభివృద్ధి పనులను పరిశీలించి మిగిలి ఉన్న పనులను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాలు వంటి మంజీరా నీటి సరఫరా,సీసీ రోడ్లు, భూగర్భ డ్రయినేజీ పనులు పూర్తి చేసినందుకు కాలనీల ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ మంగళ హారతులతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం న్యూ షాపూర్ నగర్‌లో రూ. 75 లక్షల వ్యయంతో చేపడుతున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్‌లో దశాబ్దాలుగా నోచుకోని పనులను 9 సంవత్సరాలలో పూర్తి చేశామన్నారు ప్రజా సమస్యలను శాశ్వతంగా అధిగమించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతి కాలనీ, బస్తీ రూపురేఖలు మారుతున్నాయన్నారు. సంక్షేమ సంఘాలు ఇదే ఐక్యతతో ఉంటూ అభివృద్ధికి సహకారం అందించాలని తెలిపారు. కాలనీల అభివృద్ధికి కృషి చేసినందుకు పలువురు కాలనీ వాసులు ఎమ్మెల్యే వెంటే ఉంటామన్నారు. మిగిలి ఉన్న చిన్నపాటి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దష్టికి తీసుకురావడంతో అక్కడే ఉన్న సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చారు. వాటిని త్వరలోనే పూర్తి చేయాలన్నారు. అధికారులు డీఈఈ శిరీష, ఏఈ సంపత్, హెచ్ఎండబ్ల్యూఎస్ డీజీఎం అప్పల నాయుడు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, జనరల్ సెక్రటరీ సిద్ధికి, మధుమోహన్, సీనియర్ నాయకులు మఖ్సూద్ అలీ చౌడ శ్రీనివాస్, నాగిళ్ల శ్రీనివాస్, మన్నే బాలేష్, అమీర్ ఖాన్, మల్లారెడ్డి, ఫిరోజ్, చెక్క సురేష్, ప్రభుదాస్, అన్వార్, అఖిల్, మొయిజ్ తదితరులు పాల్గొన్నారు.



దుండిగల్ : నిజాంపేట్ నగర పాలక సంస్థ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలని పరిష్కరించేందుకు. మంగళవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కొంపల్లి లోని



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ నగర పాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాల్లో స్వీపర్లు, కమటిలు, ఎలక్ట్రీషియన్లు, పంప్ ఆపరేటర్లు, సూపర్ వైజర్లు, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు , అటెండర్లు ఇతర సిబ్బంది మొత్తం 464 సిబ్బంది పనిచేస్తున్నామని తెలిపారు. అందరికీ వేతనాలు పెంచేందుకు రెగ్యులర్ చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత రాష్ట్ర సాధనలో ప్రభుత్వ ఉద్యోగుల కృషిని గుర్తించి రాష్ట్రం ఏర్పడ్డాక అన్ని శాఖల ఉద్యోగుల వేతనాలను పెంచి వారి గౌరవానికి తగిన గుర్తింపుని ఇచ్చారని అన్నారు. కరోనా లాంటి విపత్కరమైన పరిస్థితుల్లో మున్సిపల్ ఉద్యోగుల సేవలు మరువలేనివని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తుచేశారు. , ముఖ్యమంత్రి కి ప్రజల కష్ట సుఖాలు తెలుసని మీ ఈ సమస్యను త్వరలోనే సంబంధిత పురపాలక శాఖ మంత్రివర్యులు కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లి మీ సమస్యను పరిష్కరించేందుకు కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యక్షులు సాయి, సంతోష్, దుర్గేశ్, లక్ష్మన్, విజయ్ ఇతర సిబ్బంది నగర పాలక సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ పై దాడి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి 10 గంటలకు ఫారూఖ్ నగర్ డిపోకు చెందిన సర్వీస్ నంబర్ 9 ఎక్స్/272కి చెందిన బస్సు గండిమైసమ్మ నుంచి చార్మినార్‌కు బయలుదేరింది. సూరారం శివాలయం గుడి దగ్గరకు రాగానే ముగ్గురు వ్యక్తులు బస్సుకు తమ ద్విచక్ర వాహనాన్ని అడ్డం పెట్టి బస్సు లోపలికి ప్రవేశించారు. అనంతరం డ్రైవర్ మలారెడ్డిపై విచక్షణా రహితంగా దాడి చేసి పరారయ్యారు. డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న సూరారం పోలీసులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానికంగా ఉండే ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఈ దాడి గంజాయి బ్యాచ్ పనే అయి ఉండవచ్చని సూరారం సీఐ వెంకటేశ్వర్ రావు తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

ఆలయంలో చోరీ కేసు ఛేదించిన పోలీసులు



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌతమ్ నగర్ రైల్వే ట్రాక్ పక్కనగల శ్రీ దుర్గా భవాని మాత ఆలయంలో శనివారం తెల్లవారుజామున చోరి జరగగా అందుకు సంబంధించిన కేసును పోలీసులు చేధించారు. ఆలయ గుమస్తా ఆలయాన్ని మూసివేసి మరుసటి రోజు ఉదయం ఆలయాన్ని తెరవడానికి వెళ్లగా అప్పటికే గుడి తలుపులు తెరిచి ఉండడం గమనించాడు. వెంటనే విషయాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడికి తెలిపినట్టు చెప్పారు. ఆలయ పూజారి రాము మాట్లాడుతూ ఆలయానికి ఉత్తరం వైపు ఉన్న గోడను తవ్వి దొంగ లోపలికి వచ్చి డోరు తాళాలు గొడ్డలితో పగలకొట్టి ఆలయంలోకి ప్రవేశించి దాదాపు అమ్మవారిపై ఉన్న బంగారం, ఆలయంలో ఉన్న 8 తులాల బంగారం,కిలోన్నర వెండి,7 వేల రూపాయల నగదు, సీసీ కెమెరాలు వీడియో రికార్డర్ బాక్స్ ను దొంగిలించినట్టు తెలిపారు. ఇదే విషయాన్ని మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. దొంగతనం జరిగిన ఆలయాన్ని ,ప్రాంతాన్ని మల్కాజిగిరి డీసీపీ జానకి ధరావత్,అడిషనల్ డీసీపీ లక్ష్మి, ఏసీపీ నరేష్ రెడ్డి మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్, పోలీస్ అధికారులు పరిశీలించారు. మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మూడు టీంలను ఏర్పాటు చేసి కేసును చేధించినట్టు ఏసీపీ నరేషరెడ్డి వివరించారు. ఏపీలోని విజయవాడ కృష్ణ లంకకు చెందిన సంగం జాంపయ్య అలియాస్ జంపన్న ప్రస్తుతం అంబెద్కర్ నగర్‌లో ఉంటూ గ్యాస్ స్టవ్ రిపేర్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. జల్సాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడేవాడు. ఇతనిపై లాలపేట, మారేడ్‌పల్లి, గోపాలపురం పోలీస్ స్టేషన్‌లలో గతంలో కేసులు నమోదయ్యాయి. సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించిన పోలీసులు నిందితుని ఆనవాళ్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తమదైన పద్దతిలో విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి రూ. 4,50,000 విలువ గల సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సమావేశంలో సీఐ రవికుమార్, జగన్నాథ్, ఎస్ఐ శంకరయ్యతో పాటు కానిస్టేబుల్ పాల్గొన్నారు. కేసు ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన కానిస్టేబుల్‌లకు ఏసీపీ నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

బీఆర్ఎస్ శ్రేణుల నూతన వాహనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సుభాష్‌నగర్ డివిజన్, బాచుపల్లి ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణుల నూతన వాహనాలను ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మంగళవారం శంభీపూర్ కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ చిట్ల దివాకర్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మెన్ నాగరాజు యాదవ్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, నాయకులు కొలన్ గోపాల్ రెడ్డి, సోమశేఖర్, రేవంత్, పార్టీ శ్రేణులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి

- కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నందికంటి శ్రీధర్

నవతెలంగాణ-మల్కాజిగిరి

కాంగ్రెస్ పార్టీతోనే ఈ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. మంగళవారం మల్కాజిగిరి నియోజకవర్గంలోని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ 1లో గోపాల్ నగర్ కాలనీ నుంచి 'కాలనీ నేస్తం కాంగ్రెస్ హస్తం పాదయాత్రలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు ఉమేష్ సింగ్, బి కే శ్రీనివాస్, బుచ్చిబాబు, సూర్యప్రకాష్, మజ్జిద్, వేణు, మోఇన్, ఆరిఫ్, గుత్తి రామచందర్, జీవన్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ప్రవీణ్, వంశీ ముదిరాజ్, నరేందర్ గౌడ్, జానయ్య, ఫరీద్, ఉదయ బాబు, వీ సత్యనారాయణ, రోజా రమణి, ఆశ, భాగ్యరాణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రయినేజీ సమస్యను అధిగమించేందుకు చర్యలు



- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బహుముఖ వ్యూహాలను అమలు పరుస్తున్నారని, అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు, డివిజన్‌లో అభివృద్ధి పెంచేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నారని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తెలిపారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలో సత్యసాయి నగర్ లో కొద్ది రోజులుగా భూగర్భ డ్రయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న స్థానికులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ దష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, కార్పొరేటర్ వెంటనే అధికారితో చర్చించి పనుల కోసం రూ.15 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. మంగళవారం జలమండలి అధికారి విలియమ్స్‌తో కలిసి సత్యసాయి నగర్‌లో పర్యటించి నూతన అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పైపులైన్ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అంబటి శ్రీనివాస్, మహేష్, మల్లేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ-దుండిగల్

బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ సర్వే నెంబర్ 103 అలాగే నిజాంపేట్ సర్వే నెంబర్ 344లోనీ ప్రభుత్వ భూమిని కాపాడి అందులో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతూ సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అధ్వర్యంలో మంగళవారం బాచుపల్లి మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ భూమి పక్కన ఉన్న ప్రయివేటు భూమి సర్వే నెంబర్ వేసి తప్పుడు పత్రాలు సష్టించి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలను యేధేచ్చగా కబ్జా చేస్తున్నారని అన్నారు. నిజాంపేట్ సర్వే నెంబర్ 103లోని సాయి బాబా టెంపుల్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. దానిపై అటు మున్సిపల్ అధికారులకు, ఇటు రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు పిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. అలాగే నిజాంపేట్ సర్వే నెంబర్ 344 లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారని తెలిపారు. కనుక ఇట్టి అక్రమ నిర్మాణాలను పరిశీలించి వాటిని తొలగించాలని.. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బాలపీరు, మండల కార్యదర్శి మల్లికార్జున్, నాయకులు ప్రసాద్, మల్లేష్, అశి.యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



సేవా కార్యక్రమాల్లో ముందున్న శ్రీరంగం ఫౌండేషన్

- ఫౌండేషన్ చైర్మెన్ డా. సత్యం శ్రీరంగం

నవతెలంగాణ-బాలానగర్/కేపీహెచ్‌బీ

సేవా కార్యక్రమాల్లో శ్రీరంగం ఫౌండేషన్ ముందుందని ఫౌండేషన్ చైర్మెన్ డా. సత్యం శ్రీరంగం అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని భువన విజయం ప్రాథమిక పాఠశాలలో 159 విద్యార్థులకు కేవలం ముగ్గురు మాత్రమే ప్రభుత్వ ఉపాధ్యాయులు పనిచేస్తుండడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనా రాజ కుమారి అదనంగా విజయ కుమారి, నిర్మల కుమారి అనే ఇద్దరు ఉపాధ్యాయులను, పాఠశాలలోని తరగతి గదులు, టాయిలెట్స్ శుభ్రం చేసే నిమిత్తం పి. నాగయ్య అనే వ్యక్తిని నియమించుకోడానికి 2023 -24 విద్యా సంవత్సరానికి గాను ప్రతీ నెల వారికీ వేతనాన్ని ఇవ్వమని శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా. సత్యం శ్రీరంగంను కోరగా అందుకు ఆయన అంగీకరించి ఫౌండేషన్ తరపున ప్రతీ నెల వారికీ వేతనాన్ని అందిస్తున్నారు. ఈమేరకు జులై నెల వేతనాన్ని సత్యం శ్రీరంగం కార్యాలయంలో పాఠశాల సిబ్బందికి అందజేశారు.

ఎస్‌హెచ్‌టీవో యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.ఏ.షరీఫ్, సుదర్శన్ రావు



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ఆరోగ్య ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్(ఎస్‌హెచ్‌టీవో) యూనిట్ అధ్యక్షుడిగా ఎం.ఏ.షరీఫ్, ఉపాధ్యక్షులుగా బి.యాదయ్య, కార్యదర్శిగా డి.సుదర్శన్ రావును ఎన్నుకున్నారు. టీఎన్జీవో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డా. ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పబ్లిసిటీ సెక్రటరీ వైదిక శాస్త్ర ఎలక్షన్ అధికారిగా, సహాయ ఎలక్షన్ అధికారిగా ఎం.వీ శ్రీధర్ నాయుడు ఎస్‌హెచ్‌టీవో యూనిట్‌కు ఎన్నికలు నిర్వహిం చారు. ఈ ఎన్నికల్లో కోశాధికారిగా బి.లక్ష్మణ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్‌గా మొహమ్మద్ సలీంతోపాటు పీ.నిరూప్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యూనిట్ సభ్యులందరూ కలిసి డాక్టర్ ముజీబ్‌ను, ఎన్నికల అధికా రులను నాంపల్లి గృహకల్ప కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లా డుతూ టీఎన్జీవోస్ ప్రభుత్వం గుర్తింపు పొందిందన్నారు. మనం అందరం బంగారు తెలంగాణ అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు.

కేఎం ప్రతాప్‌ను పరామర్శించిన దళిత సంఘం నాయకులు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

హృదయ శస్త్ర చికిత్స చేయించుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం. ప్రతాప్‌ను భగత్ సింగ్ నగర్ దళిత సంఘం నాయకులు మంగళవారం కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వారందరినీ కె.యం ప్రతాప్ ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా దళిత సంఘం నాయకులు మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడి, వారి సమస్యలను పరిష్కరిస్తూ, నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్న ప్రతాప్ ఆరోగ్యం కుదుటపడాలని భగవంతుని వేడుకున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ నగర్ దళిత సంఘం గౌరవ అధ్యక్షులు కె.భూమయ్య, ప్రధాన కార్యదర్శి బీచుపల్లి రాజు, కార్య నిర్వాహక కార్యదర్శి బాబు, కార్యవర్గ సభ్యులు చిట్యాల యాదగిరి, ఇరుగు జాన్, రమేష్, యాదగిరి,చారి తదితరులు పాల్గొన్నారు.

డీజీపీగా పదోన్నతి లభించిన సీవీ ఆనంద్‌కు శుభాకాంక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు డీజీపీగా పదోన్నతి లభించిన నేపథ్యంలో హైదరాబాద్ సీటీ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు నల్లా శంకర్‌రెడ్డితోపాటు పలువురు సభ్యులు సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం బంజారా హిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో సీపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీపీని కలిసిన వారిలో అధ్యక్షుడితోపాటు కోపరేటివ్ సొసైటీ ట్రెజరర్ విక్టర్, వైస్ ప్రెసిడెంట్ జనార్ధన్, జాయింట్ సెక్రటరీ శాంతితోపాటు మొదలగు వారున్నారు.

విదేశాలకు సైతం విస్తరిస్తున్న తెలంగాణ ఐటీ పరిజ్ఞానం

- ఒమన్ దేశంలో పర్యటిస్తున్న జయేష్ రంజన్, పాటి మీది జగన్ మోహన్ రావు

నవతెలంగాణ - కూకట్‌పల్లి



సాంకేతిక పరిజ్ఞానం, సేవలు పొందేందుకు ఒమన్ వంటి దేశం ఆసక్తి చూపడంతో విదేశాలకు సైతం తెలంగాణ ఐటి పరిజ్ఞానం విస్తరిస్తుంది, ఒమన్ సుల్తాన్ కుటుంబ సభ్యుడు, హైనస్ ఫిరాజ్-బిన్-ఫాతిక్, ఒమన్ వ్యవసాయ శాఖ మంత్రి దలాల్, ఎమిరాటీ ఎంట్రప్రీనియర్ ఎక్సలెన్సీ అబ్దుల్లా, తెలంగాణ ఐటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ జెయేశ్ రంజన్ , తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మెన్ పాటిమీది జగన్మోహన్ రావుతో సింగపూర్‌లో సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా డబ్ల్యూటీఐటీ కాన్ఫరెన్స్‌కు హాజరైన ఇతర ప్రముఖులతో కూడా సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఈనెల 13వ తేదీన హైనేస్ ఫిరాజ్ బిన్ ఫాతిక్ హైదరాబాద్‌లో పర్యటించనున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన ప్రజలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మంగళవారం తన నివాసం వద్ద కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి సమస్యలు ఉఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారంలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు.

'తన గానంతో ప్రజలను మేల్కొల్పిన ఉద్యమ ధృవతార గద్దర్'



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

తెలంగాణ ఉద్యమంలో తన గానంతో తెలుగు ప్రజలను మేల్కొల్పిన ఉద్యమ ధవతార ప్రజాగాయకుడు గద్దర్ అని పరిటాల సునీత, అండెశ్రీ అన్నారు. మంగళ వారం వారు గద్దర్ కుటుంబాన్ని పరామర్శించారు. మొదట గద్దర్ సమాధి వద్ద పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తన పాటలతో తెలుగు ప్రజల్ని చైతన్య పరిచి, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. తెలంగాణ మలి దశ ఉద్యమ కారుడు, ప్రజా గాయకుడు గద్దర్ మతి చెందడం బాధకరమని సంతాపాన్ని తెలిపారు



బీఆర్ఎస్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 11వ ఎస్టీ సెల్ అధ్యక్షులు కూరాకుల రాముకు డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ మంగళవారం కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు.

నవతెలంగాణ-దుండిగల్

వెంటనే బిల్డింగ్ ప్లాన్స్‌ను సమర్పించాలి: కలెక్టర్

నవతెలంగాణ-సిటీబ్యూరో



కామాటిపురం యూపీహెచ్‌పీతోపాటు బార్కాస్ ఆస్పత్రుల విస్తరణకు సంబంధించిన బిల్డింగ్ ప్లాన్‌లు వెంటనే సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. మంగళవారం కామాటిపుర యూపీహెచ్‌సీతోపాటు బార్కాస్‌లోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులను కలెక్టర్ పరిశీలించారు. ఆస్పత్రుల్లో నెలకొన్న పరిస్థితులను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విస్తరణకు గల అవకాశాలను ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. త్వరలోనే విస్తరణకు సంబంధించిన ప్లాన్‌లు పూర్తి వివరాలతో తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. ఆస్పత్రులలోని అన్ని గదులను పరిశీలించిన కలెక్టర్ సిబ్బందికి సూచనలు, సలహాలను అందించారు. రోగులకు మెరుగైన వైద్య సేవ అందించాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి, డీసీహెచ్‌వో సునీత, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులతోపాటు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు అన్నారు. బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ఆంజనేయనగర్ రోడ్ నెంబర్ 6లో నూతనంగా వేస్తున్న డ్రయినేజీ పనులను ఏఈ శ్రీనివాస్ తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పనులను వేగవంతం చేయాలన్నారు. అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రకతి రాము, మన్మథ రావు, సుశీల్ కుమార్, భాస్కర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక ప్రమాదాలపై అవగాహన



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రమాదవశాత్తు అగ్గి ప్రమాదం సంభవించినప్పుడు ప్రతి ఒక్కరూ పలు జాగ్రత్తలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అగ్నిమాపక ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం నిమ్స్‌లో అగ్నిమాపక అధికారులు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పలు సూచనలు, సలహాలు చేశారు. అగ్ని సంభవించినప్పుడు సెక్యూరిటీ సిబ్బందికి పలు విషయాలపై అవగాహన కల్పిస్తూ ఆందోళన చెందకుండా ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత కూడా సిబ్బందిపై ఉందన్నారు. వారిని కాపాడాల్సిన మొదటి బాధ్యత సెక్యూరిటీ సిబ్బందిదేననీ సూచించారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ సెక్యూరిటీ అధికారులు శేఖర్, రామారావు,సుబ్బారావు,కమల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదులో నిర్లక్ష్యం వద్దు : డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



నవతెలంగాణ-ఓయూ

ఓటర్ల నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, నిర్లక్షంగా వ్యవహరించరాదని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపై అధికారులతో ఆయన సితాఫలమండీలోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు అవకాశాన్ని ఓటర్లందరూ సద్వినియోగం చేసుకొనేలా అధికార యంత్రాంగం కృషి చేయాలని సూచించారు. కార్పొరేటర్ సామల హేమ, డిప్యూటీ కమీషనర్ సుధాంశు, బీ ఆర్ఎస్ సమన్వయకర్తలు రాజ సుందర్, జలంధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సినారె అవార్డును అందుకోనున్న బొగ్గారపు బ్రహ్మానందం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యామిని స్టూడియోస్ ప్రారంభోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 10వ తేదీ ఆదివారం రవీంద్ర భారతిలో విశ్వజనని ఫౌండేషన్ చైర్మన్, సంఘ సేవకులు బొగ్గారపు బ్రహ్మానందంకు ప్రత్యేక బిరుదు కలిగిన ప్రముఖ రచయిత, కవి 'డాక్టర్ సినారె' అవార్డును అందుకోనున్నట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనతో పాటుగా స్వరరాగ నీరజనం, గాయనీ గాయకులకు సినారె అవార్డులను ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్న తెలంగాణ శాసన మండలి సభ్యు లు బండా ప్రకాష్ ముదిరాజ్, తెలంగాణ ఇరిగేషన్ కార్పొ రేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్.వేణుగోపాల చారి, ప్లే బ్యాక్ సింగర్ నీరటి ప్రణయ్ కుమార్, యామిని స్టూడియోస్ అధ్యక్షురాలు, గాయనీ యామిని వంటి అతిరథ మహారథ అతిథుల చేతుల మీదుగా 'డాక్టర్ సినారె' అవార్డును అందుకోనున్నట్లు ఆయన తెలిపారు.ఈ అవార్డు అందుకో వడం పట్ల బొగ్గారపు బ్రహ్మానందం హర్షం వ్యక్తం చేశారు.



అంబర్‌పేట డివిజన్ నూతన ఎమ్మార్వోగా జయ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

-నవతెలంగాణ-అంబర్ పేట

'నారాయణగూడ సీఐగా యు.చంద్రశేఖర్'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నారాయణగూడ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా 2007 బ్యాచ్‌కు చెందిన యు.చంద్రశేఖర్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో చాదర్‌ఘాట్ స్టేషన్ డీఐ విభాగంలో పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణగూడ సీఐగా రావటం చాలా సంతోషంగా ఉందని, బాధ్యతల నిర్వహణలో కచ్చితంగా ఉంటూ శాంతి, భద్రతల పరిరక్షణలో తన వంతు కృషి చేస్తానన్నారు. క్రమశిక్షణతో సక్రమంగా విధులు నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ యు.చంద్రశేఖర్‌కు పలువురు ఎస్ఐలు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

జంక్షన్ల అభివృద్ధికి ప్రతిపాదనలు

సిద్ధం చేయాలి

● జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

జంక్షన్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రవీంద్రభారతి, జర్నలిస్ట్ కాలనీ, జగన్నాథ్ టెంపుల్ జంక్షన్లను ట్రాఫిక్ అదనపు పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, ఇ.ఎన్.సీ. జియాఉద్దీన్, సీసీపీ రాజేంద్ర ప్రసాద్ నాయక్‌తో కలిసి కమిషనర్ పరిశీలించారు. మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన 64వ సిటీ కన్వర్జెన్స్ సమావేశంలో వివిధ అంశాలపై చర్చ జరిగిన విషయం తెలిసిందే. ముఖ్యంగా రవీంద్రభారతి జంక్షన్ వద్ద పాదాచారులకు ప్రమాదాల నివారణకు ఫుట్‌పాత్ నిర్మాణం, జర్నలిస్ట్ కాలనీలో జంక్షన్ అభివృద్ధి, జగన్నాథ టెంపుల్ జంక్షన్ వద్ద డివైడర్ పునర్నిర్మాణం కోసం మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆయా జంక్షన్లలో పలు పనులను చేపట్టేందుకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్‌పోలీస్ అధికారుల సూచనల మేరకు పనులను పూర్తి స్థాయిలో చేపట్టేందుకు అంచనా ప్రతిపాదనలు తయారు చేయాలని ఇ.ఎన్.సీ, టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

కేంద్ర ప్రభుత్వం బీసీల రూ.2 లక్షల కోట్ల బడ్జెటు కేటాయించాలి

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య
● పార్లమెంట్ వద్ద బీసీల భారీ ప్రదర్శన



నవతెలంగాణ-హైదరాబాద్

బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి కేంద్ర ప్రభుత్వం బీసీల బడ్జెటు 2 లక్షల కోట్లకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ లాల్ కృష్ణ అధ్యక్షతన ఢిల్లీ పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన జరిపి జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు.ఈ ధర్నా లో వైయస్సార్సీపీ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.వారు మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ - పార్లమెంట్ ఎన్నికలలో బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు 50 శాతం టికెట్లు ఇవ్వాలని, వారికి అన్యాయం చేసే పార్టీల భరతం పడతామని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నార విమర్శించారు. బీ సిల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతం పెంచాలని,త్వరలో జరుపబోయే జనాభా గణనలో కులాల వారి లెక్కలు తీయాలని డిమాండ్ చేసారు. ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఈ మేరకు రాజ్యాంగాన్ని సవరించాలని, విద్య-ఉద్యోగరిజర్వేషన్లు పై యున్న క్రిమిలేయర్ ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మహా ధర్నాలో బీసీవిద్యార్థి సంఘం తెలంగాణా అధ్యక్షులు అంజి, బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు అనంతయ్య, ఢీల్లీ ఇన్‌చార్జి ర్జ్ కర్రి వేనుమాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చౌటుపల్లి సురేష్, మీడియా కోఆర్డినేటర్ జలపల్లి కిరణ్, హైదరాబాద్ గ్రేటర్ ఉపాధ్యక్షులు పండరినాథ్, పాల్గొన్నారు

ఓటు హక్కు నమోదు తప్పనిసరి

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం-ఎడ్ల సుధాకర్‌రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

అర్హులైన వారందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ఆకాష్‌నగర్ బస్తీలోని మెట్రో కౌన్సెలెట్ మీ సేవ జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో జరిగిన ఓటర్ ఐడి ఎన్రోల్‌మెంట్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విచ్చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు నమోదు అర్హుత లైన ప్రతి ఒక్కరూ చేసుకోవాలని, ముఖ్యంగా యువత మార్పులు చేర్పులు ఏమైనా ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆకాష్ నగర్ మెట్రో కౌన్సెలెట్ మీ సేవలో సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీ సేవ నిర్వాహకుడు అక్తర్ పాషా, పార్టీ సీనియర్ నాయకులు ఎం జనార్దన్, జేడి రాహూల్,మతీన్ తదితరులు పాల్గొన్నారు.

చెస్‌లో స్వర్ణం సాధించడమే లక్ష్యం



నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణా ఏసీఎఫ్ స్టేట్ ఓపెన్ చిల్డ్రన్స్ చెస్ టోర్నమెంట్‌లో తమ ఎకాడమీ చిన్నారులు ఛాంపియన్స్గా నిలవడం సంతోషంగా ఉందని, వచ్చే రోజుల్లో ఇండియా తరపున ఖచ్చితంగా చెస్ క్రీడలో తమ ప్రతిభతో మెడల్స్ సాధించి దేశానికి ఖ్యాతి తీసుకువస్తారన్న నమ్మకం ఉందని ఏకాగ్ర చెస్ అకాడమీ సీఈఓ, కోచ్ సందీప్ నాయుడు అన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ గాయత్రిహిల్స్‌లోని అకాడమీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అకాడమీ చిన్నారులు సాధించిన విజయాలను వెల్లడించారు. అండర్-8 విభాగంలో శ్లోక దండు ఈనెల 6న నగరంలో జరిగిన చిల్డ్రన్స్ చెస్ టోర్నమెంట్లో నాలుగులో నాలుగు పాయింట్స్ సాధించి ఛాంపియన్గా నిలిచిందిందని, 6ఏళ్ళ వయసులో చాలా చురుకుగా, ఎత్తుకు పైఎత్తులో ప్రత్యర్ధిని ఓడిస్తుందని ప్రశంసించారు.అండర్-8 బాలుర విభాగంలో రాన్స్‌సేతి ఛాంపియన్‌గా నిలిచాడని, అంతేకాకుండా అండర్ 12 బాలుర విభాగంలో యశ్వంత్ రావు మెడల్ సాధించినట్లు తెలిపారు. ఏకాగ్ర చెస్ అకాడమీ ద్వారా నేషనల్, ఇంటర్నేషనల్స్ చెస్‌ని క్రీడాకారులు ఆడారని, ఛాంపియన్స్ నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు షీతల్, భరత్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం దిశగా దూసుకుపోవాలి



● ఏసీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.చేతన

నవతెలంగాణ-హిమాయత్ నగర్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించే దిశగా ముందుకు దూసుకుపోవాలని ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.చేతన (ఐపీఎస్) విద్యార్థులకు సూచించారు.వివిధ డిగ్రీ కోర్సుల్లో మొదటి ఏడాదిలో చేరిన విద్యార్థులకు మంగళవారం నిజాం కళాశాలలో 'స్వాగత సభను' నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల హ్యాండ్ బుక్ 2023-24 సీడీని ఆవిష్కరించారు.ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఏసీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.చేతన మాట్లాడుతూ విద్యార్థులు కలలు కనడానికి ఎలాంటి సరిహద్దులు లేవని, అయితే అవి ఉత్తమంగా, ఉన్నతంగా ఉండాలన్నారు. ఇంటర్ పూర్తి చేసి డిగ్రీలో అడుగుపెట్టిన విద్యార్థులు స్వతంత్ర ఆలోచనల దిశగా ఉంటారని, ఈ నేపథ్యంలో ఒకవైపు విజ్ఞానాన్ని పొందుతూనే మరోవైపు ఆటంకాలను అధిగమిస్తూ ఆశయం కోసం అంకిత భావంతో కృషి చేసినప్పుడే విజయం సాధిస్తారని ఆమె పేర్కొన్నారు. నూతన ఆవిష్కరణలు చేయాలని, వివిధ రంగాల్లో ఉన్న తంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఓయూ యూజీసీ డెవలప్‌మెంట్ అఫైర్స్ డీన్‌ప్రొఫెసర్ జి.మల్లేశం మాట్లాడుతూ జీవితం ఎంతో విలువైందని, దీన్ని సాకారం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ బి.బీమా మాట్లాడుతూ 136 సంవత్సరాల చరిత్ర కలిగిన నిజాం కళాశాలలో విద్యా ర్థులుగా చేరడం అదృష్టమని పేర్కొన్నారు.అన్ని రకాల వసతులు కళాశాలలో ఉన్నాయని, వాటిని ఉపయోగించు కోవాలని విద్యార్థులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ గంగ ఉపేందర్ రెడ్డి, అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రేణుక, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కవిత, ఈఓసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ తిరుపతి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్.పరంధాములు, ఎన్ఎస్ఎస్ పిఓ డాక్టర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు



నవతెలంగాణ-బేగంపేట్

రాష్ట్రం అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమీటి ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమా అన్నారు. సనత్ నగర్ నియేజకవర్గంలో స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకటరమణ, అఖిల్ ఆధ్వర్యంలో లాల్ బహుదుర్ శాస్త్రీనగర్‌లోని పాటి గడ్డ, వడ్డేరబస్తీలోని పలువురు యువకులు, మహిళలు ఆమె సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ ఎస్ ఎనాయకుల అవినీతి, అక్రమాలతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు.ప్రభుత్వ పథకాల కేవలం బీఆర్ఎస్ నాయకులకు మాత్రమే అందుతున్నాయ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తరువాత బీఆర్ ఎస్ అవినీతిపై విచారణ జరిపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లలీత, మాధవి, అంజయ్య, జ్యోతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాష్ రూంకి వెళ్ళి వస్తానని పరీక్షా కేంద్రం నుంచి వెళ్ళిపోయిన అభ్యర్థి

● మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
● మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్‌పీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ తెలిపారు. మంగళవారం మేడ్చల్ పరిధిలోని కండ్లకోయ సీఎంఆర్ టెక్నాలజీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్మెంట్ (సీబీఆర్టీ) పరీక్షను మొదటి విడత ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష రాసిన ఆదిలాబాద్ జిల్లాలోని శాంతినగర్‌కు చెందిన మహ్మద్ అస్రార్ (హాల్‌టిక్కెట్ నెంబర్: 2321800647) అనంతరం రెండో విడత పరీక్ష మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు ఉండగా.. సా యంత్రం 4.10 గంటల సమయంలో తను వాష్ రూంకు అవసరం ఉందని సంబంధిత పరీక్షల అధికారితో చెప్పారు. ఈ క్రమంలో వాష్‌రూంకు వెళ్తున్నని చెప్పిన అభ్యర్థి మ హ్మద్ అస్రార్ ఎంతకీ తిరిగిరాకపోవడంతో మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని కలెక్టర్ అమోయ్ కుమార్ తెలిపారు.

యాదవులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

● యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాముడు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు వంశీ మోహన్



నవతెలంగాణ-అడిక్‌మెట్

యాదవులకు బడ్జెట్‌తో కూడిన ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాముడు యాదవ్, యాదవ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు వంశీ మోహన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో మంగళవారం యాదవ మహాగర్జనను నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు యాదవ్, వంశీ మోహన్ యాదవ్ మాట్లాడుతూ యాదవ కులస్తులకు అన్ని రంగాలలో తీవ్ర అన్యాయం జరుగుతుందని, రాష్ట్రంలో వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఈ కార్పొరేషన్‌కు రూ.10 వేల కోట్ల రూపాయల బడ్జెట్ విడుదల చేయాలన్నారు. 1970 వరకు యాదవులకు కొనసాగిన ప్రత్యేక రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు జనాభా ప్రాతిపదికన యాదవ సామా జిక వర్గానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితర రాజకీయపరమైన అవకాశాలు కల్పించాలని అన్నారు. యాదవులకు ఏ పార్టీ అయితే అన్ని విధాలుగా అవకాశం కల్పించి న్యాయం చేస్తారో ఆ పార్టీకి యాదవుల పూర్తి మద్దతు ఉంటుందన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ కోసం లబ్ధిదారుల నుంచి డీడీల రూపంలో డబ్బులు చెల్లించినప్పటికీ ఇంత వరకు గొర్రెల పంపిణీ ఎందుకు చేపట్టలేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు రాజారామ్ యాదవ్, శేర్లింగంపల్లి నాయకులు రవికుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా. కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

అమ్మవారి దయతో ప్రజలంతా సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఉండాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా.కోటనీలిమ ఆకాంక్షించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ బన్సీ లాల్ పెట్ లో సోమవారం శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించి డా. కోట నీలిమ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహిళలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో డా. కోట నీలిమను సత్కరించారు. ఈ సందర్భంగా డా. కోట నీలిమ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైనా బో నాల పండుగ ప్రజల మధ్య ఐక్యతను పెంచుతాయని పేర్కొన్నారు. సనత్ నగర్ నియోజకవర్గ ప్రజలు, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో ఉండేలా చూడమని రేణుక ఎల్లమ్మ తల్లిని కోరుకున్నట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నేతలు మనీషా, ఉష రాణి, ప్రియాంక, కాంగ్రెస్ నేతలు బబ్లు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పెన్షన్ విధానం రద్దు కోసం పార్లమెంట్ ఎదుట నిరసన

● 10న న్యూ ఢిల్లీ రైల్వే స్టేషన్ నుండి ర్యాలీ
● రాంలీలా మైదానంలో భారీ బహిరంగ సభ

నవతెలంగాణ-ఓయూ

జనవరి 2004నుండి చేరిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ కొత్త పెన్షన్ విధానాన్ని తీసుకు రావడం పట్ల ఎన్ఎఫ్ఐ ఆర్ నాయకుడు భరణి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త పెన్షన్ విధానం వలన 30 నుండి 40 ఏళ్ల పాటు విధులు నిర్వహించి పదవి విరమణ సమయంలో పెన్షన్ వస్తుంది అని గ్యారంటీ లేదని తెలిపారు. ఉద్యోగుల అమౌంట్‌ను షేర్ మార్కెట్‌లో పెట్టి వచ్చే లాభాలు భట్టి పెన్షన్ ఇస్తామనే ప్రతిపాదన ఉందని, సంవత్సరాల తరబడి రైల్వేలో పని చేసి పదవి విరమణ తరువాత వచ్చే పెన్షన్ ద్వారా తమ దేశ జీవితాలు గడుస్తాయి కాబట్టి పాత పెన్షన్ విధానమే కొనసాగించాలని రైల్వే ఉద్యోగులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. రక్షణ శాఖ మినహా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అన్ని సంస్థలలో కొత్త పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలని వాపోయారు. కొత్త పెన్షన్ విధానం పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆగస్ట్ 10న నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే ప్రధాన కార్యదర్శి రాఘవయ్య ఇచ్చిన పిలుపు మేరకు ఉదయం 9 గంటలకు న్యూ ఢిల్లీ రైల్వే స్టేషన్ నుండి ర్యాలీగా బయలుదేరి లక్ష మందితో పార్లమెంట్ భవన్ ముందు భారీ నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని వెల్లడించారు. తరువాత రాంలీలా మైదానంలో బహిరంగ సభ ఉంటుంది, అదే రోజు సికింద్రాబాద్ దక్షణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం రైల్ నిలయం లోని జనరల్ మేనేజర్ ఛాంబర్ ముందు నిరసన ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఆందోళన కార్య క్రమంలో పెద్ద ఎత్తున రైల్వే కార్మికులు ఉద్యోగులు పాల్గొని విజయ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనియెడల మరింత పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

కాంట్రాక్టర్ వేధింపులపై నగర డిప్యూటీ మేయర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-ఓయూ

కాచిగూడ కమేలలో కాంట్రాక్టర్ అక్రమ వసూళ్లతో పాటు, వ్యాపారులపై చేస్తున్న వేధింపులను ఆపేలా చూడాలని కాచిగూడ స్లాటర్ హౌస్ కమెల అసోసియేషన్ ప్రతినిధులు డిప్యూటీ మేయర్ శోభన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ మేయర్, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డిని కలిసి కాంట్రాక్టర్ సయ్యద్ బషీర్ హుస్సేన్‌పై చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. తాము ఎన్నో సంవత్సరాలుగా కాచిగూడ మేకల మండిలో వ్యా పారం చేసుకుంటున్నామని, తమ వద్ద ప్రభుత్వం నిర్ణయిం చిన ధరల కంటే అక్రమంగా ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారని దాంతోపాటు మౌలిక వసతులు కల్పించడం లేదని తెలిపారు. కమేల పరిసరాలను పరిశుభ్రంగా కూడా ఉంచడం లేదని ఆయన బాధ్యతలను సరిగా నిర్వర్తించడం లేదని కాంట్రాక్టర్‌పై వారు ఫిర్యాదు చేశారు. తమ వ్యాపా రాలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ మేయర్ ను అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ కుమార్, జాయింట్ సెక్రెటరీ రఘునాథ్, సెక్రటరీ రామ్మోహన్‌లు కోరారు. ప్రతినిధులు ఎండి బాబు, ఎండి రయిస్,ఎండిఇమ్రాన్, ఎస్.కె ప్రదీప్, సోహాబ్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేశ్వర్లును గన్ ఫౌండ్రీ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని కమిషనర్‌ను కోరమన్నారు. రోడ్ల మరమ్మతులు, కమ్యూనిటీహాల్ పునర్నిర్మాణం, అంగన్వాడి కేంద్రాలు స్ట్రీట్ లైట్ సంబంధించిన సమస్యలు, క్రీడలకు సంబంధించిన విషయాలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అదేవిధంగా గన్ ఫౌండ్రీబస్తీలో శ్రావణం బోనాల ఉన్నందున దేవాలయాల పరిసరాల్లో శుభ్రపరచడం, సీసీ రోడ్డు, వీధి స్ట్రీట్ మరమ్మ తులు, ఫోకస్ లైట్స్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా గొంతు కోసి పరారైన దుండగుడు

నవతెలంగాణ-అడిక్‌మెట్

దుండగుడు మహిళ గొంతు కోసి పరారైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నల్లకుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విద్యానగర్ లోని టీఆర్టీ కాలనీలో నివసించే అనిత(55) నాంపల్లిలోని చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) శాఖలో సీనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్నారు. చేవెళ్లలోని ఎన్కేపల్లి ప్రాంతానికి చెందిన దూరపు బంధువు రమేష్.. సోమవారం రాత్రి సమయంలో ఆమె ఇంటికి వచ్చాడు. రమేష్, అనిత మాట్లాడుకుంటున్న సమయంలోనే ఇద్దరి మధ్య వాగ్వాదం, పెనుగులాట చోటుచేసుకుంది. అనంతరం రమేష్ కత్తితో ఆమెపై దాడి చేశాడు. దీన్ని అడ్డుకోవడంతో అనిత రెండు చేతులకు, మెడపై గాయాలైనట్లు తెలిపారు. ట్యూషన్ నుంచి ఇంటికి చేరుకున్న బాధితురాలి కుమార్తె.. తల్లి పరిస్థితిని గమనించి కేకలు వేసింది. అప్రమత్తమైన దుండగుడు రమేష్ ఘటన స్థలం నుంచి పరారయ్యాడు. ఘటన స్థలానికి చేరుకున్న నల్లకుంట పోలీసులు కుటుంబ సభ్యుల సహాయంతో స్థానిక ప్రవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అనిత పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

జాన్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని వినతి : సీఐటీయూ



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ సీ-మెస్‌లో కిచెన్‌మెట్‌గా పనిచేసి ఇటీవలే మరణించిన జాన్ కుటుంబంలో ఒక్కరికీ అవుట్ సోర్సింగ్ కింద ఉద్యోగం ఇవ్వాలని చీఫ్ వార్డెన్ డా.కె.శ్రీనివాస్‌రావుకి మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) అధ్వర్యంలో మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)అధ్యక్షులు టి.మహేందర్ మాట్లాడుతూ జాన్‌కుమార్ ఓయూ మెస్‌లలో గత ఐదు సంవత్సరాలుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించారని, అతని అకాలమరణంతో అ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా ఆ కుటుంబాన్ని ఆదుకోవాటానికి ఒక్కరికి ఉద్యోగం కల్పించి,ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరారు. అనంతరం చీఫ్ వార్డెన్ శ్రీనివాస్‌రావు సానుకూలంగా స్పందించి ఒక్కరికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సీతారాం, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రావు,ఉపాధ్యక్షులు నరేష్, బాలకృష్ణ, పాల్గొన్నారు.

నంది ఎల్లయ్య చేసిన సేవలు మరువలేనివి

కాంగ్రెస్‌ఎస్సీ సెల్ జాతీయ చైర్మన్ రాజేష్



నవతెలంగాణ-ముషీరాబాద్

కాంగ్రెస్ పార్టీ పటిష్ట కోసం బడుగు బడుగు వర్గాల కోసం మాజీ ఎంపీ దివంగత నంది ఎల్లయ్య చేసిన సేవలు మరువ లేనివి అని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జాతీయ చైర్మన్ రాజేష్ లిలోతీయ పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నంది శరత్ ఆధ్వర్యంలో మంగళ వారం గాంధీభవన్‌లో నంది ఎల్లయ్య మూడవ వర్ధంతి కార్యక్రమం నిర్వహించినట్లు నంది ఎల్లయ్య మనవడు రాంనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి రాజేష్ లిలోతియా ముఖ్యఅతిథిగా హాజరై ఎల్లయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, మల్లు రవి నాయకులు హరికా వేణుగోపాల్ తెలంగాణ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రీతం తదితరులు పాల్గొన్నారు.

ఆగని..సాంఘిక దురాచారం..



దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏండ్లు గడుస్తున్నా దేవుడి పేరుతో జరిగే అరాచకం మాత్రం ఆగడం లేదు. సంస్కృతి, సాంప్రదాయాల పేరిట జోగినీ వ్యవస్థను కొనసాగిస్తున్నారు. ఊరడమ్మ, పోచమ్మ పండుగలంటూ ఈ హైటెక్ యుగంలోనూ జోగినీలతో నాట్యం చేయిస్తూ, వేపకొమ్మలతో అలంకరించి ఊరేగిస్తున్నారు. అయినా ఎవరూ నోరు తెరిచి ఈ సాంఘిక దురాచారాన్ని వ్యతిరేకించరు. అగ్ర వర్గాల ఆనందం కోసం బడుగు బలహీనలు మౌనంగా వీటిని భరించాల్సి వస్తుంది. అలాంటి జోగినీల దుర్భరమైన జీవితాల గురించి నేటి మానవిలో...

తరతరాలుగా రాజులు, జమీందార్ల ఏలుబడిలో గుడుల్లో మహిళలు దుర్భరమైన జీవితాన్ని అనుభవించారు. నిరుపేద దళిత యువతులను జోగినిగానో, దేవదాసిగానో, మాతంగిగానో మార్చేవారు. సాంప్రదాయాల పేరుతో దేవుని బిడ్డగా ప్రచారం చేసి వారి శరీరాలతో ఆటలాడారు. రాజుల కాలం, గడుల కాలం పోయినా నేటికీ అలాంటి ఆకృత్యాలను మన రాష్ట్రంలో జరుగుతూనే ఉన్నాయి. బలవంతంగా జోగినిగా మార్చేసిన మహిళను ఆధిపత్య కులాల్లోని ప్రతి ఒక్కరూ లైంగికంగా వాడుకుంటున్నారు. ఇక జీవితాంత ఆమె వారి అకృత్యాలకు భరించాల్సిందే.

ఆమెను గుడికి సంబంధించిన దానిగా 'గుడిచేటి' అని అనే పేరుతో పిలుస్తుంటారు. సాలెగూడులో చిక్కుకున్నట్లు ఆ జోగిని ఎటూ తప్పించుకోలేని స్థితిలో, దారుణమైన మానసిక వేదనను అనుభవిస్తూ ఉంటుంది. ఒక్కోసారి తినడానికి తిండిలేక ఇల్లిల్లు తిరిగి అడుక్కోవాల్సి వచ్చేది. ఇప్పటికీ వారి పరిస్థితులలో ఎలాంటి మార్పు రాలేదు. జోగినిలను ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. పేర్లేమైనా పెత్తందార్లు వాళ్ళను ఉపయోగించుకునే తీరు ఒక్కటే. దేవుడి పేరుతో, గుడి పేరుతో జరిగిన, జరుగుతున్న దౌర్జన్యాలకు ఉదాహరణ ఇది. బసవి, మాతంగి, దేవదాసి వ్యవస్థలు వాస్తవానికి 1988లో రద్దయ్యాయి. ప్రముఖ కవి గుర్రం జాషువా కూతురు హేమలత లవణం చేసిన పోరాట ఫలితంగా ఈ దురాచారాలు అధికారికంగా రద్దయ్యాయి. అయినా సాంప్రదాయం పేరుతో ప్రభుత్వాలు సైతం వాటిని ప్రోత్సాహిస్తూనే ఉన్నారు.

మూఢ నమ్మకమే ఆచారంగా....

ఈ ఆధునిక యుగంలో కూడా చాలా గ్రామాల్లో మూఢ నమ్మకాలతో జనం మోసపోతున్నారు. నిరక్షరాస్యులయిన అమాయక ప్రజల అవసరాను అవకాశంగా తీసుకుని పిల్లలు పుట్టడం లేదనో, కలిగినా, పుట్టిన వెంటనే చనిపోతున్నారని.. లేదా ఇంట్లో వారికి ఏదో జబ్బు వచ్చిందని.. ఇలా కారణం ఏదైనా కావొచ్చు. సందర్భం ఏమైనా కావొచ్చు, ఈ వ్యవస్థ మాత్రం మూఢ విశ్వాసంలోంచి మొలకెత్తిందే. మరో వైపు దైవార్పితం అనే మరో అంధ విశ్వాసాన్ని బలపరుస్తూ, ఒక అమ్మాయిని ఊరికి ఉమ్మడి ఆస్తిగా పరిగణిస్తున్నారు. అమ్మాయి తల్లిదండ్రులు మనసులో ఎల్లమ్మ, పోచమ్మ వంటి దేవతల్ని తలుచుకుని, తమ కూతుర్ని జోగినిగా మారుస్తారు. అలా ఆ దేవత పేరుమీద ముడుపులు కడతారు. మనకు ఉన్న వేల వేల మూఢ విశ్వాసాల్లో ఇదీ ఒకటి. ఆ తర్వాత వారి జీవితాలు మెరుగుపడితే ఆ తల్లి కటాక్షమని సంతోషపడతారు. లేదంటే ఆ తల్లి మనసు ఇంకా కరగలేదని ఓపిక పడతారు.

జోగినిగా మార్చిన తర్వాత...

ఆ ఊరిపెద్దగానీ, పోతురాజు గానీ లేదంటే ఆ అమ్మాయికి బావ వరుస అయిన వ్యక్తిగాని ఆమె మెడలో తాళి కడతాడు. దానితో మైలపట్టం కార్యక్రమం పూర్తవుతుంది. ఇక అప్పటి నుండి ఊరి పెత్తందార్లు, భూ స్వాములు ఆమెను లైంగికంగా వాడుకుంటూ ఉంటారు. యవ్వనంలో ఉన్నంత వరకే ఏ మాతంగి, ఏ దేవదాసి, ఏ జోగిని జీవితమైనా తిండికి లోటు లేకుండా జరుగుతుంది. యవ్వనం తరిగిపోవడంతో వారికి కష్టాలు ప్రారంభమవుతాయి. దగ్గరికి వచ్చే వాళు ండరు. తిండిపెట్టే వాళ్ళూ ఉండరు.





ఎన్నాళ్ళని భరిస్తారు

అందరూ దేవుడుని తండ్రితో సమానం అని అంటున్నారు. నిజమే దేవుడు తండ్రి అయితే ఆయనను పెండ్లి చేసుకున్న జోగిని తల్లి కాదా? మరి ఆమె ఊరి పెత్తందార్ల ఉమ్మడి సొత్తు ఎలా అయ్యిందీ? అవేవి పట్టించుకోకుండా వారి కోరిక తీర్చే వస్తువుగా ఆమెను భావిస్తారు. మతం, దేవుడు, గుళ్ళ, మనుస్మృతి ఆసరాతో శతాబ్దాలుగా మహిళల్ని మరబొమ్మలుగా చేస్తున్న ఈ వ్యవస్థల్ని ఇంకా ఎన్నాళ్లు భరిస్తారు? చివరి దశలో ఆ మహిళలు అంతులేని సుఖవ్యాధులతో దుర్భమైన చావులు చస్తున్నా వారిని పట్టించుకునే వారు లేరు. వారు చనిపోయినా తర్వాత వారికి పుట్టిన బిడ్డల పరిస్థితి కూడా అంతే. లైంగిక హింసకు బలవుతూ బతికే ఇలాంటి జీవితాల గూర్చి ప్రభుత్వాలు ఎందుకు పట్టించుకోరూ? మూఢ విశ్వాసాలను నివారించాల్సింది పోయి పాలకులే ప్రోత్సహిస్తున్నారు. దళిత మహిళలను బలితీసుకుంటున్న ఇలాంటి అంధవిశ్వాసాలపై కలిసికట్టుగా ఉద్యమించాలి.



రఘునాథ కమిషన్ ద్వారా...

ప్రభుత్వం నియమించిన రఘునాథ కమిషన్ ద్వారా ఈ సాంఘిక దురాచారమైన జోగిని వ్యవస్థను రూపుమాపాలని కుల వివక్ష పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్ డిమాండ్ చేశారు. 1992లో ఈ సాంఘిక దురాచారానికి వ్యతిరేకంగా హేమలత లవణం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు .దాంతో ప్రభుత్వం ఈ దురాచారాన్ని నిలిపివేసి జోగినిలకు భూములు, గేదెలు ఇచ్చి ఉపాధి కల్పించింది .అయినా కుల పెద్దలు, పెత్తందారులు వారిని ఉపాధి చేసుకోనీయకుండా భూములను తక్కువ ధరలకు తీసుకొని వేశ్యా వృత్తిని కొనసాగేలా చేశారు. దీంతో గంగాధర్ ప్రభుత్వం ఈ దురాచారంపై దృష్టి సారించి నిషేధించాలని కోరారు. వారికి సమాజంలో సమాన హక్కులు, కనీస గౌరవం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వం రఘునాథ కమిషన్ అమలు చేయడం ద్వారా ఈ దురాచారాన్ని పూర్తిగా రూపుమాపేలా చేయవచ్చని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. నేటికీ జిల్లాలో పలు ప్రాంతాలలో ఈ జోగిని దురాచారం కొనసాగించడం దురదృష్ట కరమన్నారు. కావున ప్రభుత్వం ఈ సాంఘిక దురాచారం నుండి వారిని విముక్తి చేయాలని కోరారు.

- లింబూరి. లక్ష్మణ్
బోధన్

ఇల్లు మారేటపుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అద్దె, పరిసరాలు, వసతులు ఇలా చాలానే ఉంటాయి. అన్నీ సరిగా తెలుసుకోకుంటే ఇబ్బందులు ఎదురవుతాయి. మరి ఎలాంటి టిప్స్ పాటించాలో చూద్దామా...

అద్దె ఇంటికి ఈ జాగ్రత్తలు తప్పనిసరి...



పరిసరాలు...

ఇల్లు మారాలనుకున్నప్పుడు పరిసరాలు చాలా ముఖ్యం. అన్ని వసతులు దగ్గరగా ఉన్నవా లేవా పరిశీలించుకోవాలి. పిల్లల స్కూల్, షాపింగ్, హాస్పిటల్స్ కూడా దగ్గరగా ఉండేలా చూసుకోవాలి. ఇవన్నీ అందుబాటులో ఉంటే ఇబ్బంది ఉండదు. బయటికి ఎక్కడికి వెళ్ళాలన్నా సమస్య అవ్వదు. సమయం కూడా కలిసి వస్తుంది. గ్యాస్, కరెంట్, డ్రైనేజీ వంటి సౌకర్యాలు ఉన్నాయో లేదో ముందే చూడాలి. దీని వల్ల ఇంట్లోకి దిగాక కూడా ఎలాంటి సమస్యలు రావు.

సెక్యూరిటీ..

ఇల్లు తీసుకునే ముందు సెక్యూరిటీ ఉందో లేదో పరిశీలించుకోవాలి. గేటెడ్ కమ్యూనిటీలో ఉంటే ఫుల్ సెక్యూరిటీ ఉంటుంది. అలాంటి ఇంటిని ఎంచుకోవడం మంచిది.

పెంపుడు జంతువులు..

చాలా మంది జంతువుల్ని పెంచుకుంటారు. అలాంటి అలవాటు ఉంటే దాని గురించి ముందుగానే ఓనర్‌కి చెప్పాలి. చుట్టుపక్కల అబ్జెక్షన్ చెప్పేవారున్నారా అని వివరాలు కూడా తెలుసుకోవాలి.

విస్తీర్ణత...

ఇంట్లో ఎన్ని రూములున్నాయి.. అనుకూలంగా ఉన్నాయా లేదా.. అందులో వస్తువులన్నీ సరిపోతాయా లేదా చూసుకోవాలి. అలా కాకుండా చాలీచాలని ఇల్లు తీసుకుంటే మొదట్లో సర్దుకుపోయినా రానురాను ఇబ్బందులు ఎదురవుతాయి. చికాకులు పెరుగుతాయి. అలాగే ఇంట్లో ఏమైనా పగుళ్ళు ఉన్నాయా.. నాచులు, అచ్చులు ఉన్నాయా అని కూడా చూసుకోవాలి.. ఇవి పరిశీలించుకోకున్నా... సమస్యలు ఎదురవుతాయి.

పార్కింగ్, అగ్రిమెంట్..

పార్కింగ్ ప్లేస్ కూడా చూసుకోవాలి. కారు ఉన్నా, బైక్ ఉన్నా పార్కింగ్ ప్లేస్ సరిపోతుందో లేదో చూసుకోవాలి. ఇల్లు అగ్రిమెంటు చదివి అర్థమైందనుకున్నాక, అందులోని షరతులు అనుకూలంగా ఉన్నాయనుకుంటేనే సంతకం పెట్టాలి. లేకపోతే చివరికి నష్టపోవాల్సి వస్తుంది.

మెయింటనెన్స్..

ఇంటికి మెయింటనెన్స్ ఎలా ఉంటుందో వివరాలు ముందే తెలుసుకోవాలి. అది ఎవరు చెల్లిస్తారో, ఎంతెంత ఉంటుందో, అంతకు ముందు ఉత్పన్నమైన సమస్యలు ఏమైనా ఉన్నాయో లేదో కూడా వివరంగా తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఇలాంటి టిప్స్ పాటించడం వల్ల మున్ముందు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

ఏకపక్ష చర్య

తిరువనంతపురం : దేశంపై ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని రుద్దాలని కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకుంటున్న తొందరపాటు చర్యలను కేరళ శాసనసభ నిరసించింది. ఇటువంటి చర్యలు రాజ్యాంగ లౌకిక స్వభావానికి విరుద్ధమని అభిప్రాయపడింది. ఈ మేరకు శాసనసభలో మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. యూసీసీ యోచనను విరమించుకోవాలని ఆ తీర్మానంలో కేంద్రాన్ని కోరారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ కూటమి సమర్థించింది. యూసీసీ అమలుకు నిరసనగా సీపీఐ (ఎం), కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో సెమినార్లు నిర్వహించాయి. 'యూసీసీ అమలుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలపై కేరళ శాసనసభ ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనిని రాజ్యాంగ లౌకిక స్వభావాన్ని దెబ్బ తీసేందుకు కేంద్రం చేపట్టిన తొందరపాటు, ఏకపక్ష చర్యగా భావిస్తోంది. దేశ ప్రజలపై ప్రభావం చూపే ఇలాంటి ఏ చర్యనైనా ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి' అని తీర్మానంలో విజయన్ ప్రతిపాదించారు. యూసీసీని రాజ్యాంగం కేవలం ఆదేశిక సూత్రంగానే పరిగణించిందని తీర్మానం గుర్తు చేసింది. రాజ్యాంగంలోని 44వ అధికరణలో పేర్కొన్న ఆదేశిక సూత్రాలను విధిగా అమలు చేయాలని న్యాయ వ్యవస్థ సైతం ఆదేశించలేదని స్పష్టం చేసింది. పలు దఫాల సంప్రదింపుల తర్వాతే యూసీసీని రాజ్యాంగ నిర్మాతలు ఆదేశిక సూత్రాలలో చేర్చారని తెలిపింది. 'రాజ్యాంగ ఉపోద్ఘాతంలో లౌకికతత్వానికి హామీ ఇచ్చారు. ఏ మతం పైన అయినా నమ్మకం ఉంచేందుకు, దానికి అనుగుణంగా జీవించేందుకు రాజ్యాంగం పౌరులకు స్వేచ్ఛ కల్పించింది. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛలో మతపరమైన వ్యక్తిగత చట్టాలను అనుసరించేందుకు, ఆచరించేందుకు ఉన్న హక్కు కూడా చేరి ఉంది. దానిని అడ్డుకునేందుకు చేసే ఏ చట్టమైనా రాజ్యాంగం ప్రసాదించిన మత స్వేచ్ఛ హక్కును నిరాకరించడం, ఉల్లంఘించడమే అవుతుంది. యూసీసీని రాష్ట్రాలు మాత్రమే ప్రతిపాదించాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 చెబుతోంది. అది కూడా వివిధ మతాల వారితో సంప్రదింపులు జరిపిన తర్వాతేనని స్పష్టం చేసింది' అని కేరళ శాసనసభ ఆమోదించిన తీర్మానంలో వివరించారు.

ఆర్జీయూకేటీలో విద్యార్థి ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

యూనివర్సిటీల్లో ఏం జరుగుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా బాసర అర్జీయూకేటీలో మరో విద్యార్థి ఆత్మహత్య కలకలం రేపింది. పీయూసీ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభానికి ముందే సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన జాదవ్ బబ్లూ(15) హాస్టల్ గదిలో ఉరేసుకున్నాడు. గమనించిన విద్యార్థులు యూనివర్సిటీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అంబులెన్స్‌లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నిర్మల్ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. అక్కడ వైద్యులు పరీక్షించి విద్యార్థి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. తరగతులు ప్రారంభం కాకముందే విద్యార్థి మానసిక ఒత్తిడికి గురైనట్టు యూనివర్సిటీ అధికారులు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ఏడాది అవగాహన తరగతుల్లో విద్యార్థి జాదవ్ బబ్లూ పాలుపంచుకున్నాడు. యూనివర్సిటీలో చదువుతున్న తన అన్నతో మధ్యాహ్నం వరకు మాట్లాడినట్టు సమాచారం. అంతలోనే విద్యార్థి సూసైడ్ చేసుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి మృతి విషయమై తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్టు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. కాగా, నిర్మల్ ఆస్పత్రి వద్ద విద్యార్థి మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన కాంగ్రెస్ నాయకులు శ్రీహరిరావును పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో కలెక్టర్ వచ్చేవరకు కదిలేది లేదని అక్కడే కూర్చున్నారు.సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఐఐటీ హైదరాబాద్‌లో చదువుతున్న విద్యార్థిని సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఐఐటీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న ఒడిశాకి చెందిన విద్యార్థిని మమితానాయక్(21) సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్నట్టు రూరల్ ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపారు. సూసైడ్‌నోట్‌లో విద్యార్థి ఏం రాసిందనే విషయాల్ని మీడియాకు వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా, జూన్ నెలలో కార్తీక్ అనే విద్యార్థి ఐఐటీహెచ్ నుండి బయటికెళ్లి విశాఖ బీచ్‌లో ఆత్మహత్య చేసుకుని శవమై కనిపించాడు. తాజాగా మరో విద్యార్థిని క్యాంపస్‌లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. చదువుల్లో రాణించలేకపోతున్నామనే ఆత్మన్యూనతాభావంతోనే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్టు గతంలో జిల్లా ఎస్పీ రమణకుమార్ మీడియాకు వెల్లడించారు.

నిక్కర్ పార్టీ, లిక్కర్ పార్టీ రెండూ ఒక్కటే..

(మొదటిపేజీ తరువాయి)

కార్యదీక్షతో పని చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 25 సీట్లకు మించి రావని వ్యాఖ్యానించారు. అందుకే సీఎం కేసీఆర్ కాంగ్రెస్‌పై ఎదురుదాడి చేస్తున్నారని తెలిపారు. మంగళవారం ఢిల్లీలో రేవంత్ విలేకర్లతో మాట్లాడారు. సీఎం, మంత్రులు అసెంబ్లీని చిల్లర రాజకీయాలకు వేదికగా మార్చారని విమర్శించారు. శాసనసభలో గద్దర్‌కు సంతాపం తెలపకపోవడం దారుణమన్నారు. ప్రజాసమస్యలపై అసెంబ్లీలో చర్చ జరపడంలో సర్కారు విఫలమైందని తెలిపారు. 'కాంగ్రెస్‌ను కేసీఆర్, కేటీఆర్ చాలా అభ్యంతరకరంగా దూషించారు. తండ్రీ, కొడుకులు చర్చను నా చుట్టూనే తిప్పారు. నన్ను దూషించేందుకు, కాంగ్రెస్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసీఆర్ చేసిన ద్రోహంపై చర్చకు సిద్ధమా?

రాష్ట్రానికి సీఎం కేసీఆర్ చేసిన ద్రోహంపై చర్చకు సిద్ధమా? అని రేవంత్ సవాల్ విసిరారు. సిద్ధమైతే అమరవీరుల స్థూపం వద్దకు రావాలని డిమాండ్ చేశారు. సీఎం రాలేకపోతే మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును పంపాలని సూచించారు. బీఆర్ఎస్ నేతలు మంత్రులుగా ఉన్నప్పుడే అప్పటి ప్రభుత్వం పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని పెంచిందని గుర్తు చేశారు. 'కేసీఆర్ నువ్వు నా పేరు ఎత్తలేవు. నీ కొడుకు కేటీఆర్ నా కండ్లలోకి సూటిగా చూడలేడు. అందుకే చర్చకు అల్లుడు హరీశ్‌రావును పంపండి' అని సూచించారు. తెలంగాణ పట్ల తన నిబద్ధత ఎప్పుడూ మారలేదని స్పష్టం చేశారు. తెలంగాణ సమస్యలపై ప్రశ్నించడంలో తను ముందున్నానని చెప్పారు. కానీ కేసీఆర్ చంద్రబాబుతో ఉన్నప్పుడు 610 జీవోపై తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతీసేలా వ్యవహరించారని విమర్శించారు. 1996లో 610జీవోను, జోనల్ విధానం రద్దు చేయాలంటూ అసెంబ్లీలో మాట్లాడిన ద్రోహి కేసీఆర్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1996లో మంత్రిగా కేసీఆర్ మాట్లాడిన మాటలను కేటీఆర్ వినాలని సూచించారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ సాకారమైందంటూ 13 జూన్ 2014లో శాసనసభలో చెప్పిన కేసీఆర్...ఇప్పుడు కాంగ్రెస్‌ను, తనను దోషిగా ఎలా నిలబెడతారని ప్రశ్నించారు. 24 జనవరి 2014లో సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై 54 నిమిషాలు సభలో వివరించానన్నారు. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ రాష్ట్రం కావాలని నొక్కి చెప్పానని గుర్తు చేశారు. అప్పర్ సీలేరు, లోయర్ సీలేరులో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నదని వాపోయారు. తాను ఏ స్థాయిలో ఉన్నా తెలంగాణ పక్షానే ఉన్నానని వివరించారు. పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఎస్. జైపాల్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లాంటి కాంగ్రెస్ నాయకులు అధిష్టానాన్ని వ్యతిరేకించి తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లేనని గుర్తు చేశారు. కేకే మహేందర్‌రెడ్డికి వెన్నుపోటు పొడిచి కేటీఆర్‌ను గెలిపించుకున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌లో కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించింది నేను కాదా? అని ప్రశ్నించారు. అప్పుడు అక్కడ టీఆర్ఎస్ జెండా మోసేవాడే లేడన్నారు. 2011లో కేసీఆర్‌తో పొత్తు పెట్టుకుని ఇప్పుడు కిషన్‌రెడ్డి సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని విమర్శించారు. తెలంగాణ ద్రోహులతో అంటకాగిన కేసీఆర్ దుర్మార్గుడు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. లాలూచీలో కేసీఆర్‌ను మించినవారు ఈ దేశంలో ఇక పుట్టరబోరని వ్యాఖ్యానించారు. ఏ రోకటి కాడ ఆపాట పాడే వ్యక్తి ఆయన అని విమర్శించారు.

మైనార్టీలకు 16నుంచి చెక్కులిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

లక్ష ఆర్థిక సాయం, ఓవర్ సీస్ స్కాలర్ షిప్‌లు, స్మశాన వాటికలకు స్థలాల కేటాయింపు, గౌరవ వేతనం పొందే ఇమామ్, మౌజంల సంఖ్య పెంపు, క్రిస్టియన్ స్మశాన వాటికలు, ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్ తదితర అంశాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ..స్మశాన వాటికలకు 125 ఎకరాల కేటాయింపు, గౌరవ వేతనం పొందే ఇమామ్‌లు-మౌజిన్‌ల సంఖ్య పెంపు వంటి రెండు హామీలను ప్రభుత్వం పూర్తి చేసిందని తెలిపారు. ఇప్పటికే కేటాయించిన రూ. 270 కోట్లకు అదనంగా, మరో రూ.130 కోట్లు కేటాయించి మొత్తం రూ.400 కోట్లను ఈ కార్యక్రమం అమలుకు కేటాయించాలని ఆర్థిక శాఖను ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో శ్మశాన వాటికలు, ఈద్‌గాల భూముల కోసం వచ్చిన మొత్తం వినతులను క్రోడీకరించాలనీ, ఈ దిశగా పనులు వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఒవైసీ పహాడీ షరీఫ్ దర్గా ర్యాంప్ పనులు, దర్గా బర్హ్నా షా అద్దెల సవరణ, క్రిస్టియన్ స్మశాన వాటికలు, ఆర్‌టీఎఫ్,ఎంటీఎఫ్ గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఇతర పనులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలనీ, అవసరమైన నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. షాదీ ముబారక్‌కు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి, లబ్దిదారులకు వెంటనే ఉపశమన సొమ్ము అందేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

డబుల్ ఇండ్ల సర్వేకు తొమ్మిదేండ్లు పడుతుందా!

(మొదటిపేజీ తరువాయి)



కింద ఇండ్లు ఇస్తామని 2005లో అప్పటి ప్రభుత్వం ఒక్కొక్కరి నుంచి రూ.వెయ్యి వసూలు చేసి.. నేటికీ ఇండ్లు ఇవ్వలేదన్నారు. వీరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో అవకాశం కల్పించకపోవడం సమంజసం కాదన్నారు. రాజీవ్ గృహకల్ప లబ్దిదారులకు ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రెండు నెలల్లోపు ఇండ్ల కేటాయింపు చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో కొంతమంది దళారులున్నారని.. డబుల్ ఇండ్ల కేటాయింపు పేరుతో లక్షల్లో వసూలు చేస్తున్నారని, అలాంటివి నమ్మి మోసపోవద్దని పేదలకు సూచించారు. దీనిపై కలెక్టర్, సంబంధిత అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.నాగలక్ష్మి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మురికివాడలు లేకుండా చేస్తానని.. అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు.

ఇండ్ల కోసం అవసరమైతే మరో పోరాటానికి అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మహేందర్, ఎం. దశరథ్ మాట్లాడుతూ.. తహసీల్దార్, ఆర్డీవో ఆఫీసుల్లో పెట్టుకున్న దరఖాస్తులను వెంటనే పరిశీలించాలని, రెండు నెలల్లో వాటిని పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.అనంతరం సీపీఐ(ఎం) ప్రతినిధులు కలెక్టర్‌రేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సునీల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్‌రావు, కె.ఎస్.రాజయ్య, సభ్యులు ఎం.అజయ్ బాబు, ఆర్.వెంకటేష్, సి.మల్లేష్, ఎస్.మారన్న, జి.కిరణ్, ఆర్.ఆశోక్, ఏ.పద్మ పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మందు పోయను... పైసలు పంచను

(మొదటిపేజీ తరువాయి)

ఆయన పర్యటించారు. ముందుగా వేములవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. చింతల్‌ఠాణా ఆర్అండ్ఆర్ కాలనీలో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా కేంద్రానికి చేరుకుని కలెక్టరేట్‌లో బీసీ బంధు చెక్కులను లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు.

'దేశంలో ఎక్కడా లేనివిధంగా 12లక్షల మందికి కల్యాణలక్ష్మి కింద నిధులిచ్చాం. రైతు బీమానే కాదు.. నేతన్న బీమా కూడా మొదలుపెట్టాం. సెప్టెంబర్‌లో సిరిసిల్లలో మెడికల్ కాలేజీని సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారు. ఓట్ల కోసం విపక్ష నేతలు వచ్చినప్పుడు 60ఏండ్లుగా చేయలేని వారు ఇప్పుడేం చేస్తారని నిలదీయండి' అంటూ ప్రజలను కోరారు. బిడ్డ కడుపులో పడిన దగ్గర నుంచి మొదలుకుంటే.. వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఏకైన సర్కారు కూడా తమదేనన్నారు. మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు కాపాడుకుంటారని, ఆ నమ్మకం తనకు పూర్తిస్థాయిలో ఉందని అన్నారు. 60ఏండ్లలో కనిపించని అభివృద్ధిని 10ఏండ్లలోనే రెండింతలు చేసిన తమ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. బతుకమ్మ పండుగలలోపు వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మంత్రి ఎర్రబెల్లి హామీతో సమ్మె విరమణ

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేసింది. లేదంటే మరోపోరాటానికి సన్నద్ధమవుతామని హెచ్చరించింది. సమ్మెను విరమిస్తున్నట్టు లేఖలు రాసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు, పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులకు జేఏసీ నేతలు అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్, సలహాదారులు ఎమ్‌డీ యూసుఫ్, కె.సూర్యం, కన్వీనర్లు పి.అరుణ్‌కుమార్, వెంకటరాజం, శివబాబు, ఎస్.దాసు, కారోబార్ల సంఘం ప్రతినిధి వి.వెంకటేశం, చాగంటి వెంకటయ్య మాట్లాడారు. 34 రోజుల సమ్మె కాలంలో ఎన్ని నిర్బంధాలు ఎదురైనా, ఒత్తిళు వచ్చినా, పోలీసులు బెదిరించినా ఐక్యంగా సమ్మె చేసిన పంచాయతీ కార్మికులందరికీ అభినందనలు తెలిపారు. సమ్మెకు సహకరించిన, మద్దతు తెలిపిన ప్రజలకు, స్థానిక ప్రజాప్రతినిధులకు, గ్రామకార్యదర్శులకు, మేధావులకు, పార్టీలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీలో అన్ని పార్టీలకు చెందిన 20 మందికిపైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న పోరాటం న్యాయసమ్మతమైనదే అని మాట్లాడటం కార్మికుల పోరాట విజయమేనన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగిందనీ, అందుకే మంత్రి ఎర్రబెల్లి చర్చలకు ఆహ్వానించారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు నేతృత్వంలో జేఏసీతో జరిగిన చర్చల్లో "గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో పంచాయతీ కార్మికుల శ్రమ వెలకట్టలేనిది. న్యాయమైన డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉంది. సమ్మె విరమించండి..కొంత టైం ఇవ్వండి. దీనికి మంత్రి హరీశ్‌రావు, నేనూ బాధ్యత తీసుకుంటాం. అవసరమైతే జేఏసీ నేతలను సీఎం దగ్గరకు తీసుకెళ్లి మాట్లాడిస్తాం" అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారని తెలిపారు. ఆయనపై నమ్మకం ఉంచి సమ్మె విరమించాలని జేఏసీలోని కార్మిక సంఘాలన్నీ నిర్ణయం తీసుకున్నాయని చెప్పారు. గ్రామపంచాయతీ కార్మికులకు చెందిన కుటుంబాల్లో 2.5 లక్షల ఓట్లున్నాయనీ, అవి వచ్చే ఎన్నికల్లో కీలకం కాబోతున్నాయని చెప్పారు. ప్రభుత్వం 15 రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే మరో పోరాటానికి సిద్ధమని ప్రకటించారు. సమ్మెకు తాత్కాలికంగానే విరామం ఇస్తున్నామనీ, ప్రభుత్వం మోసం చేస్తే అదే ఆయుధాన్ని మళ్లీ ఎక్కుపెడతామని హెచ్చరించారు. సమావేశంలో జేఏసీ నాయకులు పాలడుగు సుధాకర్, గ్యార పాండు, పి. గణపతిరెడ్డి, నర్సింహారెడ్డి, ఆర్కె. నాయుడు, మధుసూధన్‌రెడ్డి, వెంకట్రాములు, డి. యాదయ్య, జటంకి వెంకన్న, భాను తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం

డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతున్న 'దయా' వెబ్ సిరీస్‌కి విశేష ఆదరణ లభిస్తోంది. జేడీ చక్రవర్తి, ఈషా రెబ్బా, నంబీషన్ రమ్య, కమల్ కామరాజ్ తదితరులు కీ రోల్స్ చేసిన ఈ వెబ్ సిరీస్‌ను ఎస్వీఎఫ్ ప్రొడక్షన్స్‌లో శ్రీకాంత్ మొహతా, మహేంద్ర సోని నిర్మించారు. ఈ సిరీస్ సూపర్ హిట్టైన నేపథ్యంలో దర్శకుడు పవన్ సాధినేని తన సంతోషాన్ని మీడియాతో షేర్ చేసుకున్నారు.

"దయా' వెబ్‌సిరీస్‌కు వస్తున్న రెస్పాన్స్ సంతోషాన్నిస్తోంది. సినిమా ఫస్ట్ డే ఫస్ట్ షో చూసినట్లు స్ట్రీమింగ్ మొదలైనప్పటి నుంచి మా వెబ్ సిరీస్ చూస్తున్నారు. ప్రతి చోట నుంచీ మంచి రెస్పాన్స్ వస్తోంది.



పవన్ సాధినేని

అంతకుమించి దయా పార్ట్ 2

జేడీ చక్రవర్తిని దయా అని పిలుస్తున్నారు. ఇండస్ట్రీ నుంచైతే చాలా కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయి. బెంగాలీ వెబ్ సిరీస్ తక్‌ధీర్ నుంచి ఇన్‌స్పైర్ అయి ఈ కథ రాసుకున్నాను. అయితే తక్‌ధీర్‌లో ఇంత విస్తృతమైన కథ ఉండదు. రిపోర్టర్, దయా అసిస్టెంట్ ఇలా..ఇన్ని క్యారెక్టర్స్ ఉండవు. ఆ వెబ్ సిరీస్ నుంచి కేవలం అంబులెన్స్ డ్రైవర్‌కు డెడ్ బాడీ దొరకడం అనే అంశాన్ని మాత్రమే సెలెక్ట్ చేసుకున్నాను. మిగతా అంతా నేను రాసుకున్నదే. జేడీకి ఉన్న అనుభవంతో దర్శకుడి విజన్ తెలుసుకోగలరు. ఈ సిరీస్‌లో మీరు చూసిందంతా ఒక గ్లింప్స్ మాత్రమే. దయా, అలివేలు క్యారెక్టర్స్ మెయిన్‌గా చూశారు. అసలైన కథ, ట్విస్ట్‌లు సెకండ్ సీజన్‌లో ఉంటాయి. మేము ఎక్స్‌పెక్ట్ చేసినట్లే ఫస్ట్ భాగం మంచి హిట్ అయ్యింది. ఇక సెకండ్ సీజన్‌ను మరింత పెద్ద స్పాన్‌లో ఇంకా ఇంట్రెస్టింగ్‌గా చేయబోతున్నాం. దయా సీజన్1కు డబుల్ స్కేల్‌లో సీజన్2 ఉంటుంది. స్క్రిప్ట్ మొత్తం సిద్ధమైంది. గీతా ఆర్ట్స్‌లో నా డ్రీమ్ ప్రాజెక్ట్ చేయబోతున్నా' అని దర్శకుడు పవన్ సాధినేని తెలిపారు.

చిరంజీవి నటిస్తున్న మాస్-యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రామబ్రహ్మం సుంకర భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ సినిమా ఈనెల 11న

ఇంకా ఆ డ్రీమ్‌లోనే ఉన్నా..



మెహర్ రమేష్

విడుదల కానున్న నేపథ్యంలో డైరెక్టర్ మెహర్ రమేష్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

'అన్నయ్యని డైరెక్ట్ చేయడం ఒక డ్రీమ్. ఇప్పటికీ ఆ డ్రీమ్‌లోనే ఉన్నాను. ఈనెల 11న ఆ డ్రీమ్ రిలీజ్ అవుతుంది. చిన్నప్పటి నుంచి అన్నయ్యని, ఆయన సినిమాలని చూస్తూ ఆయన్ని ఇలా చూపించాలని ప్రతి క్షణం తపనపడుతూ ఈ సినిమా తీశాం. అన్నయ్య ఇచ్చిన ఎనర్జీతో సినిమా మొత్తం అయిపోయింది. అన్నయ్య కూడా చాలా ఎంజాయ్ చేశారు. దర్శకుడికి ఏం కావాలో అన్నయ్యకి బాగా తెలుసు. ఇందులో నా ఒక్కడికే దక్కిన అదృష్టం ఏమిటంటే నేను అన్నయ్య కజిన్. ఇప్పుడు ఆయన్ని డైరెక్ట్ చేసి ఆయనతో 'బావుందిరా' అనిపించుకున్నాను. ఇలాంటి అదృష్టం అందరికీ దక్కదు. నేను డైరెక్టర్ అయ్యిందే ఈ సినిమా చేయడానికేమో. ఇది పెద్ద అచీవ్ మెంట్.

దీని తర్వాత చేసేదంతా బోనస్. ఈ సినిమా విషయంలో అన్నయ్య సలహాలు సూచనలు ఖచ్చితంగా ఉంటాయి. రీమేక్ సినిమా అయినప్పటికీ ఆయనకి నచ్చితేనే ఆమోదముద్ర పడుతుంది. ఏదైనా కొత్తగా చేస్తే చాలా చక్కగా ప్రశంసిస్తారు. చాలా విలువైన ఇన్‌పుట్స్ ఇస్తారు. ముఖ్యంగా 'వేదాళం' రీమేక్ చేయడానికి కారణం ఏంటంటే ఇందులో అన్నయ్య తత్త్వం ఉంది. అది నాకు చాలా నచ్చింది. జనరేషన్ మారిపోయినా అనుబంధాలు అలానే ఉన్నాయి. యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు బ్రదర్, సిస్టర్ ఎమోషన్ ఉన్న కథ ఇది. నేను ఇలాంటి సబ్జెక్ట్‌ని ఎప్పుడూ డీల్ చేయలేదు. చిరంజీవి ఇమేజ్‌కి తగ్గట్టుగా ఇందులో మార్పులు చేశాం. సెకండ్ హాఫ్ చిరంజీవికి ఇచ్చిన ట్రీట్ కంప్లీట్ డిఫరెంట్‌గా ఉంటుంది. మహతి సాగర్ వర్క్ నాకు తెలుసు. మెగాస్టార్ స్థాయికి సాగర్ మ్యూజిక్ చేయగలడని నా నమ్మకం, ఈ విషయంలో గొప్పదనం అంతా అన్నయ్యదే. సాగర్ పేరు చెప్పినపుడు మరో ఆలోచన లేకుండా 'వెరీ గుడ్ మనం ప్రోత్సాహించాలి' అని అన్నారు. సాగర్ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు' అని దర్శకుడు మెహర్ రమేష్ చెప్పారు.

భిన్న కాన్సెప్ట్‌తో సూర్యాపేట్ జంక్షన్



యోగ లక్ష్మీ ఆర్ట్స్ క్రియేషన్స్ పతాకంపై ఈశ్వర్, నయన సర్వార్ హీరో హీరోయిన్స్‌గా అభిమన్యు సింగ్ ముఖ్య పాత్రలో ఆర్.ఎక్స్ 100 ఫేమ్ పూజా ఐటమ్ సాంగ్‌లో చేస్తున్న చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. ఈ సినిమాలోని మూడవ సాంగ్‌ని ప్రొడ్యూసర్ సి.కళ్యాణ్ చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. సి.కళ్యాణ్ మాట్లాడుతూ, "చెంగు చెంగు..' అంటూ సాయిచరణ్ పాడిన టీజింగ్ సాంగ్ చాలా బాగుంది. హీరో ఈశ్వర్, హీరోయిన్ నయన సర్వార్ ఈ పాటకు డాన్స్ బాగా చేశారు. డైరెక్టర్ విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సినిమా స్టోరీ ఎంచుకుని చాలా బాగా తీశారు. కొరియోగ్రాఫర్ ఈశ్వర్‌తో స్టెప్స్ బాగా చేయించాడు. రోషన్ సాలూరి మ్యూజిక్ కూడా బాగుంది. హీరో ఈశ్వర్‌కి ఈ చిత్రంతో మంచి హిట్ రావాలి' అని అన్నారు.

'మా సినిమాలోని రెండవ పాటని సి.కళ్యాణ్ చేతుల మీదుగా విడుదల చేయటం ఆనందంగా ఉంది. ఆయన బిజీ టైమ్‌లో కూడా అడిగిన వెంటనే సాంగ్ విడుదల చేయడానికి ఒప్పుకుని మూవీ కంటెంట్ చూసి ఇది మంచి సినిమా అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడవ సాంగ్ విడుదల చేసినందుకు మా టీమ్ తరపున కళ్యాణ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు' అని హీరో ఈశ్వర్ అన్నారు.

డైరెక్టర్ రాజేష్ నాదెండ్ల మాట్లాడుతూ, 'ఇప్పటికే విడుదలైన టీజర్, ఐటమ్ సాంగ్‌కి ప్రేక్షకుల నుండి మంచి స్పందన లభించింది. హీరో ఈశ్వర్ హీరోయిన్‌ని టీజింగ్ చేసే ఈ మాస్ సాంగ్ అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు.

నిర్మాతలు మాట్లాడుతూ, 'మా చిత్రాన్ని త్వరలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం. మిగిలిన అప్డేట్స్ త్వరలో తెలియజేస్తాం. ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే సినిమా ఇది. సినిమా అవుట్‌పుట్ చాలా బాగా వచ్చింది. కచ్చితంగా ఈ చిత్రం విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.

ప్రచండ సూర్య!

సూర్యకుమార్ యాదవ్ (83), తిలక్ వర్మ (49 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌లతో చెలరేగారు. 160 పరుగుల ఛేదనలో మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు ఇద్దరూ అదరగొట్టడంతో.. మూడో టీ20లో వెస్టిండీస్‌పై భారత్ ఘన విజయం సాధించింది. 17.5 ఓవర్లలోనే లాంఛనం ముగించిన టీమ్ ఇండియా సిరీస్‌లో 1-2తో బోణీ కొట్టింది. ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో నాల్గో టీ20 శనివారం లాడర్‌హిల్ (అమెరికా)లో జరుగనుంది.

- మూడో టీ20లో భారత్ గెలుపు
- 1-2తో సిరీస్‌పై ఆశలు సజీవం



నవతెలంగాణ-ప్రావిడెన్స్

భారత్ గెలిచింది, సిరీస్‌లో నిలిచింది. సూర్యకుమార్ యాదవ్ (83, 44 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు), తిలక్ వర్మ (49 నాటౌట్, 37 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) ఛేదనలో చెలరేగారు. కెప్టెన్ హార్దిక్ పాండ్య (20 నాటౌట్, 15 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) రాణించటంతో 17.5 ఓవర్లలోనే టార్గెట్ ఛేదించిన టీమ్ ఇండియా.. ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (1), శుభ్‌మన్ గిల్ (6) నిరాశపరిచారు. అంతకముందు తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 159/5 పరుగులు చేసింది. భారత్‌కు 160 పరుగుల సవాల్‌తో కూడిన లక్ష్యాన్ని నిర్దేశించింది. ఓపెనర్ బ్రాండన్ కింగ్ (42, 42 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ రోవ్‌మాన్ పావెల్ (40 నాటౌట్, 19 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించారు. కైల్ మేయర్స్ (25, 20 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), నికోలస్ పూరన్ (20, 12 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) విలువైన ఇన్నింగ్స్‌లు ఆడారు. భారత బౌలర్లలో చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (3/28) మూడు వికెట్లు పడగొట్టాడు. సూర్యకుమార్ యాదవ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

సూర్య, తిలక్ షో : ఛేదనలో ఓపెనర్లు యశస్వి (1), గిల్ (6) విఫలమయ్యారు. సూర్యకుమార్ యాదవ్ (83), తిలక్ వర్మ (49)మూడో వికెట్‌కు భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. ఫామ్‌లోకి వచ్చిన సూర్య తనదైన శైలిలో వికెట్ల వెనకాల, ముందూ బౌండరీల వర్షం కురిపించాడు. 10 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో శివమెత్తాడు. 23 బంతుల్లోనే అర్ధ సెంచరీ బాదిన సూర్యకుమార్.. భారత్‌ను గెలుపు బాటలో నడిపించాడు. మరో ఎండ్‌లో తిలక్ వర్మ (49 నాటౌట్) ఆకట్టుకున్నాడు. వరుసగా మూడో టీ20లో బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో సూర్య నిష్క్రమించినా.. కెప్టెన్ హార్దిక్ (20 నాటౌట్) తోడుగా తిలక్ లాంఛనం ముగించాడు. తిలక్ వర్మ మరో ఎండ్‌లో అర్ధ సెంచరీకి పరుగు దూరంలో నిలువగా.. విండీస్ కెప్టెన్ పావెల్ ఓవర్లో సిక్సర్‌తో హార్దిక్ పాండ్య సిరీస్‌లో భారత్‌కు బోణీ విజయాన్ని అందించాడు.

స్కోరు వివరాలు :

వెస్టిండీస్ ఇన్నింగ్స్ :159/5 (బ్రాండన్ కింగ్ 42, రోవ్‌మాన్ పావెల్ 40, కుల్దీప్ యాదవ్ 3/28, అక్షర్ పటేల్ 1/24)

భారత్ ఇన్నింగ్స్ : 164/3 (సూర్యకుమార్ యాదవ్ 83, తిలక్ వర్మ 49, హార్దిక్ 20, జొసెఫ్ 2/25)



మరిన్ని టెస్టులు అవసరం

భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్

ముంబయి : భారత మహిళల జట్టు మరిన్ని టెస్టులు ఆడాల్సిన అవసరం ఉందని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అభిప్రాయపడ్డారు. 2022-25 ఎఫ్‌టీపీలో భారత్ రెండు టెస్టులే ఆడనుండగా.. ఇంగ్లాండ్ (5), ఆస్ట్రేలియా (4), దక్షిణాఫ్రికా (3) ఎక్కువ మ్యాచులు ఆడుతున్నాయి. ' ఓ క్రీడాకారిణిగా ఎక్కువ టెస్టులు ఆడాలని అనుకుంటాను. ఎందుకంటే చిన్నప్పటి నుంచి టీ20, వన్డేల కంటే టెస్టు క్రికెటే ఎక్కువగా చూశాం. వైట్‌బాల్ క్రికెట్ వినోదభరితమే కానీ టెస్టు క్రికెట్ ప్రతి క్రికెటర్ కోరుకునేది. భారత్ రెండు టెస్టులే ఆడనుంది. స్వదేశంలో ఆసీస్, ఇంగ్లాండ్‌లపై రెడ్ బాల్ క్రికెట్ ఆడనున్నాం. మహిళల క్రికెట్‌లో టెస్టు మ్యాచులను మరిన్ని పెంచాలి. దేశవాళీ క్రికెట్‌లోనూ పరిస్థితులు గుణాత్మకంగా మారాయి. ఫస్ట్ క్లాస్ మ్యాచులను మహిళలకు సైతం షెడ్యూల్ చేయాలి' అని హర్మన్‌ప్రీత్ కౌర్ అన్నారు. భారత్‌కు 127 వన్డేలు, 154 టీ20ల్లో ఆడిన హర్మన్.. కేవలం మూడు టెస్టుల్లోనే కనిపించింది.



వరల్డ్ అథ్లెటిక్స్‌కు జ్యోతి ఎర్రాజి

హైదరాబాద్ : ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో తెలుగు తేజం జ్యోతి ఎర్రాజి పోటీపడనుంది. ఈ మేరకు కేంద్ర క్రీడాశాఖ 28 మంది అథ్లెట్లకు వరల్డ్ అథ్లెటిక్స్ ఖర్చులను భరించనున్నట్టు వెల్లడించింది. మహిళల 100 మీ హార్డిల్స్‌లో జ్యోతి ఎర్రాజి పతకం కోసం పోటీపడనుంది. 28 మంది అథ్లెట్లలో 13 మంది టాప్స్ అథ్లెట్లు కాగా.. 15 మంది తొలిసారి ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో పోటీపడనున్నారు. నీరజ్ చోప్రా, శాలిని సింగ్, అన్నూ రాయ్, పారుల్ చౌదరి, శ్రీశంకర్‌లు భారత అథ్లెటిక్స్ జట్టులో ఉన్నారు. ఆగస్టు 19 నుంచి బుడాపెస్ట్ (హంగరీ)లో జరుగనున్న వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌కు భారత్ 42 మందితో కూడిన (సహాయక సిబ్బంది సహా) బృందాన్ని పంపించనుంది.



సింధు వరల్డ్ నం.15 డబ్ల్యూబిఎఫ్ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ : ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ షట్లర్ పి.వి సింధు రెండు స్థానాలు మెరుగైంది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో క్వార్టర్స్‌కు చేరిన సింధు రెండు స్థానాలు ఎగబాకి 15వ స్థానంలో నిలిచింది. కిదాంబి శ్రీకాంత్ మాత్రం 20వ స్థానంలోనే నిలిచాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్స్‌కు చేరిన హెచ్.ఎస్ ప్రణయ్, యువ షట్లర్ లక్ష్యసేన్ మెన్స్ సింగిల్స్‌లో వరుసగా 9, 11వ స్థానాల్లో కొనసాగుతున్నారు. ప్రియాన్షు రజావత్ మూడు స్థానాలు మెరుగై 28వ స్థానంలో, మిథున్ మంజునాథ్, కిరణ్ జార్జ్‌లు 43, 49వ స్థానాల్లో నిలిచారు. మెన్స్ డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ రెండో స్థానం నిలుపుకుంది. ట్రెసా జాలీ, గాయత్రి జంట మహిళల డబుల్స్‌లో 19వ స్థానానికి పడిపోయింది.



గోల్కొండలోనే స్వాతంత్ర్య వేడుకలు

ఏర్పాటు చేయండి : అధికారులకు సీఎస్ శాంతికుమారి ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

స్వాతంత్ర దినోత్సవ వేడుకలను చారిత్రాత్మక గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. మంగళవారంనాడామె డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. డీజీపీ అంజనీ కుమార్, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెూమ్ శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, ఆరోగ్య శాఖ కార్యదర్శి ఎస్ఏఎమ్ రిజ్వి, జీఏడీ కార్యదర్శి శేషాద్రి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఆగస్టు 15న గోల్కొండ కోటలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు జాతీయ పతాకావిష్కరణ చేస్తారనీ, దానికంటే ముందు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో అమర వీరుల స్మారక స్థూపం వద్ద స్వతంత్ర సమర యోధులకు శ్రద్ధాంజలి ఘటిస్తారని తెలిపారు. 15వ తేదీ ఉదయం గోల్కొండ కోటలో ఉదయం 10.30 గంటలకు జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం ఉంటుందని వివరించారు. ఈ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలన్నీ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లోని అమర వీరుల స్మారక స్థూపం వద్ద ఆర్మీ జీఓసీ అధికారులతో సమన్వయం చేసుకొని, తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీస్, రోడ్లు, భవనాలు, సమాచార శాఖ, జీహెచ్ఎంసీ, విద్యుత్, రవాణా తదితర శాఖలు తమ శాఖ పరమైన ఏర్పాట్లను చేపట్టాలని అన్నారు. సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కేంద్రం గుప్పెట్లోకి గ్రంథాలయాలు

రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాలోకి లైబ్రరీలు

- బిల్లు తెచ్చేందుకు కేంద్రం యోచన
- సమాఖ్య వ్యవస్థపై పోటు
- సంఘ్‌పరివార్ ఎజెండాను అమలకు యత్నం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గ్రంథాలయాలను త్వరలో కేంద్ర ప్రభుత్వ గుప్పెట్లోకి తీసుకోనున్నది. రాష్ట్ర సార్వభౌమాధికారంలోని అంశాల్లోకి చొరబడేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నంగా, సమాఖ్య వ్యవస్థపై పోటుగా పలువురు దీనిని పరిగణిస్తున్నారు. గ్రంథాలయాల పనితీరులో జోక్యం చేసుకోవడానికి, సంఘ్ పరివార్ భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి విస్తృత ఎజెండాలో భాగమే ఈ చర్య అని చాలా మంది అభిప్రాయపడ్డారు. పుస్తకాలు, ప్రచురణలతో సంఘ్ పరివార్ ఎజెండాను ప్రచారం చేసేందుకే ఈ చర్య తీసుకున్నట్లు కేంద్రం ప్రకటించింది. రాష్ట్రాల పరిధిలోని లైబ్రరీల వ్యవస్థను ఉమ్మడి జాబితా (కాంకరెంట్ లిస్ట్)కి బదిలీ చేసేందుకు, తన పరిధిలోకి తీసుకునేందుకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ త్వరలో పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టనుంది.



ఢిల్లీలో జరిగిన రెండు రోజుల 'ఫెస్టివల్ ఆఫ్ లైబ్రరీస్-2023'లో దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన గ్రంథాలయాల ప్రతినిధులు హాజరైన సందర్భంగా, లైబ్రరీలను ఉమ్మడి జాబితాకు బదిలీ చేయడంపై చర్చలు జరిగాయి. రాజా రామ్మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అజయ్ ప్రతాప్ సింగ్ లైబ్రరీ లను సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోకి తీసుకు రావాలనే ప్రభుత్వ సంకల్పానికి సంకేతాలు ఇచ్చారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర గ్రంథాల యాలను తీర్మానం చేసి కేంద్ర మంత్రిత్వ శాఖ పరిశీలనకు సమర్పిం చాలని కోరినట్టు సమాచారం. ఈ సమావేశానికి ఏపి నుంచి ఎవరూ హాజరు కాలేదు. తెలంగాణ నుంచి గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ ఆయాచితం శ్రీధర్, 14 జిల్లాల గ్రంథాలయ చైర్మెన్లు పాల్గొన్నారు.

దేశంలో 46,746 లైబ్రరీలు

దేశం వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 46,746 లైబ్రరీలు ఉన్నాయి. అందులో మహారాష్ట్రలో అత్యధికంగా 12,191 లైబ్రరీలు ఉన్నాయి. కేరళలో 8,415, కర్నాటకలో 6,798, తమిళనాడులో 4,622, గుజరాత్‌లో 3,464 లైబ్రరీలు ఉండగా, ఏపీలో 978, తెలంగాణలో 672 లైబ్రరీలు ఉన్నాయి. ఏపీలో 13 జిల్లా, 4 డివిజనల్, 178 సిటీ, టౌన్, 782 గ్రామీణ లైబ్రరీలు ఉన్నాయి. తెలంగాణలో ఒక స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, 31 జిల్లా, రెండు డివిజనల్, 537 సిటీ, టౌన్, 99 గ్రామీణ, రెండు ఎన్‌జిఓ, ట్రస్ట్‌లు నడుపుతున్న లైబ్రరీలు ఉన్నాయి.

తీవ్రంగా వ్యతిరేకించిన కేరళ

లైబ్రరీలను ఉమ్మడి జాబితాకు బదిలీ చేయడాన్ని కేరళ ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. ఈ కార్యక్రమానికి హాజరైన కేరళ స్టేట్ లైబ్రరీ కౌన్సిల్ కేంద్రం నిర్ణయంపై నిరసన వ్యక్తం చేసింది. కేరళ ఉన్నత విద్యాశాఖ మంత్రి ఆర్. బిందు కేంద్రం చర్యపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో విభేదించారు. కేరళలో లైబ్రరీ వ్యవస్థలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన పాలనా వ్యవస్థ ఉందని, లైబ్రరీ వ్యవస్థను ఉమ్మడి జాబితాలో చేర్చడంతో ప్రజాస్వామ్య స్వభావాన్ని, వైవిధ్యాన్ని తొలగించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇది రాష్ట్రాల అధికారాలు, గ్రంథాలయాల స్వాతంత్ర్యానికి భంగం కలిగించడమేనని మంత్రి అన్నారు. ఇది రాష్ట్రంలోని లైబ్రరీలు స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వస్తే గ్రంథాలయాలు స్వయం ప్రతిపత్తిని కోల్పోతాయని అన్నారు. పుస్తకాలు కొనుగోలు చేసేందుకు నిధుల పంపిణీలో కూడా వివక్ష చూపే అవకాశం ఉందని తెలిపారు. అదే సమయంలో భారతదేశ ప్రాచీన సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పడంతోపాటు గ్రంథాలయాలను ఆధునీకరించే ప్రయత్నంలో భాగంగానే ఈ చర్య తీసుకున్నట్టు కేంద్రం ప్రకటించింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథాలయ ఉద్యమం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్ లైబ్రరీలు మునిసిపల్ కార్పొరేషన్లు, గ్రామ పంచాయితీలు, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలచే నిర్వహించబడు తున్నాయి. 1956లో అవిభక్త రాష్ట్రం ఏర్పడినప్పుడు ఆంధ్ర ప్రాంతంలోని 11 జిల్లాల్లో మద్రాసు పౌర గ్రంథాలయాల చట్టం, తెలంగాణ ప్రాంతంలోని తొమ్మిది జిల్లాల్లో హైదరాబాద్ పబ్లిక్ లైబ్రరీస్ చట్టం అమలులో ఉన్నాయి. సమ్మిళిత చట్టం కోసం, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ లైబ్రరీస్ చట్టం 1960లో రూపొందించబడింది. ఈ చట్టం 1964, 1969, 1987, 1989, 2016లో వరుసగా సవరించబడింది. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత, తెలంగాణ గ్రంథాలయాల కోసం ప్రత్యేక చట్టం రూపొందించబడింది. ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథాలయ ఉద్యమం అన్ని ప్రాంతాలకు విస్తరించిన ప్రజా ఉద్యమంగా మారింది. ఆంధ్రాలో పబ్లిక్ లైబ్రరీ ఉద్యమం విజయం 19వ శతాబ్దం ప్రారంభంలో జరిగింది. తరువాతి దశాబ్దాలలో ఇది క్రమంగా పెరి గింది. 1800లో పరవస్తు కుటుంబానికి చెందిన ఒక ప్రయివేట్ లైబ్రరీ ప్రజల కోసం తెరవబడింది. ఇది తరువాత ఆర్ష గ్రంథాలయంగా అభివృద్ధి చేయబడింది. రాజా రామేశ్వర రాయలు (1821-1865) లైబ్రరీ కూడా వనపర్తి, మహబూబ్‌నగర్‌లలో ప్రజలకు తెరిచారు.

గిరిజనాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పోడుభూముల పట్టాల పంపిణీలో దేశంలోనే అగ్రస్థానం : మంత్రి సత్యవతి రాథోడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజనుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని గిరిజన స్త్రీ - శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిపుత్రులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదనీ, ప్రత్యేకంగా గిరిజనులకు ప్రాధాన్యతనిస్తున్నదని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గిరిజనుల వెనుకబాటును తొలగించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని తెలిపారు. ఆదివాసులకు అన్ని మౌలికవసతులు కల్పించడానికి రూ.కోట్ల నిధులను మంజూరు చేసిందని వెల్లడించారు.

ఆర్టీసీ కార్మికుల హయ్యర్ పెన్షన్ పెనాల్టీలు నివారించండి

- ఎమ్‌డీ సజ్జనార్‌కు ఎస్‌డబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కమిషనర్ కార్యాలయం నుంచి హయ్యర్ పెన్షన్‌కు అనుమతిస్తూ ఆర్టీసీ కార్మికులకు పంపిన డిమాండ్ నోటీసులపై పెనాల్టీలను నివారించాలని టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించినట్టు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు తెలిపారు. పీఎఫ్ కార్యాలయం నుంచి డిమాండ్ నోటీసు అందాక అనుమతి పత్రాలు ఇచ్చిన కార్మికుల ఖాతాల నుంచి తక్షణం నగదు బదిలీలు చేయాలని కోరారు. ఆలస్యం అయితే నెలకు పెనాల్టీల రూపంలో ఆర్టీసీ కార్మికులపై ఆర్థికభారం పడుతుందనీ, యాజమాన్యం దీన్ని నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 31లోపు దరఖాస్తులు సమర్పిస్తే సంస్థలోని 43,373 మంది కార్మికులపై రూ.15 కోట్లు, సెప్టెంబర్ 30 లోపు సమర్పిస్తే రూ.30 కోట్లు చొప్పున పెనాల్టీలు పడతాయని ఉదహరించారు. అందువల్ల వీటిని నివారిస్తూ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా
సెప్టెంబరు 1 నుంచి నిరసన వారం

సీపీఐ(ఎం) కేంద్రకమిటీ పిలుపు

- మణిపూర్ సీఎం రాజీనామా చేయాలి
- సమాఖ్యవ్యవస్థపై దాడులను తిప్పికొట్టాలి





న్యూఢిల్లీ : ధరల పెరుగుదలకు నిరసనగా, ఉపాధి కల్పన కోరుతూ సెప్టెంబరు 1 నుంచి 7 వరకు దేశవ్యాప్తంగా అన్ని పార్టీ శాఖలు నిరసన వారం పాటించాలని సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ ఈ నెల 4-6 తేదీల్లో న్యూఢిల్లీలో సమావేశమై పలు అంశాలపై చర్చించింది. అనంతరం ఒక ప్రకటన జారీ చేసింది.

మణిపూర్

మణిపూర్‌లో మతవిద్వేషంతో కూడిన జాతి ఘర్షణలు గత మూడు మాసాలకు పైగా కొనసాగుతుండడం పట్ల కేంద్ర కమిటీ తన తీవ్ర అసమ్మతిని తెలియజేస్తోంది. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు వందలాదిమంది చనిపోయారు. వేలాది మంది నిర్వాసితులై, అమానవీయ పరిస్థితుల్లో సహాయ శిబిరాల్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వ దోషి అనేది సుస్పష్టం. ప్రధాని మోడీ మౌనం వహించడం, కేంద్ర ప్రభుత్వం చేష్టలుడిగినట్టు వ్యవహరించడం చూస్తుంటే మణిపూర్‌ను మరింతగా అరాచకత్వంలోకి, మారణ హోమంలోకి నెట్టేలా ఉంది. కేంద్ర ప్రభుత్వ ఉదాసీనత ఏ స్థాయిలో ఉందో ఇది తెలియజేస్తోంది. పార్లమెంట్‌కు జవాబుదారీ వహించాల్సిన బాధ్యతను విస్మరించే వైఖరిని ప్రధాని మోడీ ఎంచుకున్న ఫలితంగా, పార్లమెంటరీ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించాయి. మణిపూర్ ఘర్షణలు ఈశాన్య ప్రాంతంలోని సమీప రాష్ట్రాలకు విస్తరిస్తుండడమనేది అత్యంత తీవ్రమైన పర్యవసానాలు కలిగివుంది. శాంతి, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించేందుకు మొదటి చర్యగా ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ రాజీనామా చేయాలని కేంద్ర కమిటీ డిమాండ్ చేసింది.

పెచ్చరిల్లుతున్న మతోన్మాద పోకడలు

హర్యానా మత హింస : నుహ్‌లో ప్రారంభమై, గురుగావ్, ఇతర ప్రాంతాలకు విస్తరించడం ద్వారా మేవాట్ ప్రాంతంలో చెలరేగిన మతోన్మాద హింసాకాండ నేపథ్యంలో హర్యానా బీజేపీ ప్రభుత్వం అనుసరించిన దారుణమైన బుల్డోజర్ రాజకీయాలను కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ హింసకు పాల్పడిన దోషులు, రెచ్చగొట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి బదులుగా హర్యానా రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం మైనారిటీ కమ్యూనిటీని లక్ష్యంగా చేసుకుంటోంది. ముస్లింలకు చెందిన దుకాణాలు, ఇండ్లను ధ్వంసం చేసే చర్యలను పెద్ద ఎత్తున అమలు చేస్తోంది. వీరిలో చాలామంది చట్ట పరమైన యాజమాన్య పత్రాలను కలిగి వున్నారు. కొంతమంది కోర్టు స్టే ఉత్తర్వులను కూడా తెచ్చుకున్నారు. అయిన ప్పటికీ, వాటితో సం బంధం లేకుండా బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం వీరి ఆస్తులను ధ్వంసం చేసే చర్యలకు దిగింది. అయితే, గతనాలుగు రోజులుగా సాగుతున్న ఈ కాల్చివేతలు, విధ్వంసకాండను నిలుపు చేయాలంటూ పంజాబ్, హర్యానా హైకోర్టు స్టే విధించింది.

విద్వేష నేరాలు

రైల్వే రక్షక దళానికి చెందిన కానిస్టేబుల్ ఒక అధికారిని, ముగ్గురు ముస్లిం ప్రయాణికులను దారుణంగా హతమార్చడం అత్యంత అమానవీయమైన విద్వేష నేరం. ముస్లిం కమ్యూనిటీని రాక్షసులుగా చిత్రీకరిస్తూ బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ నేతలు సాగించే విషపూరితమైన విద్వేష ప్రసంగాలు, ప్రచారం ఫలితంగా ఇటువంటి నేరాలు పెరుగుతున్నాయి. హిందూత్వ శక్తుల విషపూరితమైన ఎజెండా భారతీయ రిపబ్లిక్ లౌకిక, ప్రజాతంత్ర స్వభావాన్ని ధ్వంసం చేస్తోంది, గర్హనీయమైన ఈ ఘటన భారత్‌కు ఒక మేల్కొలుపు వంటిది.

జ్ఞానవాపి మసీదు వివాదం

ఆరాధనా స్థలాల చట్టం-1991ని అత్యు న్నత స్థాయిలోని న్యా య వ్యవస్థ కఠినంగా ఎందుకు అమలు చేయడం లేదన్నది ఒక అంతు చిక్కని రహస్యంగా వుందంటూ కేంద్ర కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. స్వాతంత్ర్యం లభించిన తర్వాత దేశంలోని ఆరాధనా స్థలాలకు సంబంధించి యథాతథ స్థితిని పరిరక్షించాలని ఈ చట్టం పేర్కొంటోంది. దీని నుంచి ఏకైక మినహాయింపు అయోధ్య. ఈ చట్టం చేసే సమయంలో అయోధ్య వివాదం కోర్టు కార్యకలాపాల పరిధిలో వుండడం వల్ల ఆ మినహాయింపు ఇవ్వడం జరిగింది.. జ్ఞానవాపి మసీదు ఆవరణలో సర్వే నిర్వహించేందుకు ఎఎస్‌ఐని అనుమతిస్తూ అలహాబాద్ హైకోర్టు ఈ నెల 3న ఉత్తర్వులు జారీ చేసింది. 1991 ప్రార్థనా స్థలాల చట్టం చెల్లుబాటును పదే పదే సమర్థిస్తూ వచ్చిన సుప్రీం కోర్టు కూడా ఈ సర్వేను ఆపేందుకు ఎలాంటి యత్నం చేయలేదు. ఈ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాల్సిందేనని కేంద్ర కమిటీ డిమాండ్ చేసింది.

> **సమాఖ్యవాదంపై దాడులు**
>
> ఆర్థిక సమాఖ్యవాదం : రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక స్వేచ్ఛను మరింతగా కుదించేలా పబ్లిక్ బారోయింగ్స్ (పబ్లిక్ రుణాల) నిర్వచనాన్ని మోడీ ప్రభుత్వం ఇటీవల మార్చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే బడ్జెట్‌లో లేని రుణాలను, అదనపు బడ్జెట్ రుణాలను ఇప్పుడు ప్రభుత్వ రుణాల జాబితాలో భాగంగా పరిగణిస్తారు.. అయితే, ఇది కేంద్రం తీసుకునే పబ్లిక్ రుణాలకు వర్తించదు. పైగా, వెనుకటి కాలం నుంచి కూడా దీనిని వర్తింపచేస్తున్నారు. కేరళ వంటి రాష్ట్రానికి, 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.17,310కోట్లు కొరత ఏర్పడనుంది. ఫలితంగా రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బడ్జెట్‌లో పెద్ద ఎత్తున లోటు ఏర్పడుతుంది. ఇది, రాష్ట్ర హక్కులపై తీవ్రంగా దాడి చేయడమే.

ఢిల్లీ ఆర్డినెన్స్

అధికార యంత్రాంగంపై నియంత్రణతో సహా పాలనకు సంబంధించిన ప్రధాన రంగాలపై, ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వానికి గల హక్కులను సమర్థిస్తూ ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇటీవల ఇచ్చిన సుప్రీం తీర్పును రద్దు చేస్తూ అత్యంత నిరంకుశమైన ధోరణిలో, మోడీ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. ఇది కోర్టు ధిక్కారమే కాకుండా, రాజ్యాంగం సమాఖ్య స్వభావంపై, సుప్రీం కోర్టు నిర్వచించినట్లుగా జవాబుదారీ, ప్రజాస్వామ్య పాలన నిబంధనలపై నేరుగా దాడి చేయడం కూడా. లోక్‌సభలో తనకున్న అధిక మెజారిటీని ఉపయోగించుకుని, రాజ్యసభలో బీజేడీ, వైఎస్‌ఆర్‌సీపీ వంటి ప్రాంతీయ పార్టీల మద్దతుతో మోడీ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చింది. జాతీయ ఆస్తులు లూటీ: కార్పొరేట్-మతతత్వ శక్తులు కుమ్మక్కయి జాతీయ ఆస్తుల లూటీకి చట్టబద్ధత కల్పించేలా కొత్త చట్టాలను తీసుకొస్తోంది. పార్లమెంట్ కార్యకలాపాలకు అంతరాయాలను ఉపయోగించుకుని జాతీయా ఆస్తుల ప్రయివేటీకరణకు వీలు కల్పించే కీలకమైన బిల్లులను ఆమోదింపజేసుకుంది. వీటిల్లో అభివృద్ధి పేరుతో అన్నింటికీ మినహాయింపును అందచేసే అటవీ (సంరక్షణ) సవరణ బిల్లు, 2023 వుంది. జాతీయాస్తులను కొల్లగొట్టడానికి కార్పొరేట్లకు ఇది సాయపడుతుంది. పర్యవసానంగా చోటు చేసుకునే అడవుల నరికివేత దేశంలో వాతావరణ మార్పులపై చాలా తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుంది. గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు, 2023ని కూడా ఆమోదించారు. లిథియంతో సహా కీలకమైన, విలువైన ఖనిజ వనరులను ప్రయివేటుగా తవ్వుకోవడానికి ఈ బిల్లు వీలు కల్పిస్తోంది. తీర ప్రాంతాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు, 2023ని ఆమోదించారు. ప్రయివేటుగా తీర ప్రాంతాల్లో ముడి చమురు అన్వేషణ కోసం ఈ బిల్లు వీలు కల్పిస్తోంది.

మహిళలు, ఆడపిల్లలపై పెరుగుతున్న నేరాలు

మహిళలు, ఆడపిల్లలపై దాడులు పెరుగుతున్నాయి. వారిపై చోటు చేసుకుంటున్న నేరాలు ఆందోళన కలిగించే రీతిలో పెరుగుతున్నాయి.

సగటున 86 లైంగికదాడులు కేసులు రోజువారీ నమోదవుతున్నాయని ఎన్‌సీఆర్‌బీ డేటా తెలియచేస్తోంది. 2021లో మహిళలపై ప్రతి గంటకూ 49నేరాలు జరిగాయి. 2020లో మొత్తంగా లైంగికదాడి కేసులు 28,046 నమోదు కాగా, 2021లో 31,677కి పెరిగాయి. మహిళలపై నేరాల సంఖ్య 2020లో 3,71,503గా వుండగా, 2021లో ఆ సంఖ్య 4,28,278కి పెరిగింది. అనేక కేసుల్లో నిందితుల పట్ల మోడీ ప్రభుత్వం కనబరిచే ఆదరాణాభిమానాలు నేరస్తుల్లో శిక్ష పడుతుందనే భయం లేకుండా చేసే సంస్కృతికి దారి తీస్తోంది.

ప్రామాణికమైన డేటా అంటే భయం : ప్రజల్లో నెలకొన్న రక్తహీనత, అంగ వైకల్యానికి సంబంధించిన ప్రశ్నలను జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 నుండి తొలగించడం పట్ల కేంద్ర కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

భారతదేశంలో 57శాతం మహిళల్లో, 67శాతానికి పైగా పిల్లల్లో రక్తహీనత వుందని గత సర్వేల్లో వెల్లడైంది. ఇతర కారణాలతో పోల్చుకుంటే ప్రసూతి మరణాల్లో, శిశు మరణాల్లో రక్త హీనత అనేది ప్రధాన కారణంగా వుంది. ఇక వైకల్యానికి సంబంధించిన ప్రశ్నలను తొలగించడమనేది తిరోగమన చర్య.

కచ్చితమైన డేటా పట్ల మోడీ ప్రభుత్వం భయంతో వుంది. పైగా దాన్ని ధిక్కరించే విషయంలో కూడా నిస్సంకోచంగా వ్యవహరిస్తోంది. ప్రపంచంలో అన్ని చోట్లా జనాభా లెక్కల ద్వారానే డేటాను సేకరిస్తుండగా, భారత్‌లో మాత్రం ఆ ప్రక్రియను నిరవధికంగా వాయిదా వేస్తూ వస్తున్నారు.

ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ (ఐఐపీఎస్) డైరెక్టర్ కె.ఎస్.జేమ్స్‌ను సస్పెండ్ చేయడాన్ని కేంద్ర కమిటీ ఖండించింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలను నిర్వహించేది ఈ సంస్థే. ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5లో వెల్లడించిన డేటా, బహిరంగ మల విసర్జన రహిత దేశంగా భారత్ మారిందన్న వాదన గురించి మోడీ ప్రభుత్వం చెప్పుకునేదానితో ఏ మాత్రమూ సరిపోలడం లేదు.

గిరిజనుల నిరసన ర్యాలీ

అటవీ సంరక్షణ (సవరణ) చట్టం, 2023, ఏకరూప పౌర స్మృతికి వ్యతిరేకంగా ఆగస్టు 9వ తేదీన దేశవ్యాప్తంగా నిరసనలు నిర్వహించాలని ఆదివాసీ సంస్థలు ఇచ్చిన పిలుపునకు కేంద్ర కమిటీ మద్దతు నిచ్చింది. అటవీ హక్కుల చట్టం, ఇతర చట్టాలు హామీ కల్పించిన హక్కులను ఈచట్టం తిరస్కరిస్తుంది. సాంప్రదాయ చట్టాల సంరక్షణకు రాజ్యాంగపరమైన హామీలను ఇది నేరుగా ప్రభావితం చేస్తుంది.

కేంద్ర కమిటీ పిలుపు :

1 ధరల పెరుగుదలకు నిరసనగా, ఉపాధి కల్పన కోరుతూ సెప్టెంబరు 1 నుండి 7 వరకు దేశ వ్యాప్తంగా అన్ని పార్టీ శాఖలు నిరసన వారం పాటించాలి.

2.సాధ్యమైనంత త్వరలో వామపక్షాల సదస్సును నిర్వహించే ప్రయత్నాలు చేపట్టాలి. పరస్పర అంగీకృతమైన డిమాండ్ల పత్రంపై దేశవ్యాప్త ప్రచారాన్ని చేపట్టాలి.

3.కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక, సంయుక్త కిస్సాన్ మోర్చా ప్రకటించిన కార్యాచరణకు మద్దతునివ్వాలి.

4.అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఇచ్చిన పిలుపు మేరకు అక్టోబరు 5న అఖిల భారత ఢిల్లీ ర్యాలీకి మద్దతునివ్వాలి.

చోరీ అయిన సెల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ ఫస్ట్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

చోరీకి గురవుతున్న సెల్‌ఫోన్ల రికవరీలో ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ మొదటి స్థానంలో ఉన్నదని సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీ నుంచి నుంచి మంగళవారం 7వ తేదీ నాటికి చోరులపాలైన సెల్‌ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా 67.30 శాతం రికవరీ రేటును సాధించగలిగామని ఆయన చెప్పారు. ముఖ్యంగా, భారత టెలీ కమ్యూనికేషన్ల విభాగంతో కలిసి అభివృద్ధి చేసిన సీఐఈఎఫ్ యాప్ ద్వారా చోరులపాలైన సెల్‌ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సిగ్నల్స్ ద్వారా పసిగట్టటం జరుగుతున్నదని ఆయన అన్నారు. ఇప్పటి వరకు 5030 సెల్‌ఫోన్లను వారి స్వంతదారులకు అప్పగించటం జరిగిందని తెలిపారు. సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు తమ సెల్ ఈఎంఐఈ నెంబర్‌తో సహా స్థానిక పోలీసు స్టేషన్లో గానీ, ఈ-సేవా కేంద్రాల్లోగానీ వెంటనే ఫిర్యాదు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పోయిన సెల్‌ఫోన్లను గుర్తించటంలో సాధారణంగా 16 నుంచి 30 రోజులు పడుతున్నదని ఆయన తెలిపారు. కాగా, సెల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలవగా.. కర్నాటక, ఏపీ రాష్ట్రాలు రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయని అన్నారు. సీఐడీ, స్థానికపోలీసులతో పాటు భారత టెలీకమ్యూనికేషన్ విభాగాలు సంయుక్తంగా చోరులపాలైన సెల్‌ఫోన్ల గుర్తింపులో సంయుక్తంగా దర్యాప్తు జరుపుతూ ఫలితాలను సాధిస్తున్నాయని తెలిపారు.

నోరుజారిన పియూష్ గోయల్

- 'న్యూస్‌క్లిక్'తో ప్రతిపక్షాలకు సంబంధమంటూ తప్పుడు ఆరోపణలు
- సభా హక్కుల కింద నోటీసులివ్వడంతో వెనక్కి

న్యూఢిల్లీ : స్వతంత్ర మీడియా సంస్థ 'న్యూస్‌క్లిక్'కు ప్రతిపక్షాలకు చెందిన పలువురు నేతలకు సంబంధముందని, వారంతా 'ట్రాయిటర్స్' (ద్రోహులు) అంటూ రాజ్యసభ సభానాయకుడు, కేంద్ర మంత్రి పియూష్ గోయల్ తప్పుడు ఆరోపణలు చేశారు. దీనిపై ప్రతిపక్ష కూటమి ఇండియాకు చెందిన టిఎంసి, ఆప్, ఆర్‌జెడి, డిఎంకె, ఆర్‌జెడి, జెడియు, ఎన్‌సిపి, వామపక్షాల నేతలు సభా హక్కుల కింద నోటీసులు ఇచ్చారు. గోయల్ చేసిన కొన్ని వ్యాఖ్యలపై ఫిర్యాదు చేస్తూ రాజ్యసభ ఛైర్మన్‌కు ఇండియా పార్టీలు నోటీసులిచ్చాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రతిపక్ష నేతలందరినీ ద్రోహులుగా పేర్కొంటూ గోయల్ వ్యాఖ్యలు చేసినందుకు సభా హక్కుల నోటీసును అందచేసినట్లు కాంగ్రెస్ ఎంపి జైరాం రమేష్ ట్విట్టర్‌లో తెలిపారు. ఇండియా పార్టీల నేతలపై తీవ్ర అభ్యంతకరకరమైన రీతిలో, పూర్తిగా ఆమోదయోగ్యం కాని రీతిలో చేసిన వ్యాఖ్యలకు గానూ గోయల్ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేస్తున్నా అందుకు తిరస్కరిస్తున్నారని రమేష్ తెలిపారు. సభా వేదికగా ఆయన క్షమాపణ చెప్పాల్సిందేని డిమాండ్ చేశారు.



అమరుల ఆశయాలకనుగుణంగా ఆర్టీసీ విలీన ప్రక్రియ

- విలీనానికి ముందే బకాయిలు విడుదల చేయాలి
- ఆర్టీసీ జేఏసీ నాయకుల డిమాండ్
- సూర్యాపేట డిపోలో అమరులకు నివాళి

నవతెలంగాణ-సూర్యాపేట

ఆర్టీసీ సమ్మె సందర్భంగా 2019లో అమరులైన కార్మికుల ఆశయాలకు తగ్గట్టుగా సంస్థ విలీన ప్రక్రియ చేపట్టి విధివిధానాలు ఖరారు చేయాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డిపోలో కార్మికులు అమరుల చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. పలువురు ఆర్టీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ కార్మికుల పాత్ర ఎనలేనిదని, బస్సు చక్రం ఆగితేనే తెలంగాణ సాధించుకోగలిగామని గుర్తు చేశారు. సాధించుకున్న తెలంగాణలో కూడా హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు తప్పలేదన్నారు. 2015, 2019లో సమ్మె చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, ఈ పోరాటంలో 35 మంది కార్మికులు అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు సంస్థను, కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందడం స్వాగతిస్తున్నామని తెలిపారు. కానీ అమరులు ఆశించిన విధంగా విలీన ప్రక్రియ చేపట్టి కార్మికుల హక్కులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. 2017, 2021 వేతన సవరణ చేసి, 2013 వేతన సవరణ బకాయిలు, సీసీఎస్, పీఎఫ్ తదితర బకాయిలను విలీనానికి ముందే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వేసిన ఉపసంఘం కార్మిక సంఘాలతో చర్చించి మెరుగైన వేతనాలు, సర్వీస్ కండిషన్స్ ఇవ్వాలన్నారు. ఆర్టీసీ విస్తరణ కోసం కొత్తబస్సులను కొనుగోలు చేసి ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు బత్తుల సుధాకర్, డోన్‌వాన్ రవికుమార్, లచ్చయ్య, పీఎం రావు, సేవ్య, లక్ష్మయ్య, రాఘవులు, హనుమంత్, శ్రీకంట్లం, రమేశ్, నాగిరెడ్డి, పరుశరాములు, ఇంద్రయ్య, పీసీ శేఖర్, అజారుద్దీన్, స్వామి వెంకన్న, టీజేఎం రెడ్డి, నాగేందర్, మంజుల, సైదమ్మ, రూపావతి, ఇందిర పాల్గొన్నారు.

అమెజాన్ అడవుల పరిరక్షణకు కొత్త ప్రణాళిక

- లాటిన్ అమెరికా దేశాల అధినేతల ప్రతిన

బెలెం (బ్రెజిల్): అమెజాన్‌లో అడవుల పరిరక్షణకు లాటిన్ అమెరికా దేశాల అధ్యక్షులు ప్రతిన బూనారు. భూగోళంపై ఉన్న అతిపెద్ద ఉష్ణ మండల అదవును నాశనం చేసే విధ్వంస చక్రాన్ని నిలుపు జేసేందుకు కొత్త అభివృద్ధి నమూనాను ప్రోత్సహించాలని ఈ దక్షిణ అమెరికా దేశాలు తీర్మానించాయి. అటవీ నిర్మూలన, అక్రమ మైనింగ్, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కారణంగా అడవులు ఎక్కువగా హరించుకుపోతున్నాయని వారు పేర్కొన్నారు. అమెజాన్ అటవీ నిర్మూలనను ఆపేందుకు బ్రెజిల్ అమెజాన్ అడవులకు ముఖ ద్వారంగా ఉన్న పారా రాష్ట్రంలోని బెలెంలో బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా అధ్యక్షతన ఇక్కడ శిఖరాగ్ర సదస్సు జరుగుతోంది. సోమవారం జరిగిన విదేశాంగ, పర్యావరణ మంత్రుల స్థాయి సమావేశం బెలెం డిక్లరేషన్ ముసాయిదాను ఖరారు చేసింది. ఇందులో దాదాపు 130 అంశాలున్నాయి. అడవులను నిలబెట్టే ప్రణాళిక ఉంది. 63 లక్షల చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం కలిగి, 5 కోట్ల మందికి ఆసరాఆ ఉన్న అమెజాన్ అడవులను మునుపటి బోల్సనారో ప్రభుత్వం తగులబెట్టింది.

లూలా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమెజాన్ అడవుల నిర్మూలనను చాలా వరకు కట్టడి చేశారు. ఈ అడవుల్లో ఉంటున్న మూలవాసీ తెగల జీవన స్థితిగతుల మెరుగుదలకు పలు చర్యలు చేపట్టారు. అటవీ నిర్మూలనను పూర్తిగా ఆపేందుకు నిర్దిష్ట గడువును విధించడం, కొత్త ప్రాంతాలు, మూలవాసీలు ఉండే భూ భాగాల ద్వారా 80 శాతం బయోమ్‌ను రక్షించడం, వాతావరణ అత్యవసర పరిస్థితిని అమెజాన్‌లో ప్రకటించడం వంటి పలు సూచనలు, సలహాలు సైంటిఫిక్ కమ్యూనిటీ, ఎన్‌జీవో ల నుంచి ఈ సదస్సు స్వీకరించింది. అమెజాన్‌కు తిరిగి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు, అలాగే మూలవాసీల హక్కుల రక్షణకు మధ్య సమతుల్యతను సాధించాలని ముసాయిదా డిక్లరేషన్ పేర్కొంది.

డిమాండ్లకు 'మహా' సర్కారు ఓకే

ప్రయివేటు బస్సు డ్రైవర్ల సమ్మె విరమణ

ముంబయి : మహారాష్ట్రలో బహన్ ముంబయి ఎలక్ట్రిక్ సప్లై అండ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్ (బెస్ట్) ప్రయివేటు బస్సు డ్రైవర్ల సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. జీతాల పెంపుతో పాటు ఇతర డిమాండ్లను నెరవేరుస్తామని సీఎం ఏక్‌నాథ్ షిండే హామీ ఇవ్వటంతో బెస్ట్‌లోని ప్రయివేటు బస్సు ఆపరేటర్ల ఉద్యోగులు తమ ఆందోళనను విరమిస్తున్నట్టు ప్రకటించారు. 'బెస్ట్' లీజుకు తీసుకున్న 1,600 బస్సుల్లో 551 బస్సులు రోడ్లపైకి వెళ్లాయి. ఆందోళనలో భాగంగా ఏడో రోజు సమ్మెలో కార్మికులు ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. తమ ప్రతినిధి బృందం సోమవారం అర్ధరాత్రి తర్వాత సీఎం షిండేతో సమావేశమైందని కాంట్రాక్టు ఉద్యోగుల ప్రతినిధి ఆజాద్ తెలిపారు. ఆందోళన చేస్తున్న ఉద్యోగుల డిమాండ్లను నెరవేరుస్తామని షిండే హామీ ఇచ్చినట్టు చెప్పారు. " జీతాల పెంపుదల, బోనస్, లీవ్‌లు, ఉచిత బస్ రైడ్‌ల గురించి మా ప్రాథమిక డిమాండ్లు ఆమోదించబడ్డాయి. అందుకే సమ్మె విరమించాం" అని ప్రయివేటు బస్సు ఆపరేటర్ల ఉద్యోగుల బృందం సమన్వయకర్త వికాస్ ఖర్మలే తెలిపారు.

ఆదివాసీ వ్యక్తిపై బీజేపీ నేత జులుం

- అసభ్య పదజాలంతో దూషణ..దాడి
- మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో ఘటన

ముంబయి : బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆదివాసీలు, దళితులు, మహిళలపై దాడులు తీవ్రమవుతున్నాయి. మణిపూర్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని ఘటనలు మరవకముందే మహారాష్ట్రలో మరొకటి చోటు చేసుకున్నది. పాల్ఘర్ జిల్లాలోని స్థానిక బీజేపీ నాయకుడు భరత్ రాజ్‌పుత్, మరో ముగ్గురు గిరిజన వ్యక్తి(57)పై దాడికి దిగారు. అసభ్య పదజాలంతో దూషించారు. కీలక నిందితుడైన భరత్ రాజ్‌పుత్.. బీజేపీ పాల్ఘర్ జిల్లా విభాగానికి కొత్త అధ్యక్షుడిగా ఇటీవల నియమితులయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు నవపాడ గ్రామానికి చెందిన ఆదివాసీ వ్యక్తి. ఇతను ఒక రైతు, సామాజిక కార్యకర్త. గ్రామంలో రోడ్లు, నీటికి సంబంధించిన సమస్యలను చెప్పాలని ఈనెల 4న ఒక స్థానిక సంస్థ ఆయనను ఆహ్వానించింది. ఆ తర్వాత బాధితుడికి రాజ్‌పుత్ నుంచి ఫోన్ వచ్చింది. తన కార్యాలయంలో తనను కలవాలని బాధితుడిని అడిగాడు. అయితే, బాధితుడు ఇతర సంస్థకు చెందిన వ్యక్తులతో రాజ్‌పుత్ కార్యాలయ పరిసరాల్లోకి వచ్చాడు. దీంతో కోపోద్రేక్తుడైన రాజ్‌పుత్, ఆయన అనుచరులు బాధితుడిపై దూషణకు దిగారు. ఆయనను కొట్టారు. కులంపేరుతో దారుణంగా తిట్టారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు.. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. రాజ్‌పుత్ సోదరుడు జగదీష్‌తో పాటు విశాల్ నందాల్కర్, రాజేష్ ఠాకూర్‌ల పేర్లను నిందితులుగా ఎఫ్‌ఐఆర్‌లో చేర్చారు.

మణిపూర్‌లోని బిష్ణుపూర్ నుంచి అసోం రైఫిల్స్ సిబ్బంది ఉపసంహరణ

- సీఆర్పీఎఫ్, రాష్ట్ర పోలీసులతో భర్తీ

ఇంఫాల్: గత వారం హింస చెలరేగిన మణిపూర్‌లోని బిష్ణుపూర్‌లో గల మొయిరాంగ్ లాంఖాయ్ చెక్‌పాయింట్‌లో ఉన్న అస్సాం రైఫిల్స్(ఏఆర్) సిబ్బందిని ఉపసంహరించారు. ఈ సిబ్బంది స్థానంలో సీఆర్పీఎఫ్, రాష్ట్ర పోలీసులను మోహరించారు. ఈ మేరకు సంబంధిత అధికారులు ఒక నోటిఫికేషన్‌ను జారీ చేశారు. జాతి కలహాలతో దెబ్బతిన్న రాష్ట్రం నుంచి పారామిలటరీ బలగాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం లోయ జిల్లాల్లో అనేక మహిళా సంఘాలు ప్రదర్శనను ప్రారంభించాయి. ఈ తరుణంలోనే అస్సాం రైఫిల్స్ ఉపసంహరణ జరగటం గమనార్హం. అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) ఎల్ కైలున్ జారీ చేసిన నోటిఫికేషన్‌లో "బిష్ణుపూర్ నుంచి కంగ్వాయ్ రోడ్‌లోని మోయిరాంగ్ లాంఖాయ్ వద్ద చెక్‌పాయింట్‌లో సివిల్ పోలీసులు, 128 బిఎన్ సీఆర్పీఎఫ్ 9 ఏఆర్‌ల స్థానంలో ఉంటారు. తదుపరి ఆదేశాల వరకు ఇది వెంటనే తక్షణ అమలులోకి రానున్నది" పేర్కొన్నారు. మే 3న మణిపూర్‌లో జాతి ఘర్షణలు చెలరేగడంతో 160 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది గాయాలపాలైన విషయం తెలిసిందే. అల్లర్లను కట్టడి చేయటంలో కేంద్ర, రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాలు విఫలమయ్యాయని సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

మధ్యప్రదేశ్‌లో దారుణం

- రేవాలో ఇద్దరు బాలికలపై సామూహిక లైంగికదాడి
- ఆలస్యంగా వెలుగులోకి..
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- ఐదుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

భోపాల్ : బీజేపీ పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో దారుణం చోటు చేసుకున్నది. రేవా జిల్లాలో ఇద్దరు బాలికలపై సామూహిక లైంగికదాడి జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారటంతో రంగంలోకి దిగిన పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. 25 రోజుల క్రితం హనుమాన పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో బయటకు రావటంతో ఇది వెలుగులోకి వచ్చింది. లైంగికదాడి బాధితులు 14, 16 ఏండ్ల వయసు వారని అధికారులు తెలిపారు. అడవిలో మేత కోసం మేకలను తీసుకువెళ్లారని తెలిపారు. ఆ సమయంలో అక్కడ తిరుగుతున్న కొందరు వ్యక్తులు బాలికలపై లైంగికదాడి చేసి వీడియో చిత్రీకరించారని అధికారి వివరించారు. " ఈ ఘటన గురించి బాలికలు ఎవరికైనా చెబితే వీడియోను సోషల్ మీడియాలో పెడతామని నిందితులు బాధితులను బెదిరించారు. వీడియో సోషల్ మీడియాలో కనిపించడంతో, పోలీసులు దర్యాప్తు ప్రారంభించి బాధితులను కనుగొన్నారు. నిందితులు తమను బెదిరించడంతో భయపడ్డామనీ, అందుకే ఈ విషయమై ఫిర్యాదు చేయలేదని బాలికలు పోలీసులకు తెలిపారు. బాధితులు, వారి కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఏడుగురిపై కేసు నమోదు చేశారు. వారిలో ఐదుగురిని అరెస్టు చేశాం.మరో ఇద్దరి కోసం గాలిస్తున్నాం" అని అధికారి తెలిపారు. నిందితులపై ఐపీసీతో పాటు లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ (పోక్సో) చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు వివరించారు. ఈ ఘటనపై మహిళా సంఘాలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి. రాష్ట్రంలోని మహిళలకు భద్రతను కల్పించటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించాయి.

ఎస్సీ రిజర్వుడు స్థానాలతోపాటు జనరల్ సీట్లలో దళితులకు అవకాశం కల్పించాలి

- టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మెన్ ప్రీతమ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎస్సీ రిజర్వుడు స్థానాలతోపాటు అర్హులైన దళిత నాయకులకు జనరల్ స్థానాల్లోనూ అవకాశం కల్పించాలని టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మెన్ ప్రీతమ్ పార్టీని కోరారు. ఎస్సీ విభాగంలో సీనియర్ నేతలకు పీసీసీ కార్యవర్గంలో చోటు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎస్సీ విభాగం ప్రీతమ్ అధ్యక్షతన సమావేశమైంది. దీనికి ఏఐసీసీ చైర్మెన్ రాజేష్ లిలోతియ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. త్వరలో దళిత విద్యార్థులు, మేధావులు, ఉద్యోగస్తులతో చర్చలు జరిపి వారి అభిప్రాయాలను తీసుకుంటామన్నారు. అ తర్వాత దళిత డిక్లరేషన్‌ను ప్రకటిస్తామన్నారు.

'సియాసత్' జహీరుద్దీన్ కుటుంబాన్ని పరామర్శించిన డీజీపీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : ప్రజాగాయకుడు గద్దర్ అంతిమ యాత్రలో పాల్గొంటూ గుండెపోటుకు గురై మరణించిన సియాసత్ ఉర్దూ దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ కుటుంబ సభ్యులను డీజీపీ అంజనీ కుమార్ పరామర్శించారు. లక్డీకాపూల్‌లోని జహీరుద్దీన్ నివాసానికి వెళ్లిన డీజీపీ ఆయన హఠాన్మరణం పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని కుటుంబీకులకు తెలియజేశారు. సియాసత్ వంటి ప్రముఖ ఉర్దూ పత్రికకు మేనేజింగ్ ఎడిటర్‌గా ఉండటమేగాక, ఉన్నతమైన పాత్రికేయ విలువలను కాపాడటంలో చేసిన కృషి ఎనలేనిదని ఆయన అన్నారు.